# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

25.11.2025 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 150 | పేజీలు : 8 Pages : 8 | వెల రూ.2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


## సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం

- రాష్ట్రపతి చేతుల మీదుగా బాధ్యతల స్వీకరణ
- ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, సీఎం రేవంత్ హాజరు
- హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు



04

## సమయమివ్వండి



### ఆయుధాలు వదిలేస్తాం..

- మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి
- కూంబింగ్ చర్యలు ఆపాలని షరతులు
- మావోయిస్టుల లేఖ

04

### మరో 15మంది లొంగుబాటు

## బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి



కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స

సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి

స్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు

భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు.

08



## మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అధికారులతో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

02

“మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్దబోతు న్నానన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభ మవుతాయి. నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాం అని అన్నారు.”



# చదువుతోనే భవిష్యత్

## కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్

- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి

అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌కు శ్రీకారం



- గతంలో ఎవరు సీఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- సొంత నియోజకవర్గం పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**కొడంగల్, నవంబరు 24:** కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా

మిగతా 2 లో



త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు.



## ఎకరం 137.25 కోట్లు

కోకాపేటలో తిరగరాసిన రికార్డులు

.. వివరాలు 2లో



## నేడు అయోధ్యకు ప్రధాని

రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ

.. వివరాలు 2లో



## గంజాయి, మాదకద్రవ్యాల పట్టివేత

దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ఎస్ఓటీ పోలీసులు

.. వివరాలు 2లో



## ఇండిగో విమానానికి తప్పిన ప్రమాదం

.. వివరాలు 4లో

## మిస్టీరియస్ డెత్!?

05



అమ్మా-నాన్న' తరచూ గొడవ పడుతున్నారని ఎనిమిదో క్లాస్ విద్యార్థి ఆత్మహత్య

- మళ్లీ గొడవపడమని రాసుకున్న 'అగ్రిమెంట్ పేపర్'పై భార్యాభర్తల సంతకం తండ్రే చేశాడని కొడుకు మనస్తాపం
- ఆ చిన్నారి బాలుడి 'ఆత్మహత్య'పై భిన్న కథనాలు

## తిరుచానూరులో వైభవంగా రథోత్సవం

తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు.

04





# సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో ప్రమాదం

## సెంట్రింగ్ కూలి ముగ్గురు కార్మికుల దుర్మరణం

**హైదరాబాద్,నవంబరు 24 :** సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో సోమవారం ప్రమాదం జరిగింది. భవనం మరమ్మతులు చేస్తుండగా.. సెంట్రింగ్ కుప్పకూలింది. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో ముగ్గురు కార్మికులు మరణించారు. ఈఎస్ఐలోని అత్యవసర విభాగంలో ఆధునీకరణ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రిలోని ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. శ్లాబ్ పెచ్చులు మీద పడడంతో.. వాటిని తొలగించి కార్మికుల మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. వివరాలు సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈఎస్ఐ ఆసుపత్రికి చేరుకున్నారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు.


# ఎకరం 137.25 కోట్లు

## కోకాపేటలో తిరగరాసిన రికార్డులు

**హైదరాబాద్,నవంబరు 24 :** హైదరాబాద్ కోకాపేటలో ప్లాట్లు రికార్డు ధర పలికాయి. నియోపోలిస్ దగ్గర రికార్డు స్థాయిలో ప్లాట్లు అమ్ముడుపోయినట్లు తెలుస్తోంది. ఎకరం ధర రూ.137.25 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గత రికార్డులను ఇది తిరగరాసింది. అధికారులు ప్లాట్ నెంబర్ 17, 18కి ఈ వేలం నిర్వహించారు. అధికారిక సమాచారం ప్రకారం.. ప్లాట్ నెం. 17లో 4.59 ఎకరాలు ఉండగా ఈ వేలంలో ఎకరానికి రూ. 136.50 కోట్లు పలికింది. ప్లాట్ నెం 18లో 5.31 ఎకరాలు ఉండగా ఎకరానికి రూ.137.25 కోట్లు పలికింది. వేలంలో 9.90 ఎకరాలకుగాను ఊఓఆంకి రూ.1,355.33 కోట్లు ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. కోకాపేటలో మిగిలిన భూములను నవంబర్ 28వ తేదీన అధికారులు వేలం వేయనున్నారు. కాగా, నియోపోలీస్ లేఅవుట్‌లో అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో దిగ్గజ రియల్ ఎస్టేట్ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడుతున్నాయి. అంతేకాకుండా, ఇక్కడ ఎన్ని అంతస్తులు నిర్మించాలన్నదానిపై పరిమితి కూడా లేదని తెలుస్తోంది. ఫ్లోర్స్ విషయంలో లిమిట్ లేకపోవడంతో కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు నిర్మించుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ అటు ఓఆర్ఆర్‌కు ఇటు రాయదుర్గం ఐటి కంపెనీలకు దగ్గరగా ఉండటంతో కోకాపేట భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

# నేడు అయోధ్యలో ప్రధాని పర్యటన

## రామాలయంపై పతాకాన్ని ఆవిష్కరించనున్న మోడీ



**అయోధ్య,నవంబరు 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం అయోధ్యలో పర్యటిం చనున్నారు. ఇక్కడి రామ జన్మభూమి మందిర్‌ను దర్శించనున్నారు. రామాలయ నిర్మాణం పూర్తయినందుకు సంకేతంగా శ్రీరామజన్మ భూమి మందిర శిఖరంపై పతాకాన్ని ఆయన ఆవిష్కరిస్తారు. ఈ ఘట్టం దేశ సామాజిక, సాంస్కృతిక ఆధ్యాత్మిక ప్రయాణంలో మరో మైలురాయిగా పేర్కొంటున్నారు. ఇదేరోజు మార్గశిర మాసంలోని శుక్లపక్షంలో వచ్చే పంచమి కావడం, ఇదే అభిజిత్ ముహూర్తంలో సీతారాముల వివాహ పంచమి కూడా కావడం విశేషం. సిక్కుల 9వ గురువు గురుతేజ్ బహదూర్ ఆత్మబలిదాన దినోత్సం కూడా ఇదే రోజు వస్తోంది. 17వ శతాబ్దంలో అయోధ్యలో గురుతేజ్ బహదూర్ 48 గంటల సేపు ధ్యానం చేశారు. ప్రధానమంత్రి మంగళవారం ఉదయం 10 గంటలకు వశిష్ట, విశ్వామిత్ర, అగస్త్య, వాల్మీకి, దేవి అహల్య, నిషదరాజు గుహుడు, శబరి మాత మందిరాలతో కూడిన సప్తమందిర్‌ను దర్శిస్తారు. 11 గంటలకు శేషావతార్ మందిర్, మాతా అన్నపూర్ణ మందిరా లను దర్శించుకుంటారు. రామ దర్బార్ గర్భగృహం, రామలీలా గర్భగృహంలో పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో శ్రీ రామజన్మ భూమి మందిర్ శిఖరంపై కాషాయం రంగు పతాకాన్ని ప్రధాని ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా రామరాజ్యం ఆదర్శాలు, జాతీయ సమైక్యత, భారతదేశ సమున్నత వారసత్వంపై ప్రధాని ప్రసంగిస్తారు. రామమందిరా నికి సహాయం చేసిన దాతలను ఈ వేడుకలకు అధికారికంగా ఆహ్వానించనున్నట్టు ట్రస్ట్ ఇప్పటికే ప్రకటించింది. దేశం నలుమూలల నుంచి సుమారు 8000 మంది ఆహ్వానితులు ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు

# డబుల్ ఇళ్ల పేరుతో వసూళ్లు

**సంగారెడ్డి,నవంబరు 24:** సంగారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని పేదలను నమ్మించి ఓ వ్యక్తి మోసం చేశాడు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటకు చెందిన బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి ప్రసన్న కుమార్‌పై బాధితులు ఆరోపణలు చేస్తున్నారు. జోష్ బ్రదర్ అనే మధ్యవర్తి ద్వారా పరిచయమైన ప్రసన్న కుమార్.. ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ. 3 లక్షల నుంచి నాలుగైదు లక్షలు వసూలు చేశాడని పేర్కొంటున్నారు. మొత్తం 69 మంది దగ్గర నుంచి రూ. రెండు కోట్ల 50 లక్షల రూపాయల వరకు మోసం చేశాడని ఆరోపణలు చేస్తున్నారు. అయితే, జోష్ అనే వ్యక్తి ద్వారా డబ్బులను ప్రసన్న కుమార్ దండుకున్నాడు.. 2021 నుంచి నేడు, రేపు ఇప్పిస్తామంటూ ప్రసన్న కుమార్ మాయమాటలు చెప్తున్నాడని బాధితులు పేర్కొంటున్నారు. అయితే, కిష్టారెడ్డిపేటలోని ప్రసన్న కుమార్ ఇంటికి వెళ్తే వాచ్ మెన్, కుక్కలతో దాడి చేయించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ లో బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి ప్రసన్నకుమార్ పై ఫిర్యాదు చేశారు. జోష్ ను నిలదీయగా ప్రసన్న కుమార్ కే మొత్తం డబ్బులు ఇచ్చానని చెప్తున్నాడు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్




మొదటి పేజీ తరువాయి

తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయి. 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజలకు కోట్ల రూపాయలు ఇవ్వలేనని.. పిల్లలకు అంతకంటే విలువైన చదువు చెప్పించగలనని అన్నారు. చదువు జీవితాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. అందులో భాగంగా కొండంగల్ లో 5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రూ.103 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, పట్టణాభివృద్ధి నుంచి విద్య, సంక్షేమం వరకు అనేక రంగాల్లో ఈ పనులు ప్రారంభమవడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా, నియోజకవర్గంలో మొత్తం 28 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.5.83 కోట్లు, పాఠశాలల్లో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.5.01 కోట్లు కేటాయించారు. గ్రామీణ పరిపాలనను బలోపేతం చేసేందుకు 10 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. బంజారా భవన్‌లో అదనపు సౌకర్యాల కోసం కాంపౌండ్ వాల్, డైనింగ్ హాల్, నీటి సరఫరా, విద్యుదీకరణకు కలిపి రూ.3.65 కోట్లు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, ప్రొహిబిషన్ / ఎక్సైజ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1 కోటి, అగ్నిమాపక కేంద్రానికి రూ.1.30 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.1.40 కోట్లు కేటాయించారు. అలాగే కమ్యూనిటీ హాళ్లు, కిచెన్ షెడ్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణానికి రూ.4.91 కోట్లు, సీసీ రోడ్లు , భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.4.45 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇప్పటికే నిర్మించిన అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయ భవనాల ప్రారంభోత్సవం కూడా ఈ సందర్భంగా జరిగింది, వీటి కోసం రూ.2.95 కోట్లు వెచ్చించారు. కొడంగల్ పట్టణ అభివృద్ధి దిశగా అత్యంత కీలకంగా పరిగణిస్తున్న రోడ్డు విస్తరణ పనులకు ఒక్కటే రూ.60 కోట్లు కేటాయించగా, కొత్త గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కోస్గి వ్యవసాయ మార్కెట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.4.50 కోట్లు మంజూరు చేయడం రైతులకు ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం ప్రాజెక్టులు కొడంగల్ నియోజకవర్గపు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తాయని, ఈ ప్రాంత ప్రజల అవసరాలను తీర్చడంలో పెద్ద అడుగుగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

# మహిళా స్వయం సహాయక సంఘాలకు 304 కోట్లు

## విడుదలకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

## అధికారులో డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్,నవంబరు 24:** మహిళా స్వయం సహాయక సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. ఈ మహిళా సంఘాలకు రూ. 304 కోట్ల వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం విడుదల చేసింది. 3,57,098 గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో ఈ నిధులను జమ చేసింది. సోమవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ నిధులను మహిళలకు అందచేయనున్నారు. నియోజకవర్గాల వారీగా కార్యక్రమం జరుగుతుందని డిప్యూటి సిఎం భట్టి వెల్లడించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క.. ఏటూరు నాగారం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని తెలిపారు.ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వేల కోట్ల రూపాయల నిధులను సమకూరుస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే వాటిని చెల్లిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ. 3,500 కోట్ల వడ్డీలను ఎగవేసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై ఈ సందర్భంగా సీతక్క మండిపడ్డారు. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లోని మహిళల పొదుపు సొమ్మును సైతం గత ప్రభుత్వం కాజేసిందని విమర్శించారు. అక్కా చెల్లెమ్మల కష్టార్జితమైన అభయహస్తం నిధులను కూడా ప్రభుత్వం మింగేసిందన్నారు. కానీ తమ ప్రజా ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఎన్నో పథకాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. మహిళలకు నిధులను సమీకరించడమే కాదు.. ఈ వడ్డీలను కూడా సకాలంలో చెల్లిస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల కష్టాన్ని కాజేసి కన్నీళ్ళకు కారణమైన బీఆర్ఎస్ పెద్దలకు మహిళా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదంటూ ఆ పార్టీ నేతలకు సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం



చేసేందుకు ప్రతి ఏడాది రూ. 25 వేల కోట్లు తగ్గకుండా బ్యాంక్ లింకేజీ రుణాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని సీతక్క వివరించారు. ఈ సంఘాలకు క్రమం తప్పకుండా వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం అందిస్తుంది. తాజాగా రూ. 304 కోట్లు నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మహిళా సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినాయి.

# వేధింపుల భర్తను కడతేర్చిన భార్యలు

## పెట్రోల్ పోసి నిప్పంటించిన ఇద్దరు పెళ్లాలు



**నిజామాబాద్, నవంబర్ 24:** మద్యం సేవించి తరచూ వేధిస్తున్న భర్తను ఇద్దరు భార్యలు కలసి మట్టుబెట్టారు. దారుణంగా హత్య చేశారు. ఆయన ఇద్దరు భార్యలు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం దేవక్కపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవక్కపేటకు చెందిన మలవత్ మోహన్ (42)కు ఇద్దరు భార్యలు కవిత, సంగీత ఉన్నారు. మోహన్ తరచూ మద్యం తాగుతూ.. భార్యలతో గొడవ పడుతుండేవాడు. ఆదివారం రాత్రి వారిద్దర్నీ గదిలో బంధించాడు. దీంతో విసిగిపోయిన భార్యలిద్దరూ అతడిని వదిలించుకోవాలనుకున్నారు. పథకం ప్రకారం.. సోమవారం ఉదయం పెట్రోల్ కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న మోహన్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో మంటలు అంటుకొని మోహన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం వారిద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈఘటన గ్రామంలో సంచలనం రేపింది. సర్వత్రా ఇదే అంశంపై చర్చించారు. భార్యల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# తమిళనాడులో రోడ్డు ప్రమాదం

## రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొని ఆరుగురు దుర్మరణం

**చెన్నై, నవంబర్ 24:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తెనకాశీ–మదురై రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ప్రైవేటు బస్సులు ఒకదాన్నొకటి ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. మరో 28 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మదురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు.. తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం దాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికం గా నిర్ధరించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, సీసీటీవీ ఫుటేజ్‌లను సేకరిస్తున్నామని తెలిపారు. ప్రమాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





# మాదాపూర్‌లో గంజాయి, మాదకద్రవ్యాల పట్టివేత

## దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ఎస్‌వోటి పోలీసులు

**హైదరాబాద్,నవంబరు 24:** మాదాపూర్ జోన్ పరిధిలో ఎస్‌ఓటీ పోలీసులు భారీ ఎత్తున డ్రగ్స్‌ను పట్టివేశారు. సోమవారం మొదట మాదాపూర్‌లో 41కిలోల గంజాయి, 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 1.170గ్రాముల అల్ప్రజోలంనుమాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. మూడు చోట్ల డ్రగ్స్ రాకెట్ ను బస్ట్ చేశారు పోలీసులు. ఈ సందర్భంగా మొదటి కేసుకు సంబంధించి డ్రగ్స్ పట్టివేతకు సంబంధించిన వివరాలను వెల్లడించిన మాదాపూర్ జోన్ డీసీపీ రీతిరాజ్.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పది లక్షల రూపాయల విలువ చేసే 1.170 గ్రాముల అల్ప్రజోలం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో గౌండ్ల బాల మురళి కృష్ణ(38) అనే వ్యక్తి చుట్టు పక్కల దుకాణాల్లో సప్లై చేస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ పట్టుకున్నట్లు తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల కోసం బెంగుళూరు నుండి తెచ్చినట్లు గుర్తించారు. హరీష్, సాయి కృష్ణ, సాయి మణికంఠ అనే ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారి నుంచి ఒక లక్ష 50 వేల విలువ చేసే 15 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. మూడో కేసులో కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 41కిలోల గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు డీసీపీ రీతిరాజ్. వెస్ట్ బెంగాల్ నుంచి తెచ్చిన గంజాయిని.. హైదరాబాద్ లో బీహార్ కూలీలకు అమ్ముతున్నారని తెలిపారు. వెస్ట్ బెంగాల్ నుండి సికింద్రాబాద్ వరకు ట్రైన్ లో తెచ్చి అమ్ముతున్నారని చెప్పారు. ఈ కేసులో మిథున్ బర్మాన్, సడెన్ రాయ్, రీజల్ ÷క్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారినుంచి 21లక్షల రూపాయల విలువ చేసే 41.9కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం 25 నవంబర్ 2025 కరీంనగర్ 3

# జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కౌన్సిల్ సమావేశంలో సమస్యలపై పోరాడాలి
- గ్రేటర్ కార్పోరేటర్లకు కేటీఆర్ దిశానిర్దేశం



**హైదరాబాద్, నవంబర్ 24 :** జీహెచ్‌ఎంసీ ఎన్నికలు ఎప్పుడు పెట్టినా సిద్ధంగా ఉండాలనిబీ ఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అలాగే మంగళవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో బల్దియాలోని సమస్యలు ప్రస్తావించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక భూముల అమ్మకంపై నిలదీయాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మంగళవారం జరుగనున్న గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు వివిధ అంశాలపై కేటీఆర్ మార్గదర్శనం చేశారు. పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ఎలాంటి అవినీతికి తావు లేకుండా అద్భుతంగా పదవీకాలం పూర్తి చేసుకోబోతున్నారని పార్టీ తరపున వారికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా రెండోసారి జీహెచ్‌ఎంసీలో గెలిచిన తర్వాత కరోనా వంటి తీవ్ర సంక్షోభంలోనూ అద్భుతమైన సేవలను అందించిన విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రజలు పార్టీకి ప్రతిపక్షంగా బాధ్యత ఇచ్చిన తర్వాత హైదరాబాద్ నగరంలో ఉన్న కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై పోరాటం చేసిన తీరును అభినందించారు. మొన్నటికి మొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కార్పొరే ఓటర్లు బాధ్యతాయుతంగా ఎన్నికలను పోరాడిన విధానంపై అభినందనలు తెలిపారు. పార్టీ వెంటే నిలబడిన ప్రతి ఒక్క కార్పొరేటర్‌కి భవిష్యత్తులో మరిన్ని పదవులు వస్తాయని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు భవిష్యత్తులో జరిగే ఎన్నికను తమ ఎన్నికగా తీసుకొని పార్టీ అందరినీ తిరిగి గెలిపించుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్పొరేటర్లకి రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మృగ్యం

- వసతుల కల్పనకు కేంద్రం చర్యలు
- సక్రమంగా వినియోగించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జమ్మికుంటలో ఆధునిక వైద్య పరకరాలు ప్రారంభించిన బండి



**కరీంనగర్,నవంబరు 24:** పేద ప్రజలు అత్యవసర చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను విశ్వసించి వస్తారని, ఆ నమ్మకాన్ని పెంపొందించే దిశలో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బండి సంజయ్ తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ అవకాశాలను సక్రమంగా వినియోగించుకోలేక పోతుందని ఆయన విమర్శించారు. జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి యాభై లక్షల రూపాయల సిఎస్సార్ నిధులతో కొనుగోలు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవల బలోపేతంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేక పేదలకు నమ్మకం తగ్గిపోతున్నదని, ఈ పరిస్థితిని మార్చడానికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఇప్పటివరకు సిఎస్సార్ నిధుల ద్వారా ఐదు కోట్ల రూపాయలు అందజేసి ఆధునిక పరికరాలను తీసుకురావడంలో విజయవంతమయ్యామని చెప్పారు. ఆసుపత్రిలో పోస్టుమార్టం రూమ్, ఎక్స్?రే మిషన్‌తో పాటు అవసరమైన ఇతర పరికరాలను ఎంపీ నిధుల ద్వారా త్వరలోనే అందజేస్తామని హామీ ఇచ్చారు. పరికరాల లేమి పేరుతో పేద రోగులను కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయొద్దని వైద్యులకు సూచించారు. సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై మంచి విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్రంలోని చెక్‌డ్యాంల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని బండి సంజయ్ ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల వద్ద నుంచి కమిషన్లు తీసుకుందని, ప్రణాళిక లేకుండా చెక్‌డ్యాంలను నిర్మించారని పేర్కొన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్న కాంట్రాక్టర్లు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నారని అన్నారు. చెక్‌డ్యాంలపై విచారణ జరిపించి అవినీతి నిర్ధారణ అయితే కాంట్రాక్టర్ల నుంచి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను పూర్తిగా ఆధునీకరించేందుకు త్వరలో ప్రపోజల్స్ పంపుతామని, జమ్మికుంటలో స్టేడియం నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని బండి సంజయ్ ప్రకటించారు.

# పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చె లేస్తుంది

**నిరంజన్ రెడ్డి అవినీతితోనే ఓడారు**

**ఫామ్‌హౌజ్‌లు కట్టుకుని పార్టీకి చెడ్డపేరు**

**మాజీమంత్రిపై జాగృతి అధ్యక్షురాలు కవిత ఫైర్**




**హైదరాబాద్, నవంబరు 24:** వనపర్తి, నవంబర్24: బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత రెచ్చిపోయారు. వనపర్తిలో మీడియాతో ఆమె మాట్లాడారు. నిరంజన్‌రెడ్డి అవినీతి, అన్యాయం అంతులేకుండా పోయిందన్నారు. బీసీలు, ఉద్యమకారులు తమపై నిరంజన్‌రెడ్డి పెట్టిన కేసుల గురించి చెప్పుకుని కళ్లలో రక్తం వచ్చేలా ఏడుస్తున్నారని కవిత అన్నారు. ఒక్కసారి ఎమ్మెల్యే, మంత్రి అయి ఒకటి కాదు మూడు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని ఆమె ఆరోపించారు. కృష్ణా నది మీ ఫామ్‌హౌస్‌ల కోసమే పోయిందని నిరంజన్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు విచారణ జరిపించలేదని ఆమె ప్రశ్నించారు. నిరంజన్‌రెడ్డి అవినీతి కేసీఆర్‌కు తెలియదా? అని నిలదీశారు. అవినీతి పైదాకా వెళ్లకుండా హరీశ్‌రావు కాపాడారా? అని ప్రశ్నించారు. అవినీతి గురించి కేసీఆర్‌కు తెలిస్తే నిరంజన్‌రెడ్డికి టికెట్ ఇవ్వరని కాపాడారా? అని ఆమె హరీశ్‌రావును నిలదీశారు. ఇప్పుడు అవినీతిని కేసీఆర్ దృష్టికి మీడియా ముఖంగా తీసుకెళ్తున్నట్టు కవిత తెలిపారు. పుచ్చు, చచ్చు వంకాయని తన గురించి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతున్నారని కవిత అన్నారు. తండ్రి వయసులో ఉన్నారు కాబట్టి, చాలా మర్యాదగా, గౌరవంగా చెబుతున్నానన్నారు. ఇంకోసారి తన గురించి ఎక్కువ, తక్కువ మాట్లాడితే.. తండ్రి వయసని కూడా చూడనన్నారు. పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చె లేచిపోతుందని నిరంజన్‌రెడ్డికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. ప్రజల సమస్యలపై మాట్లాడుతుంటే ఎందుకంత భయమని ఆమె ప్రశ్నించారు. భూదాహానికి అంతు వుండాలి కదా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మనిషి కాబట్టే కాంగ్రెస్ సర్కార్ చర్యలు తీసుకోలేదని నమ్ముతున్నట్టు ఆమె చెప్పారు. తన పని తాను చేసుకుంటున్నట్టు కవిత తెలిపారు. ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. నిరంజన్ రెడ్డి నాయకత్వంలో బీఆర్‌ఎస్‌కు వనపర్తిలో భవిష్యత్ లేదన్నారు.

# రైతును విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

**రెండేళ్లలో 720 మంది రైతుల ఆత్మహత్య**

**కవిత తనపై ఎందుకు విమర్శలు చేస్తోందో**

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆగ్రహం**



**వనపర్తి, నవంబరు 24:** రైతుల విషయంలో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మరికొద్ది రోజుల్లో ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటై రెండు ఏళ్లు పూర్తి చేసుకోబోతోందని.. ఈ కాలంలో 720 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సోమవారం వనపర్తిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 10 శాతం పనులు పూర్తి చేస్తే అయిపోతుందని.. కానీ పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ ఎందుకు స్పందించడం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపకుండా తనపై దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. తాను ఒక్కసారి కూడా కవితపై పల్లెత్తు మాట అనలేదని తెలిపారు. డూప్లికేట్ కాంగ్రెస్ వాళ్లు తనపై సోషల్ మీడియాలో కావాలనే బ్లేమ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత ఎవరిని సంతోషపెట్టాలని తనపై ఎందుకు దూర్భాషాలాడుతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను కక్ష పూరితంగా ఎవరి మీద కేసులు పెట్టించ లేదన్నారు. ఒక వేళ అలా ఏమైనా ఉంటే నిరూపించాలని అంతేకాని అసత్య ఆరోపణలు చేయవద్దని కవితకు సూచించారు. తాను ఎంతో మంది విద్యార్థులను స్వంత ఖర్చులతో చదివించానని గుర్తు చేశారు. కానీ వాటిని తాను ప్రచారం చేసుకోలేదన్నారు. తాను గతంలో న్యాయవాదిగా ఉన్నప్పుడు పెబ్బేరు సంత భూమి విషయంలో 2003, 2007లో పూజారులకే చెందుతుందని తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. కానీ తాను కబ్జా చేశాననడం అసత్య ప్రచారమన్నారు. పూర్తి విషయ పరిజ్ఞానం లేకుండా తాను దేవుడి మాన్యాన్ని కబ్జా చేశానంటూ కవిత ఆరోపణలు చేయడం సిగ్గు చేటు అన్నారు. తమ పార్టీ ఇప్పుడు అధికారంలో లేదని.. తనపై వచ్చిన ఆరోపణలను రుజువు చేయాలంటూ ప్రత్యర్థులకు ఆయన సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు సైతం కేసీఆర్‌ను కానీ.. ఆయన పార్టీ జెండాను కానీ వదల లేదన్నారు. తండ్రి వయస్సు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని మాట్లాడుతున్నావంటూ కవితపై నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. తమలాంటి నలుగురు, ఐదుగురిపై విషం చిమ్ముతున్నావని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

# ముగిసిన ఐ బొమ్మ రవి కస్టడీ

**కీలక సమాచారం రాబట్టిన పోలీసులు**



**హైదరాబాద్,నవంబరు 24 :** ఐబొమ్మ రవి పోలీస్ కస్టడీ ముగిసింది. 5 రోజుల కస్టడీలో సైబర్ క్రైమ్ పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. రవి వెబ్ సైట్, డొమైన్ నెట్ వర్క్, ఐపీ మాస్క్‌లతో పాటు అన్నింటిపై పోలీసులు ఆరా తీశారు. 20 కోట్ల రూపాయల లావాదేవీలపై బ్యాంకు అధికారుల సహకారంతో బదిలీ వివరాలు తెప్పించుకుని మరీ పోలీసులు రవిని ప్రశ్నించారు. రవి స్నేహితులు, చె÷–లలెలు చంద్రిక వ్యవహారంపై వివరాలు సేకరించారు. రవి, అతడి స్నేహితుడు కలిసి టెక్నికల్ ఆపరేషన్స్, డేటా హైడింగ్, సర్వర్ యాక్సెస్, వీపీఎన్, ఐపీ మాస్కింగ్ వంటి అంశాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. రవికి, రవి స్నేహితుడు నిఖిల్‌కి మధ్య భారీగా డబ్బుల బదిలీలు జరిగినట్లు తేలింది. క్రిఎ÷–టో ద్వారా అమౌంట్ బదిలీ చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. 1లీశ౹బి యాప్ మాత్రమే కాకుండా ఇతర యాప్‌ల ద్వారా కూడా డబ్బులు సంపాదించినట్లు తేలింది. పోలీసుల ప్రశ్నలకు 'నేను ఒక్కడినే అన్ని చేశాను. నా వెనుక ఎవరూ లేరు'అని రవి చెప్పినట్లు సమాచారం. రవి కస్టడీకి సంబంధించి మంగళవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ సమావేశం నిర్వహించనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో సైబర్ క్రైమ్ పోలీసులు పిట్ వారెంట్ దాఖలు చేశారు. పలువురు నిర్మాతలు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నారు. పిట్ వారెంట్ ద్వారా మరోసారి విచారణకు సిద్ధమవుతున్నారు.

# డబ్బా ప్రచారం ఇకనైనా ఆపేయండి




**సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు హితవు**

**హైదరాబాద్, నవంబర్ 24:** మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించకపోవడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామనే డబ్బా ప్రచారాన్ని ఇకనైనా ఆపేయాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. అప్పుల పాలయ్యాం మొర్రో అని మొత్తుకుంటున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 13 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి భోజనం పెడుతున్నప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని ఆవేదనతో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నాడు ఆందోళనకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన మధ్యాహ్న భోజన కార్మికులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా వేంపూర్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి సరఫరా చేసే బియ్యం మొత్తం ప్లాస్టిక్ లెక్క ఉంటున్నాయని తెలిపారు. పిల్లలకు ఏమన్న అయితే మమ్మల్నే అంటారు కదా అని ఆవేదన చెందారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద పిల్లలకు భోజనం కూడా ఈ ప్రభుత్వం సరిగ్గా పెట్టడం లేదని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మాకు జీతాలు పెంచి, సమయానికి జీతాలు, బిల్లులు ఇచ్చిండని తెలిపారు. రేవంత్ రెడ్డి గత సంవత్సరం నుంచి జీతాలు, బిల్లులు ఇవ్వకపోవడంతో రూ. 2లక్షల అప్పు చేసి, నా ఇల్లు తాకట్టు పెట్టి పిల్లలకు భోజనం పెడుతున్నానని పేర్కొన్నారు.

# ఆ లింక్‌లపై క్లిక్ చేయొద్దు

**సైబర్ మోసాలపై సజ్జనార్ కీలక సూచనలు**



**హైదరాబాద్, నవంబర్ 24:** హైదరాబాద్ కమిషనర్ సజ్జనార్ డిజిటల్ భద్రతపై మరోసారి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. వ్యక్తిగత డేటా దుర్వినియోగం ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెద్ద ముప్పుగా మారిందని, ప్రజలు తమ సమాచారం ఆన్‌లైన్‌లో ఎలా వాడబడుతుందో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సోమవారం తన ఎక్స్ అకౌంట్ ద్వారా వరుస పోస్టులు చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. ఇంటర్నెట్‌లో ఉచిత కంటెంట్ పేరిట కనిపించే చాలా లింకులు వాస్తవానికి సైబర్ నేరగాళ్ల వలలేనని ఆయన తెలిపారు. ఒక్క క్లిక్‌తో ఎంజాయ్ చేస్తా.. అనుకునే అలవాటే భవిష్యత్తులో తీవ్ర సమస్యలకు కారణమవుతుందని అన్నారు. డబ్బు కంటే వ్యక్తిగత డేటానే అసలైన విలువైన ఆస్తి అని, ఒకసారి అది దొంగిలించబడితే తిరిగి పొందటం దాదాపు అసాధ్యమని హెచ్చరించారు. ఆన్‌లైన్ మార్కెట్‌లో వ్యక్తిగత డేటా కొనుగోలు, అమ్మకాలు విపరీతంగా జరుగుతున్నాయని, దాన్ని క్యాష్ చేసుకోవడానికి సైబర్ నేరగాళ్లు నకిలీ సైట్లు, అనుమానాస్పద యాప్స్, పైరసీ లింకులు, ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫారాలను ఎక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు.

# త్వరలోనే పంచాయితీ ఎన్నికలు

**రెండుమూడు రోజుల్లో నోటిఫికేషన్ ■ కొడంగల్‌లో రేవంత్ వెల్లడి**

**కొడంగల్,నవంబర్24 :** రాష్ట్రంలో త్వరలోనే సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అభివృద్ధిని అడ్డుకునేవాళ్లను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవద్దని సూచించారు. అభివృద్ధి చేసే వారికే అండగా నిలవండి అని కోరారు.సర్పంచ్ ఎన్నికలు అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మహిళలు ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల కోసం రాజకీయాలను పక్కనబెట్టాలని సూచించారు. అభివృద్ధి విషయంలో అంతా ఒక్కటే అని సంకేతమివ్వాలని సూచించారు. కొడంగల్‌లో పర్యటన సందర్భంగా అక్షయ పాత్ర కిచెన్‌కు సీఎం రేవంత్ రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే రూ. 103కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ప్లలె వెలుగు బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..రూ. 5వేల కోట్లతో కొడంగల్‌లో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తామని.. రాష్ట్రం నలుమూలల నుంచి చదువు కోసం కొడంగల్‌కు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఢిల్లీకి నోయిడా తరహాలో కొడంగల్ మారబోతోందని పేర్కొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..





## సంపాదకీయం

# ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమీలేయర్!

ఎస్సీలలో క్రిమీలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీయ పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీయ లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నా యి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూ చించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలేయర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయి నా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వంగా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు, తెగల వారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమా నత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధా నాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశిరచిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాల ను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతు బద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపో యారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరినవారు ప్రగతి శీల దృక్పథంతో క్రీమిలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమిలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఓకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు. పన్న శ్రేణి అంటే క్రీమిలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చకావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించినట్లుగానే క్రిమిలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు. ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేక పోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సిందు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఓ కార్యక్రమంలో మాట్లాడుస్తూ రిజర్వేషన్ల దగ్గరికి వచ్చినపుడు ఒక ఐఏఎస్ అధికారి సంతతిని, ఒక పేద వ్యవసాయ కూలీ సంతతిని సమానంగా చూడరాదని అన్నారు. ఇది వాస్తవం. నిజానికి రిజర్వేషన్ల నిచ్చెనలు ఎక్కిన ఎందరో మిగతా ఎస్సీల అభ్యున్నతికి పాటుపడుతున్న దాఖలాలు లేవు. అందువల్ల క్రీమిలేయర్ విధానం అమలు జరగాలి. ఒక కుటుంబానికి ఒకటి రెండుసార్లే రిజర్వేషన్లు అమలు కావాలి. అప్పుడే ఎస్సీలు సామాజికంగా ఎదుగగలరు.

# ఆయుధాలు వదిలేస్తాం.. సమయమివ్వండి

### మావోయిస్టుల లేఖ

- మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి
- కూంబింగ్ చర్యలు ఆపాలని షరతులు



**విజయవాడ, నవంబర్ 24:** వరుస ఎనకౌంటర్లు, లొంగుబాట్లు, ఆపరేషన్ కగార్‌ల నేపథ్యంలో మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిజానికి 90శాతం దెబ్బతినట్లుగానే భావించాలి. ఈ క్రమంలో ఆయుధాలను వీడటంపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు ఆ మూడు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదలైంది. దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ ఆయుధాలు త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని మా పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని మేం సమర్థిస్తున్నాం. కేంద్ర కమిటీ సభ్యులు సతీశ్ దాదా, చంద్రన్న ఇటీవల ఈ నిర్ణయాన్ని సమర్థించారు. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని భావిస్తోంది. అయితే మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మాకు ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నాం. ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు మా పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు మాకు కొంత సమయం పడుతుంది. మా సహచరులను సంప్రదించి పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు సమయం కావాలి. ఇంత సమయం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు మాకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నాం. భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలి. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోం. మా అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నాంఅని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయుధ విరమణపై మావోయిస్టు పార్టీ కీలక ప్రకటన చేసింది. ఆయుధాలు వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే అప్పటి నుంచి ఆయుధాలను వదిలేస్తామని ప్రకటించింది. ఇప్పటికే బస్వరాజు ఎన్‌కౌంటర్ తర్వాత పార్టీ పునర్‌నిర్మాణం, వ్యూహాత్మక మార్పులు అవసరమని గుర్తించి ఆయుధ విరమణపై ప్రకటన చేస్తామని లేఖలో పేర్కొంది. సీసీఎంలో తీసుకున్న నిర్ణయం మేరకు జోనల్ కమిటీలకు సమాచారం ఇచ్చినట్టు మావోయిస్టు పార్టీ లేఖలో వెల్లడించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఇంకా కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో భాగంగా భద్రతాదళాలు అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే మావోయిస్టు పార్టీ ఈ మేరకు లేఖను విడుదల చేసింది. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు, డీజీపీలు దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటే కచ్చితంగా ఆయుధాలు వదిలేస్తామని మావోయిస్టు పార్టీ చెప్పింది. దీంతో ఈ లేఖపై మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతున్నాయో చూడాల్సి ఉంది.

## మరో 15మంది లొంగుబాటు

**రాయ్‌పూర్, నవంబరు 24:** మావోయిస్ట్‌ల లొంగుబాటు కొనసాగుతోంది. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 15 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, 10 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) నంబర్ వన్ బెటాలియన్‌లో చురుగ్గా పని చేస్తున్న నలుగురు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు.

# తిరుచానూరులో వైభవంగా రథోత్సవం



**తిరుపతి,నవంబర్24:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం రథోత్సవం ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. అనంతరం అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రాత్రి అమ్మవారు అశ్వవాహనంపై దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. రథోత్సవంలో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి. వీర బ్రహ్మం, సివిఎస్వో కే.వి. మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, ఆలయ అర్చకులు బాబు స్వామి, శ్రీనివాసా చార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# సీజేఐగా జస్టిస్‌సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం

### రాష్ట్రపతి చేతుల మీదుగా బాధ్యతల స్వీకరణ

ప్రదాని మోదీ, పలువురు కంద్ర మంత్రులు, సీఎం రేవంత్‌హాజరు

హాజరైన పలుదేశాల న్యాయమూర్తులు



**న్యూఢిల్లీ,నవంబరు 24:** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆదివారంనాడు పదవీ విరమణ చేసిన సీజేఐ బిఆర్ గవాయ్ స్థానంలో జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపట్టిన తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తొలిసారిగా భూటాన్, కెన్యా, మలేసియా, మారిషస్, నేపాల్, శ్రీలంక దేశాల చీఫ్ జస్టిస్‌లు వారి కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావడం విశేషం. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణాలోని హిసార్‌లో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్శిటీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. వివిధ ధర్మాసనాల్లో పలు కీలక తీర్పుల్లో ఆయన భాగమయ్యారు. 370వ అధికరణను రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చిన ధర్మసనంలో ఉన్నారు. బిహార్ ఎన్నికల జాబితా రివిజన్, పెగాసస్ స్పైవేర్ తీర్పులు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, మాజీ సీజేఐ జస్టిస్ గవాయ్, కేంద్రమంత్రులు, ఇతరులు పాల్గొన్నారు.





# ఇండిగో విమానానికి తప్పిన పెను ప్రమాదం

**ముంబై, నవంబర్ 24:** ఇండిగో విమానానికి పెను ప్రమాదం తప్పింది. ముంబయి నుంచి డెహ్రాడూన్ కు బయల్దేరిన ఇండిగో 6ఇ5032 విమానాన్ని మార్గం మధ్యలో ఆకస్మాత్తుగా ఓ పక్షి ఢీకొంది. అప్రమత్తమైన పైలట్.. వెంటనే విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ క్రమంలో విమానం ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది. అయితే.. ఈ ఘటనలో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయాన్ని ఇండిగో సంస్థ అధికార ప్రతినిధి ఒకరు అధికారికంగా వెల్లడించారు. ఆ సమయంలో విమానంలో సుమారు 186 మంది ప్రయాణికులు ఉన్నట్టు తెలిపారు. ఈ క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. ప్రత్యామ్నాయంగా మరో విమానం ద్వారా సర్వీసును పునరుద్ధరించింది ఎయిర్‌ఇండియా. ఈ స్వల్ప విరామంలో ప్రయాణికులకు విమానయాన సిబ్బంది అల్పాహారం అందించినట్టు అధికారులు తెలిపారు.

# రూపాయి పతనంపై మండిపడ్డ కాంగ్రెస్

### ఆనాటి విమర్శల వీడియోను పోస్ట్ చేసిన జైరామ్

**న్యూఢిల్లీ, నవంబర్ 24:** అమెరికా డాలర్‌తో పోలిస్తే.. రూపాయి విలువ దారుణంగా పడిపోతుంది. శుక్రవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89 రూపాయలకి పడిపోయింది. రూపాయి విలువ రికార్డు స్థాయిలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోవడంతో కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేసింది. 2013 యుపిఎ హయాంలో రూపాయి విలువ పడిపోవడంతో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో కాంగ్రెస్ కూడా మోడీపై మండిపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ నిరంతరం పతనం అవుతూనే ఉంది. ఇప్పుడు అది 90 రూపాయల కనిష్ట స్థాయిని దాటబోతోంది. 2013 జూలైలో తాను చెప్పింది ప్రధానికి గుర్తుందా అని అప్పుడు మోడీ అన్న వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ పోస్టు చేశారు. రూపాయి ఎంత వేగంగా పతనమవుతుందో చూడండి. కొన్నిసార్లు రూపాయి, ఢిల్లీలో ప్రభుత్వానికి మధ్య పోటీ జరుగుతున్నట్లు అనిపిస్తుంది. అయితే రూపాయి పతనంపై దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేసినా.. అలా అన్న వారి గౌరవం కూడా వేగంగా దిగజారిపోతుంది అని జైరాం రమేశ్ ఈ వీడియోకు జతగా పోస్టు చేశారు.022 ఫిబ్రవరి 24వ తేదీన రూపాయి విలువ 99 రూపాయలకి పడిపోయింది. గత మూడు సంవత్సరాలుగా అత్యంత కనిష్ట స్థాయిలోనే రూపాయి విలువ పడిపోతుంది.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం 25 నవంబర్ 2025 కరీంనగర్


# కోరుట్లలో మిస్టీరియస్ డెత్!?



## అమ్మా-నాన్న' తరచూ గొడవపడుతున్నారని ఎనిమిదో క్లాస్ విద్యార్థి ఆత్మహత్య

- కొన ఊపిరితో ఉన్న కొడుకును హాస్పిటల్ కి తరలించకుండా పేరెంట్స్ గొడవ
- మళ్లీ గొడవపడమని రాసుకున్న 'అగ్రిమెంట్ పేపర్'పై భార్యాభర్తల సంతకం తండ్రే చేశాడని కొడుకు మనస్తాపం
- ఆ చిన్నారి బాలుడి 'ఆత్మహత్య'పై భిన్న కథనాలు
- ఏది ఏమైనా.. కుటుంబ కలహాలు బాలుడి బలవన్మరణానికి దారి
- కోరుట్లలో కలకలం సృష్టించిన వైనం



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కారణాలు ఏవైనా సమాజంలో రోజురోజుకు మానవసంబంధాలు క్షీణించి పోతున్నాయి. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య బంధంలో కలహాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. పిల్లల ముందు ఎప్పుడూ ఘర్షణ పడవద్దు.. బూతులు తిట్టుకోవద్దని పెద్దలు-మానసిక వైద్యులు ఎంతచెప్పినా ఎవరి చెవికెక్కించుకోవడంలేదు. క్షణకాల భావోద్వేగాలు మనపక్కన ఎవరున్నారో కూడా చూసుకోకుండా.. పరస్పరం వాగ్వాదానికి దిగడమో.. చేతికందినదానితో దాడి చేయడమో.. లేక.. ధ్వంసం చేయడమో లాంటి దురాగతాలకు దిగుతున్నారు. దీంతో ప్రతీ ఇద్దరి మధ్య బంధాలు ఛిద్రమై' పోతున్నాయి'.! ఇలాంటి నేపథ్యంలోనే కోరుట్ల పట్టణంలోని ఓ కుటుంబంలో చెలరేగిన కలహాలు ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి బాలుడు ఆత్మహత్యకి దారితీసాయి. దీంతో ఒక్కసారిగా మానవ సమాజంలో అసలేం జరుగుతోంది? ఎటు దారితీస్తోంది? సభ్య సమాజానికి ఏం మెసేజ్ ఇస్తున్నారన్నదానిపై చర్చకు తెరతీసింది.!

### అనుమానాస్పద ఆత్మహత్య.!

కోరుట్ల పట్టణానికి చెందిన మారంపల్లి విరాట్ (13) స్థానిక లిటిల్ జీనియస్ హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్నాడు. తరచూ తన తల్లిదండ్రులు ఇద్దరూ ఏదో విషయమై గొడవపడుతూ.. తిట్టుకుంటూ.. కొట్టుకుంటూనే ఉంటారని ఆ బాలుడి మదిలో తట్టిపోయింది. తన సోదరి ధన్వి ఇద్దరూ మానసిక వేదనకు గురవుతూనే ఉండిపోయారు. బాలుడి మృతిచెందిన రోజు పేరెంట్స్ మళ్లీ గొడవపడడంతో విరాట్ పేరెంట్స్ తో ఒక ఒప్పందం పత్రం రాయించుకున్నాడు. ఇంకెప్పుడూ మేం గొడవ పడం అని.! తొలుత తండ్రి సంతకం పెట్టాడు. ఆ తర్వాత తల్లిని సంతకం పెట్టుమంటే నిరాకరించి బజారుకు వెళ్లిపోయింది. దీంతో తల్లి సంతకం కూడా తండ్రే పెట్టేయడంతో ఆ సంతకం తల్లిది కాదని గుర్తించిన విరాట్ ఇక ఈ ఇంట్లో గొడవలు ఆగవని పేర్కొంటూ తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సరిగ్గా అదే సమయంలో కొడుకు బయటకు రావాలని.. తల్లి కూడా మరో గదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ లోపు కొడుకు గది తలుపులు బద్దలుకొట్టి ఫ్యానుకు వేలాడుతున్న కొడుకును కిందికి దించారు. మళ్లీ భార్యాభర్తలు పరస్పరం నిందించుకుంటూ వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు కొన ఊపిరితో ఉన్న విరాట్ తుదిశ్వాస విడిచాడు.

### పోలీసుల ముందు భిన్న కథనాలు?

ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి బాలుడు ఇంట్లోనే అమ్మానాన్నల కారణంగా ఉరివేసుకుని చనిపోయాడటన్న సమాచారం ఒక్కసారిగా గుప్పుమంది. ఈ విషయం స్థానికులు ఒక్కొక్కరు ఒక్కోలాగా చెప్పుకుంటుండడం అయోమయానికి గురిచేసింది.! పిల్లవాడు గదిలోకి వెళితే.. తల్లి బయటకు ఎందుకు వెళ్లింది? మళ్లీ తల్లి ఎందుకు ఆత్మహత్య చేసుకుంటానని గదిలోకి వెళ్లింది? ఫ్యానుకు వేలాడుతున్న కొడుకును పట్టుకున్నది ఎవరు? మెడకు వేసుకున్న 'చున్నీ' లేదా 'చీర'ను కత్తిరించింది ఎవరు? బయట జనాలకు తల్లి మొదట ఏం చెప్పింది? మీడియాకు ఏం చెప్పింది? పోలీసుల ముందు మరోలా ఎందుకు చెప్పింది? అన్నీ ప్రశ్నలే.! దీంతో ఈ 'విరాట్' అనే బాలుడి మృతి అనుమానాస్పదంగా మారింది. బాలుడు ముందే తలుపు వేసుకుని 'పేపర్' రాసిస్తానంటేనే బయటకు వస్తాని చెప్పింది కరెక్టా? లేక ముందే పేపర్ మీద ఇద్దరి సంతకాలు ఒక్కరే పెట్టడం వల్ల 'మనస్తాపం'చెంది ఇక చావే శరణ్యమనుకున్నాడా.? ఇవన్నీ చిక్కుముడులే.!

### ఆ రెండు లెటర్లు ఎక్కడా.!?

బాలుడు మృతి చెందకముందు తన తల్లిదండ్రులచే రాయించిన 'అగ్రిమెంట్' లెటర్ ఏమైంది? దాంతో పాటు పిల్లవాడు తన మృతికి కారణం చూపుతూ రాసుకున్న 'సూసైడ్' లెటర్ ఏమైంది అని చర్చ జరుగుతోంది.! కాగా.. ఆ రెండు లెటర్లను పోలీసులకు లభించినట్లు ముచ్చటించుకుంటున్నారు. అయితే .! కొందరు పిల్లవాడు మెడకు చుట్టుకున్న 'క్లాత్'ను కత్తిరించిన కొద్దిసేపటి వరకు ప్రాణాలతోనే ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఇంతకూ ఆ బాలుడు ఇంత చిన్న వయసులో 'ఆత్మహత్య' చేసుకునేంత 'మెచ్యూరిటీ' వచ్చిందా? తల్లిదండ్రుల మధ్య 'అగ్రిమెంట్' లెటర్ రాయించేంత 'పరిపక్వత' ఉందా? గదిలోకి వెళ్లి 'సూసైడ్' లెటర్ రాసేంత జ్ఞానం అతనికి ఉందా? అసలు ఆ ఇంట్లో ఏం జరిగిందని పట్టణంలో చర్చానీయాంశమైంది. ఈ 'అనుమానాస్పద' ఆత్మహత్య ఉదంతంపై కోరుట్ల పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ 'మిస్టీరియస్ డెత్' ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోంది.!

# మద్యం మత్తులో వీరంగం

- కోరుట్ల నంది చౌరస్తా వద్ద ఘటన
- పోలీసుల రంగప్రవేశం





**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తా వద్ద నున్న 'తెలంగాణ వైన్స్ వద్ద మందుబాబులు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. తెలంగాణ వైన్స్ పక్కనే గల పర్మిట్ లో పీకలదాకా తాగిన కొందరు యువకులు మాటామాటా పెంచుకుని ఒకరిపై ఒకరు భౌతికదాడులు చేసుకున్నారు. వీరు నడిరోడ్డుపై షర్టులు చింపంకుంటూ.. అర్ధనగ్నంగా కొట్టుకుంటూ.. కలయబడుతున్నారన్న సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే ఘర్షణ పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని




వారిని పోలీసు స్టేషన్ కు తరలించారు. అయితే.! వీరు ఎందుకు కొట్టుకున్నారన్న విషయంపై క్లారిటీ లేదు. కాగా.. నంది చౌరస్తా బిజీ సెంటర్ లో ఘర్షణ పడి కొట్టుకుంటుంటే.. జనాలు చోద్యం చూస్తూ మాకేం పట్టి.. మాకేం అవసరం కొట్టుకు చావండి.! అని చాలా మంది ఫోన్ లలో వీడియోలు తీసుకోవడం కనిపించిందే కానీ..ఎవరూ వారిని ఆపే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. రోజురోజుకు మానవత్వపు ఆనవాళ్లు క్రమంగా చెదిరిపోతున్నాయనడానికి ఈ ఘటన ఒక ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు.!

# మృత్యుశకటంగా వచ్చిన ట్రాక్టర్

## రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి



**నేటి సాక్షి, సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ప్రమాదంలో నవవధువు మృత్యువాత పడిం ది. వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టామన్న ఆనందం ఆ నూతన దంపతులకు ఎంతో కాలం నిలవలేదు. కోటి ఆశ లతో నూతన బంధంలోకి అడుగుపెట్టిన కొన్నాళ్లకే రోడ్డు ప్రమాదం వారిద్దరినీ వేరు చేసింది. సిద్దిపేట జిల్లా మిరు దొడ్డి మండలం పెద్ద చెప్యాల శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు ప్రాణాలు కోల్పో గా.. భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రణతి (24), సాయికు మార్‌కు ఇటీవల వివాహమైంది. ఉ ద్యోగ నిమిత్తం వారిద్ద రూ సిద్దిపేట నుంచి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా.. పెద్ద చెప్యాల శివారులో అదుపు తప్పిన ట్రాక్టర్ వేగంగా వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. 108 వాహనంలో వారిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించే క్రమంలో ప్రణ తి మృతి చెందింది. సాయికు మా ఓర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నూతన దంపతుల ప్రయాణం కన్నీటి కథగా మారిపోవడంతో పెద్ద చెప్యాల గ్రామంలో విషాదఛా యలు అలముకున్నాయి.



## నేడు ఎస్‌హెచ్‌జీలకు

# వడ్డీ లేని రుణాలు

### ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**నేటి సాక్షి, సిరిసిల్ల:** జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు (ఎస్‌హెచ్‌జీ)లు ఇందిరా మహిళా శక్తి కింద వడ్డీలేని రుణాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని 8871 ఎస్‌హెచ్‌జీ)లకు దాదాపు రూ. 8 కోట్ల 12 లక్షలు వేములవాడ, సిరిసిల్ల, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల్లో పంపిణీ చేస్తామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 7802 ఎస్‌హెచ్‌జీలకు రూ. 7కోట్ల 40 లక్షలు, రెండో విడతలో రూ. 8552 ఎస్‌హెచ్‌జీలకు రూ. 11 కోట్ల 78 లక్షల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. వేములవాడ పట్టణంలోని రామలింగేశ్వర గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అలాగే జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మధ్యాహ్నం 01.00 గంటలకు సిరిసిల్ల నియోజకవర్గం ఎస్‌హెచ్‌జీల బాధ్యులకు పంపిణీ చేయనున్నామని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు.

# దొంగతనం కేసులో నిందుతుడికి జైలు

**నేటి సాక్షి, సిరిసిల్ల:** దొంగతనం కేసులో నిందుతుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం సంజీవయ్య నగర్‌కి చెందిన దరిపల్లి రమేశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. 2017 ఏప్రిల్ 14న ఉదయం కుటుంబసభ్యులతో కలసి రేగులకుంటకు ఎల్లమ్మ దేవుని పండుగ చేసుకునేందుకు కనగర్తికి వెళ్లాడు. రెండ్రోజుల తర్వాత రమేశ్ తమ్ముడు సురేశ్ ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పగా రమేశ్ వెంటనే ఇంటికి వచ్చి చూశాడు. ఇంటి తాళం పగులగొట్టి, లోపల బీరువా తాళాలను తెరిచి సామానులన్నీ చిందరమందరగా పడవేసి ఉండగా, బీరువాలో దాచిపెట్టిన బంగారు ఆభరణాలు (8తులాల బంగారము, 20 తులాల వెండి) కనిపించలేదు. దీంతో రమేశ్ వెంటనే సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా దొంగతనం చేసిన వడ్డేపల్లి సత్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించిన అనంతరం కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. అనంతరం ర్టు మానిటరింగ్ ఎస్ఐ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఆరు మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. కేసు పూర్వపురాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు వడ్డేపల్లి సత్యంకు ఒక ఏడాది కఠిన కారాగార జైలు శిక్ష విధించడం విధిస్తూ తీర్పునిచ్చినట్లు సీఐ కృష్ణ తెలిపారు.

# గ్రీవెన్స్‌డేకు 32 ఫిర్యాదులు

### ఎస్పీ మహేశ్ బీగితే



**నేటి సాక్షి, సిరిసిల్ల:** ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీగితే తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వివిధ ప్రాంతాల అర్జీదారుల నుంచి 32 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారమ య్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ

**నేటి సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం :** మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. వారిని అన్ని రకాలుగా ఆదుకుంటోందన్నారు. బస్సులకు యజమానులను చేసిందన్నారు. సోమవారం రైతు వేదికపై మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు వడ్డీ లేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. పాత వడ్డీ బకాయిలను ప్రభుత్వం చెల్లించిందని, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తుందన్నారు. మహిళల సంక్షేమమే పరమావధిగా సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పని చేస్తుందన్నారు. తీసుకున్న రుణాలను సమయానికి అనుగుణంగా చెల్లింపులు చేయడం ద్వారా మహిళలు ఎంతో లబ్ది పొందవచ్చన్నారు.

# నేటి సాక్షి

TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..








# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు ఇండ్లు

- హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్
- ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహప్రవేశాల కార్యక్రమానికి హాజరు
- భావోద్వేగానికి గురైన లబ్ధిదారులు
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన గ్రామస్తులు
- మార్మోగిన జయహో కాంగ్రెస్ నినాదాలు

**నేటి సాక్షి, జమ్మికుంట రూరల్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని, స్వచ్ఛందంగా లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు కుటుంబసభ్యుడిగా పిలవడం చూస్తుంటే ఇల్లు వారి జీవితంలో ఎంత ముఖ్యమే అర్థమవుతుందని హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సోమవారం జమ్మికుంట మండల పరిధిలోని గంఢ్రపల్లి గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాల కార్యక్రమానికి ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పూలమాలలు, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ప్రణవ్ రాకతో గంఢ్రపల్లి గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. తొలి విడతలో 3500 ఇళ్లు నియోజకవర్గానికి మంజూరు చేస్తే, మరో విడతలో మరిన్ని ఇళ్లు కేటాయిస్తామని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇందిరమ్మ ఇళ్లు రాగా.. మళ్లీ పదేళ్ల తర్వాత కాంగ్రెస్సే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం మా చిత్తశుద్ధికి నిదర్శమని ఈ సందర్భంగా ప్రణవ్ పేర్కొన్నారు. ఇంటి గృహ ప్రవేశ సమయంలో లబ్ధిదారులు ప్రణవ్‌ను చూసి భావోద్వేగానికి గురయ్యారు. బతకడానికి ఇక్కడికి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, జీవితంలో సొంతింటి కల నెరవేరుతుందో లేదో అనుకున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌తోనే సొంతింటి కలను నిజం చేసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన విభాగం, మైనారిటీ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో ఆశీర్వదించండి..

ప్రజల సంక్షేమానికి ముందు వరుసలో ఉండే కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వానికి అండగా ఉండాలని, రాబోయే స్థానిక పోరులో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఈ సందర్భంగా ప్రజలను కోరారు. దేశంలో ఎవ్వరూ ఇవ్వని విధంగా సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరా మహిళా శక్తి ద్వారా చీరల పంపిణీ కార్యక్రమం, రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వంటి ప్రజా ఆమోదిత పథకాలను ప్రవేశపెట్టామని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలతో పేదల జీవితాలను మారుస్తామని చెప్పారు.



# వెల్‌డన్ డిప్యూటీ మేయర్ మేడం

## ప్రజల ఇబ్బందులను తెలుసుకొని స్వయంగా బస్టాప్‌కు
## బస్సును స్టాప్ వద్ద ఆపాల్సిందేనని డిపో మేనేజర్లకు ఫోన్‌లో ఆదేశం
## డిప్యూటీ మేయర్‌పై పనితీరుపై ప్రశంసలు

**నేటి సాక్షి, హైదరాబాద్:** తార్నాక డివిజన్ ఓల్డ్ డైరీ ఫార్మ్ వద్ద ఉన్న బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు గత కొన్ని రోజులుగా ఆగడం లేదు. దీంతో ఎన్ఐఎన్, ఈఎఫ్ఎల్‌యూ, ఉస్మానియా యూనివర్సిటీ, అలాగే పరిసర బస్తీలకు చెందిన విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి సోమవారం స్వయంగా బస్ స్టాప్ వద్దకు వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం ఆ దారిగుండా వెళ్లే బస్సుల డ్రైవర్లు, కండక్టర్లకు నేరుగా సూచనలు చేస్తూ ఈ బస్ స్టాప్ వద్ద బస్సులు ఆపకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడ తప్పకుండా బస్ ఆపాలని చెప్పారు. అనంతరం ఆర్టీసీ ముషీరాబాద్, కుషాయిగూడ డిపో మేనేజర్లకు ఫోన్ ద్వారా స్వయంగా సమాచారం అందించి సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. ఇదంతా అక్కడున్న ప్రజలు, విద్యార్థులు చూసి డిప్యూటీ మేయర్ పనితీరును ప్రశంసించారు.

# అంజన్‌కుమార్‌కు అభినందనలు

**నేటి సాక్షి, కరీంనగర్:** కరీంనగర్ సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా వైద్యుల అంజన్ కుమార్‌ను అధిష్ఠానం నియమించగా, సోమవారం కరీంనగర్‌లోని 4వ డివిజన్ అధ్యక్షుడు ఎండీ సర్వర్ ఖాన్ తో పాటు కాంగ్రెస్ నాయకులు ముజీబ్ అహ్మద్, ఇమ్రాన్, ఇమ్రాన్ గనీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అంజన్ కుమార్‌మరిన్ని పదవులు అధిరోహించాలని సర్వర్‌ఖాన్ ఆకాంక్షించారు.





# వివాహేతర సంబంధంలో చిన్నారి హత్య

## తల్లికి, సహకరించిన వ్యక్తికి యావజ్జీవ కారాగారం
## వరంగల్ కోర్టు సంచలన తీర్పు

**నేటి సాక్షి, వరంగల్:** వివాహేతర సంబంధించన కేసులో వరంగల్ కోర్టు సంచలన శిక్ష విధించింది. ఈ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధించారు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉందని మూడేళ్ల కూతురిని అతి కర్కశంగా హతమార్చిన తల్లికి, ఆమెకు సహకరించిన మరో వ్యక్తికి జీవిత ఖైదు విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయస్థాన న్యాయమూర్తి వి.బి.నిర్మలాగీతాంబ సోమవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. హైదరాబాద్ చార్మినార్ ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న సయ్యద్ యూసఫ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు. వారిని పట్టించుకోకపోవడంతో పిల్లలను తీసుకొని భార్య యూసఫ్‌ను వదిలి పెట్టి వెళ్లింది. అదే ప్రాంతంలో సయ్యద్ హజీరా బేగం తన భర్త ఇంతియాజ్ అలీ, మూడేళ్ల కూతురు ఫాతిమా సబాతో నివసిస్తున్నారు. యూసఫ్‌కు, హజీరా బేగం మధ్య పరిచయం పెరిగి వివాహేతర సంబంధం ఏర్పడింది. హైదరాబాద్‌లో ఉండటం క్షేమం కాదని భావించి వీరిద్దరూ చిన్నారి ఫాతిమా సబాతో కలిసి వరంగల్‌లోని రంగశాయిపేటకు వచ్చారు. పాతసామాను వ్యాపారి మహ్మద్ ఖాసిం వద్ద పనికి కుదిరారు. అదే వ్యాపార ప్రాంగణంలో ఒక గదిలో జీవిస్తున్నారు. కొన్నాళ్ల తరువాత వివాహం చేసుకోవాలని హజీరా బేగం యూసుఫ్‌ను కోరింది. చిన్నారిని అడ్డు తొలగిస్తేనే వివాహం చేసుకుంటా ననడంతో ఆమె అంగీకరించింది. దీంతో యూసఫ్ 2022 ఏప్రిల్ 23న నిద్రిస్తున్న చిన్నారి రెండు చేతులను గట్టిగా పట్టుకొని గిరాగిరా తిప్పి నేలకు కొట్టాడు. ఆ వెంటనే కన్నతల్లి ఆ చిన్నారి నోరుమూసి గొంతు నులిమేసి హత్య చేసింది. ఈ విషయంపై పాత సామాన్ల వ్యాపారి ఖాసిం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావటంతో న్యాయస్థానం నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధించింది.

# మూసారాంబాగ్‌లో వీఐపీ ఫిజియో, రిహాబ్ క్లినిక్ ప్రారంభం

**నేటి సాక్షి, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలాతో కలిసి సోమవారం మూసారాంబాగ్‌లో డా. శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీఐపీ ఫిజియో, రిహాబ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ 'ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలి కారణంగా ఆఫీస్ పనులు, ఒత్తిడి, ట్రాఫిక్ వల్ల కండరాల నొప్పులు, వెన్నునొప్పి, మోకాళ్ల సమస్యలు పెరుగుతున్నాయి. ప్రజలకు శాస్త్రీయ పద్ధతుల్లో చికిత్సలు, ఆధునిక థెరపీ సేవలందించేందుకు ఈ క్లినిక్ ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది' అని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఫిజియోథెరపీ, రీహాబిలిటేషన్ పద్ధతులు శస్త్ర చికిత్సల అవసరాన్ని తగ్గించడంలో కీలకమని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే బలాలా మాట్లాడుతూ 'మూసారాంబాగ్ పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు విస్తరించడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. ఆధునిక వైద్యపరికరాలు, నిపుణుల బృందంతో ఉన్న ఈ క్లినిక్ మలక్‌పేట్ నియోజకవర్గానికి ఒక వరం' అని పేర్కొన్నారు. డా.శ్రీదేవి మాట్లాడుతూ, ప్రత్యేకంగా స్పోర్ట్స్ ఇంజూరీలు, స్ట్రోక్ రీహాబిలిటేషన్, పిల్లల ఫిజియో థెరపీ, పోస్టు సర్జరీ రీహాబ్ సేవలను హై స్టాండర్డ్స్‌తో అందించనున్నట్టు తెలిపారు. త్వరలో గృహ సేవలు (హోమ్ ఫిజియోథెరపీ) కూడా ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.




# 29న దీక్షాదివస్‌ను విజయవంతం చేయండి

**నేటి సాక్షి, సూర్యాపేట:** ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివాస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ముఖ్యనేతలతో సన్నాహక సమావేశ నిర్వహించిన అనంతరం జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో..కేసీఆర్ సచ్చుడో.. అన్న నినాదమే ఉద్యమానికి ఊపిరి పోసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటు సాధనలో ఆరోజే కీలకమని పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్షతోనే కేంద్ర మెడలు వంచిందని జగదీశ్ రెడ్డి అన్నారు. ఆ దీక్షతోటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు.



# భయపెట్టిస్తున్న బైకు స్వాధీనం

## సీసీ కెమెరాల్లో చూసి పట్టుకున్న కోరుట్ల పోలీసులు

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలో గత కొన్ని రోజులుగా..'జనాలను సౌండ్'తో భయపెట్టిస్తున్న బైక్‌లలో ఒకదాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది సామాజిక భాధ్యతలేని యువకులు తమ బైక్ లకు విచిత్రమైన 'సౌండ్' వచ్చేలా 'షార్ట్స్' కొట్టిస్తూ రోడ్లపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ జనాలను భయపెడుతున్నరు. జనాల మధ్యనుండి అతి వేగంగా వెళ్లడం.. జనాలు చూడాలని.. కావాలనే సైలెన్సర్లలోని 'మఫ్లర్'లను తొలగించడం చేసి.. ఇంకొందరు 'షార్ట్స్' కొట్టిస్తూ.. ఉలిక్కిపడేలా చేస్తున్నారు. కొందరైతే 'హార్ట్' ఎటాక్ వచ్చేలా భయపడిపోతున్నారు. వీరు బుల్లెట్ బైక్ లకు.. ఖరీదైన బైకులకు.. యమహాలాంటి బైకులకు ఈ తరహా అధిక సౌండ్ వచ్చేలా 'మెకానిక్'లకు పెట్టించుకుంటున్నారు.! వీరు.. మెయిన్ రోడ్డు మీద కొత్త బస్టాండ్ నుంచి మొదలుకుని నంది చౌరస్తా వరకు అతి వేగంగా వెళుతూ ఈ అధిక సౌండ్ వచ్చేలా ప్రవర్తిస్తున్నారు. అదే విధంగా 'అయిలాపూర్' రోడ్ మీదుగా.. 'కల్లూర్' రోడ్ మీదుగా తమ విన్యాసాలను ప్రదర్శిస్తూ ప్రజలను భయపెడుతున్నారు.

## ఫిర్యాదు అందిన రోజే.. బైక్ స్వాధీనం

ప్రజలను భయపెడున్న బైక్ ఇప్పుడే నా కళ్లముందే వెళ్లింది సార్.! అని ఎస్ఐ చిరంజీవి దృష్టికి ఓ ఔత్సాహికుడు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ చిరంజీవి స్పందించి 'సీసీ కెమెరాల్లో' టైము.. లొకేషను.. బైకు.. కలరు.. రైడర్.. ఎంతమంది ఆ బైక్ మీద ఉన్నారన్న సమాచారం సేకరించి 'ట్రేస్' చేశారు. ఫిర్యాదు అందిన కొద్ది గంటల్లోనే భయపెడుతున్న బైక్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ కు తరలించారు.

## ఇప్పటికైనా తొలగించుకోండి : ఎస్ఐ

ఇటీవలే కోరుట్లలో 123 సీసీ కెమెరాలను అమర్చడంతో 'ఎలాంటి నేరాలనైనా' ఇట్టే కంట్రోల్ చేయవచ్చన్నదానికి.. ఈ 'బైక్ స్వాధీన' ఘటనను ఉదాహరణ తీసుకోవచ్చంటున్నారు.! కాగా.. ఇదే తరహాలో అధిక సౌండ్'తీరుతో భయపెడుతున్న మిగిలిన కొన్ని బైకులను కూడా తొందరలోనే 'ట్రేస్' చేసి పట్టుకుంటామని ఎస్ఐ చిరంజీవి పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ విధంగా ప్రజలను భయపెడుతున్న బైకర్లు తమ సౌండ్ సిస్టంలను తొలగించుకుంటే మంచిదని హితవు పలికారు. లేదంటే 'న్యూసెన్స్' కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అట్లనే.. కోరుట్ల మెకానిక్ లు కూడా




బైకులకు 'అధిక సౌండ్' వచ్చే సిస్టమ్ లను బిగిస్తే వారూ శిక్షార్హులవుతారని ఎస్ఐ చిరంజీవి వార్నింగ్ ఇచ్చారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలు..
మంగళవారం
25 నవంబర్ 2025
కరీంనగర్


# గువాహాటి టెస్టుపై సౌతాఫ్రికా పట్టు




**ఘోర పరాజయం దిశగా టీమిండియా**
**పెవిలియన్‌కు క్యూ కట్టిన భారత బ్యాటర్లు**
**201 పరుగులకే ఆలౌటైన భారత్**
**మార్కో యాన్సెన్ 6 వికెట్లతో విజృంభణ**
**సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 26/0**

గువాహటి వేదికగా భారత్‌తో జరుగుతున్న టెస్టులో సౌతాఫ్రికా పట్టుబిగించింది. ఆల్‌రౌండ్ షోతో భారీ ఆధిక్యం దిశగా సాగిపోతుంది. మూడో రోజు ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 26/0 స్కోరుతో నిలిచింది. క్రీజులో రికెల్‌టన్ (13), మార్‌క్రమ్ (12) ఉన్నారు. దీంతో ప్రస్తుతం సౌతాఫ్రికా 314 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మార్‌క్రమ్‌కు లైఫ్ వచ్చింది. అతడు ఇచ్చిన కాస్త కష్టతరమైన క్యాచ్‌ను, సెకండ్ స్లిప్‌లో ఉన్న కేఎల్ రాహుల్ అందుకోవడానికి బాగానే ప్రయత్నించినా విఫలమయ్యాడు. అంతకుముందు 9- 0 స్కోర్?తో మూడో రోజు ఆట ప్రారంభించిన టీమ్ఇండియా 201 పరుగులకే కుప్పకూలింది. సౌతాఫ్రికా పేసర్ మార్కో యాన్సెన్ 6 వికెట్లతో విజృంభించాడు. భారత్ టాప్ ఏడుగురు బ్యాటర్లలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (58 పరుగులుబీ 97 బంతుల్లో 7x4, 1x6) ఒక్కడే రాణించాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. భారత్ తొలి ఇన్నింగ్స్?లో ఒక దశలో 95/1తో మెరుగైన స్థితిలోనే కనిపించింది. కానీ ఆ తర్వాతే ఆట పూర్తిగా మారిపోయింది. టీమ్ఇండియా టపటపా వికెట్లు చేజార్చుకొని 122-7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ (22 పరుగులు), సాయి సుదర్శన్ (15 పరుగులు) విఫలమయ్యారు. ధ్రువ్ జురెల్ డకౌట్ కాహా (0), రిషభ్ పంత్ (7 పరుగులు), రవీంద్ర జడేజా (6 పరుగులు), నితీశ్ కుమార్ రెడ్డి (10 పరుగులు) ఘోరంగా విఫలమయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (48 పరుగులుబీ 92 బంతుల్లో 2x4, 1x6), కుల్దీప్ యాదవ్ (19 పరుగులుబీ 134 బంతుల్లో) పోరాడారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. దీంతో భారత్ స్కోర్ 200ం దాటగలిగింది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 6 వికెట్లతో భారత్‌ను దెబ్బకొట్టగా, సైమన్ హర్మర్ 3, కేశవ్ మహరాజ్ ఒక వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్?లో సౌతాఫ్రితా తొలుత 489 పరుగుల భారీ స్కోర్ చేయగా, భారత్ 201 పరుగులకే ఆలౌటైంది. రూల్స్ ప్రకారం భారత్ ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే 290 పరుగులు చేయాల్సి ఉంది. కానీ, 201 పరుగులకే కుప్పకూలింది. దీంతో భారత్ ఫాలో ఆన్ ఆడాల్సి ఉంది. కానీ, 288 పరుగులు వెనుకంలో ఉన్న భారత్‌ను ఫాలోఆన్ ఆడించడానికి అవకాశం ఉన్నా సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ ఆడటానికే మొగ్గుచూపింది. బ్యాటింగ్‌లో ఔటాఫ్ సిలబస్‌లా దూసుకొచ్చి దుమ్మురేపిన మార్కో జాన్సెన్.. బౌలింగ్‌లోనూ నాలుగు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడు సిమన్ హర్మర్ రెండు వికెట్లతో చెలరేగాడు. దాంతో టీమిండియాకు కోలుకోలేని దెబ్బపడింది. ఇన్నింగ్స్ తేడాతో ఘోరపరాజయాన్ని మూటగట్టుకునే దిశగా భారత్ సాగుతోంది. రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతం చేసి రెండు రోజుల పాటు బ్యాటింగ్ చేస్తే తప్పా ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి నుంచి గట్టెక్కే అవకాశాలు లేవు. ఈ మ్యాచ్‌లో ఓడినా.. డ్రా చేసుకున్నా సిరీస్ 1-0తో సౌతాఫ్రికా కైవసం అవుతుంది. తొలి మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. అదే జరిగితే గౌతమ్ గంభీర్ కోచింగ్ కెరీర్‌లోనే ఈ పరాజయం ఓ మాయని మచ్చగా మిగిలిపోతుంది. ఇప్పటికే న్యూజిలాండ్‌తో సొంతగడ్డపై 0-3తో క్లీన్ స్వీప్ అయిన భారత్.. మరో ఘోర పరాజయాన్ని ఖాతాలో వేసుకుంటుంది. ఈ ఓటమితో డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలు కూడా సన్నగిల్లుతాయి.

## గంభీర్ పేరుతో సోషల్ మీడియాలో గందరగోళం



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పేరుతో సైబర్ కేటుగాళ్లు సోషల్ మీడియాలో గందరగోళం సృష్టించారు. గంభీర్ పేరు, ఫోటోతో ఒక నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాను సృష్టించి, అందులో ఆయన కోచ్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు పోస్ట్ చేయడం క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. ఇటీవల భారత జట్టు ప్రదర్శనపై, ముఖ్యంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పర్యటనల సమయంలో మిశ్రమ ఫలితాలు వస్తున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో గంభీర్ పేరుతో ఉన్న ఒక ఖాతా నుంచి ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. "భారత జట్టు కోచ్ బాధ్యతల నుంచి నేను తప్పుకుంటున్నాను. నాకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు" అనే అర్థం వచ్చేలా ఆ పోస్ట్ ఉంది. అచ్చం గంభీర్ అధికారిక ఖాతాను పోలిన విధంగా ప్రొఫైల్ పిక్చర్, బయో ఉండటంతో చాలా మంది నెటిజన్లు, క్రికెట్ అభిమానులు ఇది నిజమే అని పొరపడ్డారు. దీంతో క్షణాల్లో ఆ పోస్ట్ వైరల్ అయ్యింది. జట్టు వరుస వైఫల్యాల కారణంగా గంభీర్ ఈ నిర్ణయం తీసుకున్నారని కొందరు అభిమానులు ఆవేదన వ్యక్తం చేయగా, మరికొందరు ఇది ఫేక్ న్యూస్ అని అనుమానం వ్యక్తం చేశారు. ఆ పోస్ట్ చేసిన ఖాతాను నిశితంగా పరిశీలించగా, అది గంభీర్ అధికారిక ఖాతా కాదని తేలింది. గంభీర్ అధికారిక ఖాతాకు ఉండే 'వెరిఫైడ్ టిక్' లేకపోవడం, యూజర్ నేమ్‌లో చిన్నపాటి మార్పులు ఉండటాన్ని గమనించిన నెటిజన్లు.. ఇది సైబర్ కేటుగాళ్ల పనే అని నిర్ధారించారు. ఎవరో ఆకతాయిలు కావాలనే గందరగోళం సృష్టించడానికి ఈ పని చేశారని స్పష్టమైంది. ఇలాంటి సున్నితమైన సమయంలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారి పేరుతో ఫేక్ న్యూస్ సృష్టించడంపై అభిమానులు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి వార్తను గుడ్డిగా నమ్మవద్దని, అధికారిక ఖాతాల నుండి వచ్చే సమాచారాన్నే పరిగణలోకి తీసుకోవాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గంభీర్ తన కోచ్ బాధ్యతల్లోనే కొనసాగుతున్నారు.

## రొనాల్డో చిరస్మరణీయమైన గోల్



పురుషుల ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అత్యంత గొప్ప ఆటగాళ్లలో ఒకరైన క్రిస్టియానో రొనాల్డో తన 40వ ఏట కూడా అద్భుతమైన ఆటతీరును ప్రదర్శిస్తూ అభిమానులను అలరిస్తున్నాడు. సౌదీ అరేబియాలోని ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ క్లబ్ అల్ నాసర్ తరఫున ఆడుతున్న క్రిస్టియానో రొనాల్డో.. సౌదీ ప్రో లీగ్ మ్యాచ్‌లో అల్ ఖలీజ్ జట్టుపై చిరస్మరణీయమైన గోల్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. రియాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అల్ నాసర్.. అల్ ఖలీజ్‌పై 4-1 తేడాతో ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయం సౌదీ ప్రో లీగ్ ఈ సీజన్లో అల్ నాసర్‌కు వరుసగా తొమ్మిదో విజయం కావడం విశేషం. క్రిస్టియానో రొనాల్డో ఆటకు వయస్సు కేవలం ఒక సంఖ్య మాత్రమే అని నిరూపించాడు. మ్యాచ్ ముగింపు దశలో చూపిన విన్యాసం ఫుట్‌బాల్ చరిత్రలో నిలిచిపోతుంది. మ్యాచ్ దాదాపుగా ముగిసి అల్ నాసర్ విజయం ఖాయమైన తరుణంలో ఇంజరీ టైమ్‌లోని 90ం6వ నిమిషంలో క్రిస్టియానో రొనాల్డో తన అసాధారణమైన బైసైకిల్ కిక్‌తో గోల్ చేశాడు. బైసైకిల్ కిక్ లేదా ఓవర్‌హెడ్ కిక్ అనేది ఫుట్‌బాల్‌లో అత్యంత క్లిష్టమైన కిక్‌గా పరిగణించబడుతుంది. ఆటగాడు గోల్‌పోస్టుకు వెన్ను చూపి, గాలిలోకి వెనక్కి పడుతూ, తన కాళ్లను సైకిల్ పెడల్స్‌ను తొక్కే విధంగా గాల్లో వేగంగా తిప్పుతూ బంతిని గోల్ వైపు కొడతాడు. దీనికి ఎంతో ఫిట్‌నెస్ కావాల్సి ఉంటుంది. నవాఫ్ బౌషాల్ ఇచ్చిన క్రాస్‌ను అందుకున్న రొనాల్డో.. తన 40 ఏళ్ల వయస్సులో కూడా యువకుడిలా గాలిలోకి లేచి ఈ ఫీట్‌ను పూర్తి చేయడం అభిమానులకు పండుగలా అనిపించింది. ప్రేక్షకులు కళ్లార్పకుండా ఆ దృశ్యాన్ని వీక్షించారు. సౌదీ ప్రో లీగ్ ఈ సీజన్‌లో రొనాల్డోకు ఇది 10వ గోల్. అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్ల జాబితాలో అతను అగ్రస్థానం కోసం పోటీ పడుతున్నాడు. తన కళాత్మక గోల్‌తో ఉప్పొంగిన రొనాల్డో.. ఈ అద్భుతమైన క్షణాన్ని తన అభిమానులతో పంచుకునేందుకు వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశాడు. "ఉత్తమ శీర్షిక విజేతగా నిలుస్తుంది" అని పోస్ట్ చేసి, తన ఫాలోయర్‌లను ఈ గోల్‌కు సరిపోయే అద్భుతమైన శీర్షిక ఇవ్వమని కోరాడు. ఈ మ్యాచ్‌లో రొనాల్డో గోల్ చివరి మెరుపు మాత్రమే. అంతకుముందు జట్టు విజయం కోసం ఇతర కీలక ఆటగాళ్లు కృషి చేశారు. జోవో ఫెలిక్స్ 37వ నిమిషంలో అల్ నాసర్‌కు మొదటి గోల్‌ను అందించాడు. 42వ నిమిషంలో, బ్రెజిల్ యువ ఆటగాడు వెస్లీ మరో గోల్‌తో ఆధిక్యాన్ని పెంచాడు. అల్ ఖలీల్ తరఫున మురాద్ అల్ హవ్సావీ 47వ నిమిషంలో గోల్ చేసి కాస్త ఉత్సాహాన్నిచ్చినా.. 77వ నిమిషంలో స్టార్ ఆటగాడు సాదియో మానే చేసిన గోల్ అల్ నాసర్ విజయాన్ని ఖాయం చేసింది. సౌదీ ప్రో లీగ్ 2025-26 సీజన్‌లో అల్ నాసర్ అద్భుతమైన ప్రదర్శన చేస్తోంది. గతంలో 10 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన అల్ నాసర్ చివరిసారిగా 2018-19లో టైటిల్‌ను గెలుచుకుంది. గత మూడు సీజన్లలో రెండుసార్లు రెండో స్థానంలో నిలిచిన ఈ క్లబ్, ఈసారి రొనాల్డో సారథ్యంలో సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికి లీగ్ టైటిల్‌ను గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## ఐపీఎల్‌కు ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ గుడ్‌బై!!


ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ప్రతి సీజన్ ప్రారంభమయ్యే ప్రతిసారి.. ఎంఎస్ ధోనీకి ఇదే చివరి సీజన్ అంటూ అనేకసార్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. కరోనా సంక్షోభం నుంచి అంటే 2020 నుంచి ధోనీ ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ఇచ్చాడు అంటూ తెగ ట్రెండ్ చేస్తున్నారు. అయితే ఆయన గత ఐదేళ్లుగా ఐపీఎల్ ఆడుతూనే వచ్చాడు. కానీ, 2026 ఐపీఎల్ సీజన్ మాత్రం తలా ధోనికి చివరిదని అంటున్నారు. అయితే ఇది పుకారు మాత్రం కాదు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు చెందిన ఓ వ్యక్తి ఈ విషయాన్ని వెల్లడించారు. అయితే అతని పేరు మాత్రం బయటకు రానివ్వడం లేదు. ఇదే క్రమంలో ధోనిని ఈ సీజన్ ను రిటైన్ చేసుకున్నా.. కొత్తగా సంజూ శాంసన్‌ను రాజస్థాన్ జట్టు నుంచి సీఎస్కే తెచ్చుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంజూ కొత్త కెప్టెన్ అవుతాడనే వార్తలు వస్తున్న వేళ.. ధోనికి ఇదే చివరి సీజన్ అంటూ తెగ న్యూస్ వైరల్ అవుతుంది. ధోనితో పాటు మరికొందరు క్రికెటర్లకు ఇదే చివరి సీజన్ అంటూ చెబుతున్నారు. ఈ సీజన్ తర్వాత ఎంఎస్ ధోనీ రిటైర్మెంట్ తప్పనిసరి అంటూ వాదన వినిపిస్తుంది. ధోని 2026 ఐపీఎల్‌లో ఆడతాడని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ధృవీకరించారు. అయితే ఇదే తన చివరి ఐపీఎల్ సీజన్ అంటూ బలమైన సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ధోని మోకాలి నొప్పి సమస్యతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ సామ్సన్ సీఎస్కే కి మారడం చాలా కీలకంగా పరిగణిస్తున్నారు. వికెట్ కీపర్ స్థానంతో పాటు కెప్టెన్సీ నిర్వహించుకునేందుకు సంజూ పనికొస్తాడని సీఎస్కే మేనేజ్‌మెంట్ భావించినట్లు తెలుస్తోంది. ఈ విధంగా ధోనికి ప్రత్యామ్నాయంగా సంజూ శాంసన్ మారబోతున్నాడని బలమైన సంకేతం సీఎస్కే యాజమాన్యం నుంచి వినిపిస్తుంది. ధోని కాకుండా, మరో ఇద్దరు సీనియర్ భారత ఆటగాళ్లకు ఇది చివరి ఐపీఎల్ సిరీస్ అయ్యే అవకాశం ఉంది. గుజరాత్ టైటాన్స్ జట్టులో అట్టిపెట్టుకున్న ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మ గత కొన్నేళ్లుగా మంచి ఫామ్‌లో లేడు. 2025 సీజన్‌లో అతను 7 మ్యాచ్‌లు ఆడి 4 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. దీంతో పాటు అతని ఎకానమీ రేటు 11.80గా ఉంది. ఫిట్‌నెస్, వయస్సు కారణంగా ఇషాంత్ శర్మ 2026 సీజన్ తర్వాత రిటైర్ అయ్యే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. గతేడాది ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు నాయకత్వం వహించిన రహానే.. బ్యాటింగ్‌తో కొంతవరకు బాగా రాణించినప్పటికీ (12 మ్యాచ్‌ల్లో 390 పరుగులు) జట్టును విజయపథంలో నడిపించడంలో విఫలమయ్యాడు. దీంతో గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. అయినా కొందరి సన్నిహితుల సమాచారం ద్వారా రహానే కూడా వచ్చే సీజన్ తర్వాత రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పిన రోహిత్ శర్మ ఇప్పుడు ఐపీఎల్‌కు వీడ్కోలు చెప్పనున్నారని సమాచారం. ఈ టోర్నీకి రిటైర్మెంట్ చెప్పి.. పూర్తిగా వన్డేలపై దృష్టి పెట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా రాబోయే వన్డే ప్రపంచకప్ టార్గెట్ పెట్టుకున్నట్లు అంటున్నారు.





## నవంబర్ 30 న చరిత్ర సృష్టించనున్న కోహ్లీ-రోహిత్

భారత క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్. సౌతాఫ్రికాతో త్వరలో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌తో స్టార్ ఆటగాళ్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జోడీ ఒక అరుదైన చరిత్ర సృష్టించడానికి సిద్ధమవుతోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటివరకు కలిసి 391 మ్యాచ్‌లు ఆడారు. ఇదే సంఖ్యలో క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్ జోడీ కూడా మ్యాచ్‌లు ఆడారు. కాబట్టి నవంబర్ 30న సౌతాఫ్రికా పై తొలి వన్డే కోసం రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కలిసి మైదానంలోకి అడుగుపెడితే వారు సచిన్-ద్రవిడ్ రికార్డును అధిగమించి, భారతదేశం తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన నంబర్ 1 జోడీగా చరిత్ర సృష్టించనున్నారు. ఈ వన్డే సిరీస్‌కు సంబంధించి బీసీసీఐ ఆదివారం (నవంబర్ 23) స్క్వాడ్‌ను ప్రకటించింది. రెగ్యులర్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ అయిన కేఎల్ రాహుల్‌కు తాత్కాలిక కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించారు. భారత గడ్డపై చాలా రోజుల తర్వాత రోహిత్-కోహ్లీ జోడీని చూడబోతున్నందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చివరిసారిగా వీరిద్దరూ స్వదేశంలో ఐపీఎల్ టోర్నమెంట్‌లో మాత్రమే కలిసి ఆడారు. రోహిత్-కోహ్లీ జోడీతో పాటు, సచిన్-ద్రవిడ్ (391), ద్రవిడ్-గంగూలీ (369), సచిన్-కుంబ్లే (367), సచిన్-గంగూలీ (341) జోడీలు కూడా అంతర్జాతీయ క్రికెట్‌లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అగ్రశ్రేణి భారత జోడీలలో ఉన్నాయి. భారత్, సౌతాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 30 నుంచి ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లు రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో జరగనున్నాయి. మొదటి వన్డే నవంబర్ 30న రాంచీలో, రెండో వన్డే డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో, చివరి వన్డే డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరగనుంది. వన్డే సిరీస్‌కు భారత స్క్వాడ్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, రిషబ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిద్ కృష్ణ, ధ్రువ్ జురెల్, అర్ష్‌దీప్ సింగ్







భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ముంబై లోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో ‘షోలే‘, ‘చుప్కే చుప్కే‘, ‘ధర్మ్ వీర్‘, ‘సీతా ఔర్ గీత‘, ‘యాదోం కి బారాత్‘ వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు ‘హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్‘ అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం ’ఇక్కీస్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఇదిలావుంటే బాలీవుడ్ స్టార్ ధర్మేంద్ర అంత్యక్రియలను అత్యంత గోప్యంగా నిర్వహించారు. ముంబైలోని పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు చేపట్టారు. వార్త తెలిసన వెంటనే ధర్మేంద్ర భార్య , ప్రఖ్యాత నటి హేమామాలిని, ధర్మేంద్ర కుమార్తె ఈషా డియోల్.. శ్మశానవాటికకు చేరుకున్నారు.

# బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర మృతి



కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స

సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి

స్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు



## రాష్ట్రపతి, ప్రధాని సంతాపం

### స్మశానవాటికలో నివాళి అర్పించిన సినీ దిగ్గజాలు



**ముంబై,నవంబర్24(ఆర్ఎన్ఎ):** సోమవారం ధర్మేంద్ర ఆరోగ్యం విషమించడంతో ఆయన కన్నుమూశారు.. సినీ ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని సోషల్ మీడియా వేదికగా గుర్తుచేసుకున్నారు. ధర్మేంద్ర పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో స్థానిక విల్లే పార్లే శ్మశాన వాటికకు తరలించారు. ధర్మేంద్ర కన్నుమూశారన్న సమాచారం తెలుసుకున్న సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని కడసారి చూసేందుకు శ్మశాన వాటికకే తరలివచ్చి, నివాళులర్పించారు. ధర్మేంద్ర మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ’భారతీయ సినిమాలో ఒక శకం ముగిసింది. తన నటనతో అనేక పాత్రలకు వన్నె తెచ్చారు. ఇది ఎంతో విచారకరమైన సమయం. ధర్మేంద్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. చిత్ర పరిశ్రమకు తీరని లోటు ’ అని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ధర్మేంద్ర మృతిపట్ల దర్శక, నిర్మాత కరణ్‌జోహార్ కూడా విచారం వ్యక్తం చేశారు. ఒక శకం ముగిసిందన్నారు. ’మెగాస్టార్, గొప్ప అందగాడు, ఇండియన్ సినిమా లెజెండ్ వన్ అండ్ ఓన్లీ ధర్మేంద్రజీ మిమ్మల్ని ఎంతో మిస్ అవుతున్నాం’ అని పేర్కొన్నారు. ధర్మేంద్ర 1935 డిసెంబరు 8న జన్మించారు. ఆయన పూర్తి పేరు ధర్మేంద్ర కెవల్ క్రిషన్ దేవోల్. 1954లో ప్రకాశ్‌కౌర్‌ను వివాహం చేసుకున్నారు. 1980లో బాలీవుడ్ సీనియర్ నటి హేమమాలినిని రెండో వివాహం చేసుకున్నారు. ధర్మేంద్రకు సన్నీ, బాబీ, ఈషా సహా ఆరుగురు సంతానం. బాలీవుడ్ హీ-మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న ఆయన నటనకు అనేక అవార్డులు వచ్చాయి. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి భాజపా ఎంపీగా గెలుపొందారు. 1960లో ’దిల్ బీ తేరా హమ్ బీ తేరే’తో నటుడిగా కెరీర్‌ను ఆరంభించిన ఆయన ’అన్‌పఢ్ ’, ’బందినీ’, ’అనుపమ’, ’ఆయా సావన్ జూమ్ కే’ తదితర చిత్రాలతో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ’షోలే’, ’ధర్మవీర్’, ’చుప్కే చుప్కే’, ’మేరా గావ్ మేరా దేశ్’, ’డ్రీమ్ గర్ల్’ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేశాయి. ధర్మేంద్ర కెరీర్‌లో దాదాపు 300లకు పైగా చిత్రాల్లో నటించారు. చివరిగా షాహిద్ కపూర్, కృతి సనన్‌ల ’తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా’ చిత్రంలో వెండితెరపై కనిపించారు.

# ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్లుగా రాజాసాబ్

## పాట విడుదల సందర్భంగా దర్శకుడు మారుతి


## ఎన్టీఆర్ అభిమానులకు క్షమాపణలు

ప్రభాస్ అభిమానులు తనపై పెట్టుకున్న నమ్మకానికి మించి ’ది రాజాసాబ్’ ఉంటుందని దర్శకుడు మారుతి అన్నారు. ప్రభాస్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ’ది రాజాసాబ్’. తాజాగా ఈ సినిమా నుంచి ’రెబల్ సాబ్’ అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ.. ఈ చిత్రం విడుదలైన రోజు థియేటర్లు కేరింతలతో మార్మోగిపోవడం ఖాయమన్నారు. అందుకు తనదే హామీ అని చెప్పారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్రం జనవరి 9న విడుదల కానుంది. ప్రభాస్ కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ ’ది రాజా సాబ్’ సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ఒక్కో అప్‌డేట్ ఇస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాట ’రెబల్ సాబ్’ను విడుదల చేసింది. తమన్ స్వరాలు సమకూర్చిన పాట ప్రస్తుతం ట్రెండ్ అవుతోంది. ఇకపోతే మారుతి వివాదంలో చిక్కారు. మైక్ ముందు ఉంది కదా అని ఏదో ఒకటి అనేస్తున్నారు.. ట్రోల్స్ కు గురవుతున్నారు.. మళ్లీ



తిరిగి క్షమాపణలు కోరుతున్నారు. తాజాగా డైరెక్టర్ మారుతీ.. ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు క్షమాపణలు చెప్పాడు. రిలీజ్ డేట దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మారుతీ.. రాజా సాబ్ నుంచి రెబల్ సాబ్ అంటూ సాగే సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ లో మారుతీ.. ఎన్టీఆర్ ని అవమానించడంటూ ఫ్యాన్స్ రచ్చ చేయడం మొదలుపెట్టారు. ఈ ఈవెంట్ లో మారుతీ మాట్లాడుతూ.. ’కాలర్ ఎగరేసుకుంటారు.. అట్లా చెప్పను. ఎందుకంటే అవ్వన్నీ ఆ కట్ అవుట్ ముందు చాలా చిన్నవి అయిపోతాయి. నేను ప్రస్తుతం రెబెల్ యూనివర్సిటీలో చదువుకుంటున్నా. ప్రభాస్ ఫోటో జేబులో ఉంటే చాలు ఎలాంటి డైరెక్టర్ అయిన టాప్ డైరెక్టర్ అయిపోతాడు’ అంటూ చెప్పుకొచ్చాడు. వార్ 2 ఈవెంట్ లో ఎన్టీఆర్ ఇలానే కాలర్ ఎగరవేసి తమ సినిమా హిట్ అవుతుందని చెప్పాడు. ఇప్పుడుమారుతీ ఎన్టీఆర్ నే అన్నాడని, తమ హీరోని పొగడడంలో తప్పు లేదు కానీ, వేరే హీరోతో కంపేర్ చేయడం .. ఆ హీరోని అవమానించడమే అని చెప్పుకొస్తున్నారు. ఇక ఈ విషయం పెద్దది కాకుండా మారుతీ ఆదిలోనే తుంచేశాడు. ఫ్యాన్స్ కి సారీ చెప్పి ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాడు. ’ ముందుగా నేను ప్రతి అభిమానికి హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నాను. ఎవరినీ బాధపెట్టడం లేదా అగౌరవపరచడం నా ఉద్దేశ్యం కాదు. కొన్నిసార్లు మాటల ప్రవాహంలో మనం అనుకున్న మాటలు అనుకున్నట్లు రాకపోవచ్చు. నేను అన్న మాటలు వేరే విధంగా అర్థం చేసుకున్నందుకు నేను చింతిస్తున్నాను.ఎన్టీఆర్ గారి పట్ల మరియు ఆయన అభిమానులందరి పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. సినిమా పట్ల,మీ హీరో పట్ల మీరు చూపే ప్రేమకు నేను నిజంగా విలువ ఇస్తున్నాను. ఇది నేను ఉద్దేశ్యపూర్వకంగా చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను. ఈ విషయాన్ని అభిమానులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను’ అంటూ చెప్పుకొచ్చాడు.

# నటి శ్రద్ధాకపూర్‌కు గాయం



నటి శ్రద్ధాకపూర్ ప్రస్తుతం ’ఈతా’లో నటిస్తోన్న సందర్భంగా ఇటీవల ఈ సినిమా షూటింగ్‌లో ఆమె కాలుకు గాయమైంది. దీంతో అభిమానులు ఆందోళన చెందారు. తాజాగా తన హెల్త్ అప్‌డేట్‌ను శ్రద్ధా పంచుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఒక అభిమాని గాయం ఎలా ఉందని పోస్ట్ పెట్టగా దానికి ఆమె రిప్లై ఇచ్చారు. ‘పెద్ద దెబ్బ ఏం కాదు.. కాలి కండరానికి దెబ్బ తగిలి కొంచెం ఫ్రాక్చర్ అయింది. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. నేను క్షేమంగానే ఉన్నా. త్వరలోనే మీ ముందుకు వస్తాను‘ అని చెప్పారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో ’ఈతా’ తెరకెక్కుతోంది. ఇటీవల నాసిక్‌లో ఒక భారీ సెట్ వేసి షూటింగ్ నిర్వహిస్తుండగా శ్రద్ధా కాలికి గాయమైంది. భారీ కాస్ట్యూమ్స్ ధరించి డ్యాన్స్ వేస్తుండగా ప్రమాదం జరిగింది. ఎడమ కాలుకు గాయం కావడంతో షూటింగ్‌ను కొన్ని రోజులు నిలిపివేశా రు . ఈ సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి.


Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 966605221**

# దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- 12 కోట్ల రూపాయలతో 150 అడుగుల రాజగోపురం.
- రాజగోపురం పుట్టింగ్ పనుల ప్రారంభోత్సవం
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**నేటి సాక్షి :జిన్నారం (గుమ్మడిదల) :** రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని.. 12 కోట్ల రూపాయలతో 150 అడుగుల రాజగోపురం నిర్మిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న రాజగోపురం పుట్టింగ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం వేలాది మంది దర్శించుకునే బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు, దాతల సహాయ సహకారాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద రాజగోపురాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, పాలక మండలి చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, ఈవో శశిధర్ గుప్తా, షేక్ హుస్సేన్, సీనియర్ నాగేందర్ గౌడ్, లక్ష్మీనారాయణ, వినోద్, తదితరులు పాల్గొన్నారు



# రైతు సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వం లక్ష్యం



**కొట్టే శివకుమార్,, క్లస్టర్ఇంచార్జి**

**నేటి సాక్షి :** చిన్నగొట్టిగల్లు మండలంలోలాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు చిన్నగొట్టిగల్లు లో " రైతన్న.. మీకోసం కార్యక్రమం నిర్వహించారు.. తెలుగుదేశం ప్రభుత్వం రైతుల కోసం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తుంది చంద్రగిరి శాసన సభ్యులు శ్రీ పులివర్తి నానీ అన్న గారి సూచనల మేరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు...అందులో భాగంగా చిన్న గొట్టిగ ల్లు లో జరిగిన ఈ కార్యక్రమంలో కొట్టే శివకుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు అన్ని రకాలైన పథకాలను అమలు చేస్తున్నారు. డ్రిప్ ద్వారా వేలాది మంది రైతులను ఆదుకుంటుందని, సబ్సిడీ ద్వారా యంత్రాలను, సబ్సిడీ ధరకు ఎరువులను, విత్తనాలను పంపిణీ చేస్తుందన్నారు. రైతుల కోసం అన్ని రకాల అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు వీటిని రైతులు తెలుసుకొని ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయాలని కోరారు.. సాగు పద్ధతులను మార్చుకోవాలని ప్రధానంగా రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి వాటికి ప్రస్తుతం డిమాండ్ పెరిగిందని వీటి సాగు పట్ల రైతులు దృష్టి సారించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయాకుడు సంద్ర మోహన్ రెడ్డి, కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు

# దేశానికి అన్నంపెట్టే రైతును గౌరవంగా చూడాలి

- ఇదే ఏపీ సీఎం చంద్రబాబు సంకల్పం, కూటమి ప్రభుత్వం ఆశయం
- అన్నదాత సుఖీభవ పథకం అన్నదాతలకు ఆర్థిక భరోసానిస్తుంది
- రైతన్నల జీవితాలలో వెలుగులు నిప్పుతుంది
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) చిత్తూరు నవంబర్ 24-11-25 :** మనిషి మనుగడకు మూలస్తంభంగా నిలిచి,.. దేశానికే పట్టెడు అన్నం పెడుతున్న అన్నదాతను గౌరవించాలన్నారు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.ఇదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం.., కూటమి ప్రభుత్వం ఆశయం అన్నారు. నేలను దున్ని మట్టినుండి అన్నాన్ని బయటకు తీసిన తొలి శాస్త్రవేత్త రైతును మనమందరం కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అన్నదాత సు-ఖీభవ - పి.యం.కిసాన్ పథకానికి సంబంధించి, రెండవ విడత నగదును ఈ నెల 19న రైతన్నల ఖాతాల్లోకి జమ చేసిన కూటమి ప్రభుత్వం. అన్నదాత సుఖీభవ - పి.యం.కిసాన్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని సంకల్పించింది. అంతేకాకుండా అన్నదాతలను ఈ పథకంలో భాగస్వామ్యం చేసేందుకు వారంరోజుల పాటు ఇంటింటి ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం లక్ష్యాన్ని , ఢిల్లీలో ఉన్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనలో అభినందించారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో అన్నదాతల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించడంతో పాటు వారి శ్రేయస్సు కోసం ఎన్నో సంస్కరణలను తీసుకొస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రైతు పక్షపాతి అంటూ ఆయన కొనియాడారు. నాగటి చాళ్లలో దేశ భవితను చూపించిన తొలి దార్శనికుడు రైతు అని చెప్పిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ..., తాను తింటూ పదిమందికి పెడుతూ అందరూ సుఖంగా బతకాలని కోరుకునే తొలి సమ-సమాజ సిద్ధాంతకర్త రైతు అని ప్రశంసించారు. అందుకే కూటమి ప్రభుత్వం ఏడాది వ్యవసాయ బడ్జెట్‌లో రూ 48,340 కోట్లు కేటాయించి, వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల హామీలో భాగమైన అన్నదాత సుఖీభవ పథకం కోసం ఏటా రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించేందుకు రూ.9,400 కోట్లు కేటాయించడం రైతులపట్ల చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆగస్టు 2నుంచి ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈ పథకానికి సంబంధించిన రెండవ విడత నిధులను రైతన్నల ఖాతాల్లోకి జమ చేసి, వారిలో ఆర్థిక భరోసా నింపి, తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని తెలిపారు. ఇలా చేయడం వల్ల అన్నదాతకు అండగా నిలవడమే కాక వారికి తక్షణ ఉపశమనం కలిగించడం, వ్యవసాయాన్ని లాభదాయకం చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, రైతన్నల జీవితాలలో వెలుగులునిప్పేందుకు వీలవుతుందని ఎంపీ దగ్గుమళ్ళ వివరించారు.



# ఇందిరమ్మ చీరల పంపిణీ- నాణ్యతపై మహిళలు హర్షం

- ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టీ చీర అందజేత..
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీఎం శ్రీనివాస్..

**నేటి సాక్షి పాలేరు , నవంబర్ 24 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడబిడ్డలకు చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కోలాహలం మధ్య జరిగింది. ఇందిరా మహిళా శక్తి పేరుతో మహిళా స్వయం సహాయక సంఘాలకు మీ రేవంతన్న కనుక అని కవర్ లోగో ఉన్న కవర్లో చీరలను పెట్టీ అందజేశారు.. తొలుత తురకగూడెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్ పాల్గొని మహిళలకు చీరలను అందించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని దృడ నిర్ణయం తీసుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో అన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు అలాగే 18 ఏళ్ళు నిండి రేషన్ కార్డు కలిగిన ప్రతి మహిళకు చీర అందిస్తామని తెలిపారు.. గ్రామ విఓ ల ద్వారా ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టీ చీర అందిస్తారని అన్నారు.. ఎవరికి చీరలు రాలేదు అనే భయం వద్దు అందరికీ తప్పకుండా చీర అందిస్తారని అన్నారు.. ఈ చీరల పంపిణీ కార్యక్రమం తెలంగాణ ఆడబిడ్డల గౌరవం అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీను , విఓ కన్నెబోయిన వినోద , కాంగ్రెస్ నాయకులు కొమ్ము ప్రభాకర్ రావు, బుర్ర రజిత , గణపారపు మల్సూరు, మాజీ సర్పంచ్ కన్నెబోయిన కౌసల్య లింగయ్య తదితరులు పాల్గొన్నారు..



# చాబోల్ గ్రామ ప్రజలకు స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదు

**సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు..**



**నేటి సాక్షి 24 నవంబర్ జూపాడుబంగ్లా :** జూపాడు బంగ్లా మండలం చాబోలు, బన్నూర్ గ్రామ 200 కుటుంబాలకు ఎమ్మెల్యే, కలెక్టర్ హామీ మేరకు త క్షణమే జూపాడుబంగ్లా గ్రామంలో ప్రతి కుటుంబానికి మూడు సెంట్లు ఇళ్ల స్థలంతో పాటు గృహాలు నిర్మించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఆదివారం సిపిఐ శాఖ సమావేశం కార్యదర్శి నాగన్న, రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి చాబోలు గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక రూపాల్లో ఆందోళన కొనసాగించామని పోతిరెడ్డిపాడు వెడల్పు బ్లాస్టింగ్ వల్ల ఇళ్ళంతా దెబ్బతిని పగుళ్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. అనేకసార్లు పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేశామని తీరా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుండగా ఇళ్ల స్థలాలు లేకుండా గృహాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలని ఈ విషయంపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు కోరారు.. కాబోలు 80 బన్నూరు సిద్దేశ్వరం తదితర గ్రామాల పేద గిరిజనులకు దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీ పక్కన జూపాడుబంగ్లాలో తనని కేటాయించి ఇప్పుడు గృహాలు దరఖాస్తుకు సహకరించాలని వారు కోరారు లేని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష తప్పదని వారి హెచ్చరించారు.. కార్యక్రమంలో గ్రామ శాఖ నాయకులు రమణ సుధాకర్ శేఖర్ రాజు ప్రజలు పాల్గొన్నారు..

# ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలి

**సీపీఐ .. జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్ బాబు డిమాండ్.**



**నేటి సాక్షి జూపాడుబంగ్లా 24 :** పోతిరెడ్డి పాడు వెడల్పు పనుల బ్లాస్టింగ్ వల్ల ఇళ్ళు దెబ్బతిన్న చాబోలు గ్రామ ప్రజలకు, 80బన్నూర్, సిద్దేశ్వరం గ్రామాల పేద గిరిజనులకు జూపాడు బంగ్లా జగనన్న కాలనీ పక్కన సీడ్ ఫారం లో ప్రతి కుటుంబానికి 3సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం రమేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి పీజిఆర్ఎస్ లో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు మాగబుల్ బాషా, నరసింహ, పుల్లయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి చాబోలు గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అనేక రూపాల్లో ఆందోళన కొనసాగించామని పోతిరెడ్డిపాడు వెడల్పు బ్లాస్టింగ్ వల్ల ఇళ్ళంతా దెబ్బతిని పగుళ్లతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. అనేకసార్లు పిజిఆర్ఎస్లో ఫిర్యాదు చేశామని తీరా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుండగా ఇళ్ల స్థలాలు లేకుండా గృహాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలని ఈ విషయంపై అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు కోరారు.. కాబోలు 80 బన్నూరు సిద్దేశ్వరం తదితర గ్రామాల పేద గిరిజనులకు దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీ పక్కన జూపాడుబంగ్లాలో తనని కేటాయించి ఇప్పుడు గృహాలు దరఖాస్తుకు సహకరించాలని వారు కోరారు.. సీపీఐ నాయకులు రమణ సుధాకర్ శేఖర్ రాజు ప్రజలు పాల్గొన్నారు..

# మహిళలకు చీరల పంపిణీ



**నేటి సాక్షి నారాయణపేట నవంబర్ 24 :** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో సోమవారం నాడు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెలంగాణ మహిళలకు ఇస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మహిళా సంఘాల సభ్యులకు నారాయణపేట జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంల సింగల్ విండో చైర్మన్ వెంకట్రామ్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు వినితమ్మ, రామ్ చంద్రయ్య, అధికారులు ఎంపీడీఓ బి రాజ్ కుమార్, మరికల్ తాసిల్దార్ రామకోటి, పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి, రామన్ గౌడు, హరీష్ కుమార్,రామకృష్ణారెడ్డి రఘు, పెంట మీద రాఘవేంద్ర, చెన్నయ్య, గోవర్ధన్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు మరియు సభ్యులు మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..


# వెహికల్ అండర్ బ్రిడ్జి కోసం ఎంపీ గురుమూర్తి కృషి

- టయోటా షోరూం వద్ద తరచూ ప్రమాదాలు
- వెహికల్ అండర్ బ్రిడ్జి కోసం ఎంపీ గురుమూర్తి కృషి



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి పార్లమెంటు పరిధి, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని రేణిగుంట మండలం తూకివాకం, పన్నీరు కాల్వ, కొత్తకాల్వ, కొత్త మంగళం, వి.ఆర్. కండ్రిగ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు భద్రతా సమస్యలను వివరించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తిని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రేణిగుంట మాజీ జడ్పీటిసి తిరుమల రెడ్డి, తూకివాకం ఎంపిటిసి ఆనందరావు, వార్డు మెంబర్ శేఖర్ రెడ్డి, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. చిత్తూరు, నాయుడుపేట జాతీయ రహదారి (ఎన్. హెచ్%-%16)పై తూకివాకం సమీపంలోని టయోటా షోరూమ్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అతిగా పెరిగిన వాహన రద్దీ కారణంగా సాధారణ ప్రజలు హైవే దాటడమే ఒక సవాలుగా మారిందన్నారు. సమీప గ్రామాల ప్రజలు రోడ్డు దాటే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు వం-సగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి విస్తరణతో వాహనాల వేగం పెరిగి ప్రమాదాల సంఖ్య కూడా పెరిగాయని ఎంపీకి తెలిపారు. వెహికల్ అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నాయకులు తెలిపారు. ఈ సమస్యపై ఎంపీ మద్దిల గురుమూర్తి స్పందిస్తూ ఇప్పటికే కేంద్ర రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ ప్రదేశంలో వెహికల్ అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై పూర్తి స్థాయి సాంకేతిక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించాల్సిందిగా గడ్కరీ మంత్రి ఆదేశించినట్లు ఎంపీ వెల్లడించారు. దీనికి సంబంధించి తమ కార్యాలయం నుంచి నిరంతరం ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు.

# నల్లగుంట్ల కిష్టమ్మకు ఘన నివాళులు


**పరామర్శించిన పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్. సూర్య మోహన్ రెడ్డి**





**నేటి సాక్షి నారాయణపేట, నవంబర్ 24 :** మరికల్ మండల కేంద్రంలోని స్థానిక ఎస్ సి కాలని లో నివాసం ఉంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లగండ్ల నాగప్ప గారి సతీమణి అయిన నల్లగండ్ల కిష్టమ్మ గారు మరణించడం జరిగినది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న , సూర్య చంద్ర ఫౌండేషన్ అధినేత, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి గారు ఆమె పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి 5000 వెయిల రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగినది. వారి కుటుంబానికి ఎల్లప్పుడూ కూడా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేయడం జరిగినది. వీరి వెంట మరికల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరీష్ కుమార్ గారు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కె ఆంజనేయులు , చెన్నయ్య,తిర్మలయ్య, సీమ గోపాల్, పొలెమోని రామకృష్ణ, టైసన్ రఘు, బోయ వెంకటేష్,సీమ కమల్, ఆంజప్ప బోయ రాములు, శివ, సుదర్శన్ రెడ్డి, రఘు యాదవ్, బోయ రఘు, సద్దాం, బాబు తదితరులు నివాళులు అర్పించడం జరిగినది.

# హిందీ నటుడు ధర్మేంద్ర మృతి తిరనిలోటు



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** ప్రముఖ జాతీయ హిందీ చలన చిత్ర బాలీవుడు నటుడు, పద్మభూషణ్ ధర్మేంద్ర మృతి జాతీయ కళా రంగానికి తీరని లోటని జగిత్యాల జిల్లా కళాకారులూ కుమార్ పటేల్, ఎన్నం కిషన్ రెడ్డి,అడ్వకెట్ మల్లేశం, రాము, కవిత, నాగజ్యోతి లు అన్నారు. షోలే చిత్రంతో ప్రపంచ చిత్ర రంగానికి పరిచయమై, ఆ చిత్రాన్ని ప్రపంచ పుటల్లో ఇప్పటికి చెరగని ముద్ర నిలిచేలా చేసిన ధర్మేంధ్ర గొప్ప నటుడని స్మరించుకున్నారు. సోమవారం హిందీ నటుడు ధర్మేంద్ర చిత్ర పటం వద్ద రెండు నిమిషాలు మౌనం వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి తో పాటు శశిధర్ రెడ్డి, సునీత, గంగభవాని,గడ్డం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో ఎస్సీల రిజర్వేషన్స్ లో అన్యాయం జరుగుతుంది.




**నేటి సాక్షి - లక్సెట్టిపేట(రేగుంట ప్రసాద్) నవంబర్ 24:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ఏరియాల్లోని ఉప సర్పంచ్, వార్డ్ సభ్యుల రిజర్వేషన్స్ లో ఎస్సీలకు అన్యాయం చేస్తున్నాయని ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గోళ్ళ రాయమల్లు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... 2011 జనాభా లెక్కల ప్రకారం ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీలకు వార్డ్ సభ్యుల రిజర్వేషన్స్ కేటాయించడం అనేది 2018 వరకు జరిగిందన్నారు కానీ 2018 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో ఎస్సీ వార్డ్ సభ్యుల ఎన్నికకు రిజర్వేషన్స్ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలను మినహాయించి మిగతా అన్ని వర్గాల వారికి 2018 నుంచి నేటి ఎన్నికల వరకు నూతన జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్స్ కల్పిస్తున్నాయని వివరించారు. ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీలు జన్మించడమే తప్పా? అని ప్రశ్నించారు. ఏజెన్సీ ఏరియాల్లో ఎస్సీ వార్డ్స్ రిజర్వేషన్స్ తొలగించడం వలన ఉప సర్పంచ్ పదవి తమ వర్గాలకు అందకుండా పోతుందన్నారు. అనంతరం అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ మాట్లాడుతూ జనాభాలో రెండున్నర శాతం ఉన్నటువంటి అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్స్ ఇచ్చి బీసీ,ఇతర బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నటువంటి ఎస్సీ పాలకులు ఈ వచ్చే ఎన్నికల్లో ఎస్సీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక మండల ప్రెసిడెంట్ చొప్పదండి రమేష్,మండల నాయకులు తోటపల్లి మహేందర్, లింగంపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్ట్ తరలింపు కుట్రపై జిల్లా మొత్తంలో అలజడి

- మహబూబాబాద్‌కు మంజూరైన రైల్వే డిపో కళ్లముందే ఘన్‌పూర్‌కు దోపిడీ!
- వరంగల్ నేతల లాబీయింగ్ జోరుగా - మన నేతల మౌనం ప్రజల్లో ఆగ్రహం!
- “మానుకోటకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం!”
- ఎమ్మెల్సీ రవీందర్ రావు గర్జన
- వేలాది ఉద్యోగాలు, అభివృద్ధి అవకాశాలు శాశ్వత ప్రమాదంలో!
- మహబూబాబాద్ ప్రజలు మేల్కొంటున్నారు



**నేటి సాక్షి మహబూబాబా ద్ (భూక్యా రవి నాయక్) నవంబర్ 24:** మహబూబాబాద్ జిల్లాకు భారీగా మంజూరైన మెగా మెయింటెనెన్స్ రైల్వే డిపో ప్రాజెక్ట్‌ను ఘన్‌పూర్ వైపు మళ్లించే కుట్ర బయటపడుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బిలియన్ల విలువ గల ఈ ప్రాజెక్ట్ మహబూబాబాద్‌కు ఉద్యోగాలు, పరిశ్రమలు, రైలు సేవలు, వృద్ధి అవకాశాలు తీసుకురాబోతున్న సమయంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఏ మ్మెల్యే శ్రీహరి, వర్ధన్నపేట ఏ మ్మెల్యే నాగరాజులు రైల్వే అధికారులతో వరుస సమావేశాలు జరుపుతూ ఈ డిపోను తమ ప్రాంతానికి లాక్కెళ్లేందుకు తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే సమయంలో మహబూబాబాద్ ప్రజాప్రతినిధులు మాత్రం ఏమీ కనిపించనట్లుగా నిశ్శబ్దంలో ఉండిపోవడం ప్రజల్లో అసహనాన్ని మరింత పెంచుతోంది. మహబూబాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు తీవ్రంగా మండిపడుతూ “మానుకోటకు అన్యాయం జరిగితే మేం చూస్తూ ఊరుకోం, ప్రాజెక్ట్ తరలిస్తే ప్రజలతో కలిసి నిలబడి అడ్డుకుంటాం” అని గర్జించారు. ఆయన ఆగ్రహవ్యక్తీకరణ జిల్లాలో ప్రజలకు ధైర్యం నింపినప్పటికీ మిగతా నేతల స్పందన లేకపోవడం పెద్ద ప్రశ్నగా మారింది. ఈ ప్రాజెక్ట్ పోతే మహబూబాబాద్‌కు 300–500 ప్రత్యక్ష ఉద్యోగాలు కోల్పోవడం, లాజిస్టిక్స్–వ్యాపారాలు ఘన్‌పూర్ వైపుకు వెళ్లిపోవడం, భవిష్యత్ రైల్వే నిధులు మరొక జిల్లాకు మళ్లిపోవడం వంటి భారీ నష్టం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకసారి ఈ ప్రాజెక్ట్ బయటకు వెళ్లిపోయిన తర్వాత తిరిగి ఈ జిల్లాకు రాకపోవడం దాదాపు ఖాయం కావడంతో ప్రజలు ఇప్పుడు మౌనం వీడి నేతలను నేరుగా ప్రశ్నించడం ప్రారంభించారు. జిల్లా భవిష్యత్తు కళ్లముందే జారిపోకుండా కాపాడుకోవాలంటే ప్రజలు గళమెత్తాల్సిన సమయం ఇదేనని స్పష్టమవుతోంది. నాయకులు మౌనంగా ఉండొచ్చు కానీ ప్రజలు మాత్రం మౌనంగా ఉండలేరుఅనేది ఇప్పుడు మహబూబాబాద్ ప్రజల స్పష్టమైన సందేశం. నేతల నిర్లక్ష్యం జిల్లాకు చెరిగిపోని నష్టం అందుకే ఇప్పుడే ప్రజలు నిలదీయాలి ఇప్పుడే ఆందోళన మొదలు పెట్టాలి.

# విశ్రాంతి ఉద్యోగస్తుల నూతన కార్యవర్గం సన్మాన కార్యక్రమం



- జగిత్యాల జిల్లా కేంద్రం ఇందిరా భవన్ లో విశ్రాంతి ఉద్యోగస్తుల నూతన కార్యవర్గం సన్మాన కార్యక్రమం

**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు) :** విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం సభ్యులు మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన కార్యవర్గానికి శాలువతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి కి విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలు తెలిపారు. విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో విద్యార్థులు నిరుద్యోగ యువత ఉద్యోగస్తులు ఉపాధ్యాయులతో పాటుగా విశ్రాంతి ఉద్యోగస్తులు కూడా ప్రధానపాత్ర పోషించారు.

ఆనాడు సకలజనుల సమ్మెలో భాగంగా యావత్ తెలంగాణ సమాజం రాజకీయాలకతీతంగా ఉద్యమించడం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోని ఉమ్మడి రాష్ట్రంలో మనం ఏమైతే ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నాము మన రాష్ట్రం మనకు ఏర్పడ్డయితే మనం స్వరాష్ట్రంలో ఆశయాలు ఆకాంక్షలు హక్కులు సాధించుకునే అవకాశం ఉంటుందని,తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకోవడం,ఆనాడు చైర్ పర్సన్ సోనియా గాంధీ రాజకీయంగా ఒరిదుడుకులు ఎదుర్కొన్న గాని ఆంధ్రప్రదేశ్ లో పార్టీ ఉనికి కోల్పోతుంది అని ఊహించి కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చటం ప్రధాన బాధ్యతగా భావించి రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత యూపీఏ చైర్ పర్సన్ సోనియా గాంధీ దక్కుతుంది అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి తెలంగాణ ఉద్యమ నాయకుడిగా ఆనాడు 2014లో కేసీఆర్ గారికి అవకాశం వచ్చింది. దురదృష్టం ఏమిటంటే విద్యార్థులు నిరుద్యోగ యువత వారి సమస్యలు సమస్యలుగానే ఉండిపోవడం,ఉద్యోగస్తులు ఉపాధ్యాయుల సమస్యలు కానీ లేక విశ్రాంతి ఉద్యోగస్తుల సమస్యలే కానీ సమస్యలు ఆశించిన మేరకు పరిష్కారం పొందలేకపోవడంతోని మార్పు కోరడం జరిగింది.

**అందరి మద్దతుతోనే తెలంగాణ సాధించుకున్నాం**

ఆ మార్పులు భాగంగా మొన్నటి శాసనసభ ఎన్నికలలో మీ అందరి మద్దతుతోని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం జరిగింది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంలో ప్రధాన పాత్ర పోషించింది. అదే విధంగా విద్యార్థులు నిరుద్యోగ యువత ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు ఉన్నారు. విశ్రాంతి ఉద్యోగస్తులది కూడా ప్రధాన పాత్ర పోసించారు. దానితోపాటు మనకు రావలసిన ఏరియేస్ జీవితకాలం సర్వీస్ లో ఉండగా సేవింగ్ చేసుకున్నామో రిటైర్మెంట్ తోని పొందలేకపోతున్నాం ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న ఆర్థిక ఇబ్బందులతోని వాయిదాల పద్ధతితోని సమస్యలు ఎదుర్కొంటున్నాం. పిఆర్సి సర్వీస్ ఉద్యోగస్తులకు ఎంత ప్రధానమో విశ్రాంతి ఉద్యోగస్తులకు కూడా పిఆర్సి అంతే ప్రధానం. పిఆర్సి జాప్యం కావడంతోని మనం ఆశించిన ఫలితం పొందలేకపోతున్నాం తప్పకుండా పిఆర్సి సాధ్యమైనంత తొందరలో నిర్ణయింప చేసే విదంగా కానీ మీకు రావాల్సిన మీ సేవింగ్స్ తరితగతలో వచ్చే విదంగా నా వంతు కృసి చేస్తాను అన్నారు.

**ఆరోగ్య భద్రత రాజ్యాంగం కల్పించిన హక్కు**

వైద్య సదుపాయాలకు సంబంధించి ఏ విధంగా నిరుపేద వర్గాలకు ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుందో విశ్రాంతి ఉద్యోగస్తులకు కూడా ప్రభుత్వం ఆరోగ్య సేవలు అందించడం ప్రధానం అని అన్నారు. మీ సమస్యలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను అన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్త పరీక్షలు




**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** వెదురుకుప్పం డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.లావణ్య కుమారి మరియు వై.ఆర్.సి కోఆర్డినేటర్ ఎం.ఇస్మాయిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహించామని రక్త గ్రూప్ ను తెలుసుకోవడం చాలా ముఖ్యమన్నారు. రక్తం మార్పిడి సమయంలో రక్త గ్రూపు ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులకు రక్త పరీక్షలు జరిపి, వారికి ఎంత శాతం రక్తం ఉందో తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఇందులో వెదురుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎం.ఎల్. హెచ్.పి.సుమాసాగరి, ఆశా కార్యకర్త ఎస్.గీత,ఆర్ఆర్సి మరియు వైఆర్సి కమిటీ మెంబర్స్, అధ్యాపక ఆధ్యాపకేతన బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం
25 నవంబర్ 2025


# గందరగోళ రిజర్వేషన్ విధానంపై బీసీల ఆగ్రహం

- మేకల నాగన్న హైకోర్టు తలుపు తట్టిన కీలక పిటిషన్
- రిజర్వేషన్లలో పారదర్శకత లేదని కలెక్టర్ జాబితాపై ఆక్షేపణ
- ఆర్టికల్ 14, 15, 243D ఉల్లంఘన అని పిటిషనర్ ఆరోపణ
- జిల్లా వ్యాప్తంగా బీసీ వర్గాల్లో పెరుగుతున్న అసంతృప్తి
- హైకోర్టు తీర్పు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను మార్చే వీలుంది



**నేటి సాక్షి మహబూబాబా ద్ (భూక్యా రవి నాయక్) :** గందరగోళ రిజర్వేషన్ విధానం- బీసీలకు తీవ్ర నష్టం: మేకల నాగన్న హైకోర్టు తలుపు తట్టిన కేసు కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన మేకల నాగన్న ఇటీవల విడుదలైన గ్రామ పంచాయతీ రిజర్వేషన్ జాబితా రాజ్యాంగ సూత్రాలైన సమన్యాయం, సామాజిక న్యాయం, సమతుల్య ప్రతినిధిత్వాన్ని ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ హైకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకోకుండా తండాలు, గ్రామాలను వేర్వేరు యూనిట్లుగా పరిగణించడం వల్ల ఎస్టీ రిజర్వేషన్ అవసరానికి మించి పెరుగుతోందని, 100% గిరిజన జనాభా ఉన్న తండాలను పూర్తిగా ఎస్టీ కేటగిరీకి కట్టిపడేయటం, అదే సమయంలో సాధారణ గ్రామాల్లో కూడా అదనపు ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వడం వల్ల బీసీ వర్గాలు రాజకీయంగా పూర్తిగా నష్టపోతున్నాయని ఆయన వాదిస్తున్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 243D లను స్పష్టంగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మండలం యూనిట్‌గా తీసుకుంటేనే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, ఉదాహరణకు కురవి మండల జనాభాలో ఎస్టీలు 40% ఉంటే ఆ మేరకు వారి కోటా ఉండాల్సి ఉండగా, గ్రామాలు-తండాల ప్రాతిపదికగా కృత్రిమంగా అధిక రిజర్వేషన్ కేటా యించడం వల్ల ఇతర వర్గాలకు రావాల్సిన అవకా శాలు పూర్తిగా కోల్పోతున్నాయని ఆయన చెప్పారు. కలెక్టర్ విడుదల చేసిన జాబితాలో పారదర్శకత లేకపోవడం, రిజర్వేషన్ లెక్కల్లో నియమాలను పాటి ంచకపోవడం, బీసీల జనాభా ఉన్నప్పటికీ వారికి తగిన స్థానాలు తగ్గిపోవడం ఈ వ్యవస్థ యొక్క పెద్ద లోపంగా ఆయన పిటిషన్‌లో వివరించారు. దీనివల్ల బీసీ వర్గాల రాజకీయ డిస్ప్లేస్‌మెంట్ పెరుగుతోందని, ప్రపోర్షనల్ రిప్రెజెంటేషన్ అనే రాజ్యాంగ తత్వానికి ఇది పూర్తి విరుద్ధమని ఆరోపించారు. ఈ విధానంపై మహబూ బాబాద్ జిల్లాలో బీసీ వర్గాల్లో తీవ్రమైన అసహనం నెలకొంది. ఇది ఒక్క మండలం సమస్య కాదు, రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో ఇదే సమస్య కొనసా గుతోందని నాగన్న తెలిపారు. హైకోర్టు ఈ కేసులో మండలం యూనిట్‌ను ప్రధాన ఆధారంగా తీసుకొని రిజర్వేషన్లను పునర్ పరిశీలి ంచాల్సిందిగా ఆదేశిస్తే, రాబోయే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# సమస్యలను పరిష్కరించాలంటూ కమిషనర్ కార్యాలయం ముట్టడి



- మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కమిషనర్ కార్యాలయం ముట్టడి

**నేటి సాక్షి, నారాయణపేట, నవంబర్ 24 :** ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కార్మికుల అధ్వానంలో సోమవారం అధ్వానంలో సోమవారం కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 54,000 మంది పనిచేస్తున్నారన్నారు. అనేక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన వివరించారు. నేటికీ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో ఇబ్బందుల గురిచేస్తు న్నారన్నారు. కార్మికులు అనేక అప్పులు చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అనేక అవస్థ పాలవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరిష్కారం కొరకై పోరాటానికి సిద్ధమయ్యారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం దుష్ప్రచారం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో కోడిగుడ్లను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. 9 10 తరగతి లకు అల్పాహార బిల్లులను వెంటనే చెల్లిం చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 600 రూపాయలు ఇస్తున్నది. సమాన పనికి సమాన వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే అమలు చేయాల న్నారు. అక్షయ పాత్ర ను వెంటనే రద్దు పరచా లన్నారు లేనియెడల మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కార్మికుల చెన్నమ్మ లక్ష్మమ్మ, ఎల్లమ్మ రమేష్ మొగులమ్మ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 23 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పి ంచగా, 8 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ లు కమిషనర్ ను కోరారు. రెడ్డి అండ్ రెడ్డి కాలనీ లోని పెరుమాళ్ హాస్పిటల్ వద్ద చెత్త ఎక్కువగా ఉంది తొలగించాలని, నారాయణపురం విద్యుత్ స్తంభాలు మార్చాలని, భూగర్భ డ్రైనేజ్ లీకేజీ లను అరికట్టాలని, మారుతి నగర్ లో ఆక్రమణ నిర్మాణాలు అరికట్టాలని, తిమ్మినాయుడు పాలెం లోని రెండు ఎకరాల స్థలంలో అక్రమ నిర్మాణాలకు చేస్తున్న ప్రయత్నాలు అడ్డుకో వాలని, న్యూ బాలాజీ కాలనిలో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని, టిడ్కో ఇండ్ల కొరకు డబ్బులు కట్టాము ఇంకా ఇవ్వలేదు మాకు ఇల్లులు ఇప్పించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని కోరారని కమిషనర్ తెలిపారు. ఆయా సమస్యలను అధికారులకు పంపామని త్వరగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.



# దేశ చరిత్రలో మైలురాయిగా ఖమ్మం సభ



- దేశ చరిత్రలో మైలురాయిగా ఖమ్మం సభ: పశ్య పద్మ
- సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి: దండి సురేష్
- సీపీఐ ప్రచార బస్సు జాతకు ఘన స్వాగతం

**నేటి సాక్షి పాలేరు, నవంబర్ 24:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శతాబ్ది ఉత్సవాల జయప్రదం కోరుతూ బాసరలో ప్రారంభమైన ప్రచార బస్సు జాతా బృందం సోమవారం ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్ గూడెం వద్ద ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో బస్సు జాత బృందానికి పుష్ప గుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కూసుమంచి మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ.. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే 100 సంవత్సరాల ఉత్సవాలను విజయవంతం చేయడం ద్వారా కమ్యూనిస్టులు లేని ప్రచారం చేసేవారికి కనువిప్పు కలిగించాలని సూచించారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి లౌ కికవాదులు కమ్యూనిస్టు పార్టీల నాయకులు కలిసి రావాలని అన్నారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతూ ఆదివాసులలో జైల్లో పెడుతున్నారని, మావోయిస్టులను హతమారుస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మం సభ దేశ చరిత్రలోనే ఒక మైలురాయిగా మిగిలిపోనుందని అన్నారు. పోరాటాలతోనే పాలకుల అరాచకాలను తిప్పి కొట్టడం సాధ్యమవుతుందని అన్నారు.సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర పోరాటంలోనే కాక అనేక ప్రజా ఉద్యమాలు కార్మిక కర్షక ప్రజా పోరాటాలు సమరశీల ఉద్యమాల్లో సిపిఐ కీలక పాత్ర పోషించిందని అన్నారు నిరుద్యోగులు కార్మికులు విద్యార్థుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు పోరాడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టుల ఖిల్లా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్సు జాతా బృందం నాయకులు ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి. కేతరాజు ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్, ఆర్ ఎల్ రవి, పార్టీ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, చెరుకుపల్లి భాస్కర్, పుచ్చకాయల కమలాకర్, గుండెపొంగు మల్లేష్, ఉపేందర్ కూసుమంచి మండల కార్యదర్శి భూక్య నరసింహ, సహకారదర్శి జిల్లా లింగయ్య, మండల నాయకులు పాండురంగ చారి, భూక్య ప్రశాంత్, భూక్య శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ గారి విగ్రహాన్ని పూలమాల వేసి, నివాళి అర్పించిన..

జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్



**నేటి సాక్షి. కొమురంభీం :** ఆసిఫాబాద్ జిల్లాకు నూతన ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన నితిక పంత్ ఐపీఎస్ గారు ఈ రోజు జోడేఘాట్ లోని ఆదివాసి నాయకుడు కొమరం భీమ్ విగ్రహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ముందుగా ఎస్పీ , ఎఎస్పీ లకు ఆదివాసీ పెద్దలు పూల మొక్కలు అందించి, తలపాగా చుట్టి ఘన స్వాగతం పలికారు. ఆదివాసి నాయకులు కొమరం భీమ్ గారి విగ్రహాన్ని సందర్శించి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఆతర్వాత కొమురం భీమ్ మ్యూజియాన్ని సందర్శించి , గిరిజన ఆచార సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. అత్యంత మారుమూల గిరిజన ప్రజలకు కూడా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సహాయం అందిస్తామని అక్కడి పటేల్స్, ప్రజలతో తో అన్నారు. అనంతరం ఆదివాసీ పెద్దలు ఎస్పీ గారిని సన్మానించారు ఈ కార్యక్రమం లో ఆసిఫాబాద్ ఏ.ఎస్.పి చిత్తరంజన్ ఐపిఎస్, వాంకిడి సీఐ సత్యనారాయణ, కేరమేరి ఎస్.ఐ మధుకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్లపెల్లి రాధవ్వ బలగం ఆత్మీయ సమ్మేళనం



**నేటి సాక్షి, కరీంనగర్ కల్చరల్:** తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన గొల్లపెల్లి రాధవ్వ కుటుంబ సభ్యులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మూడు తరాల వారసులు సుమారు 70మంది పాల్గొన్న ఈసమ్మేళనాన్ని మనువలు %ఞ% మనవరాళ్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రాధవ్వకు కుటుంబ సభ్యులు శాలువాలతో సత్కరించి మేమెంటోలు అందజేశారు. ఈసందర్భంగా రాధమ్మ మాట్లాడుతూ తమకున్నదాంట్లో ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెల వివాహాలు ఘనంగా చేశామని తెలిపారు. ఈఅనుభూతి మర్చిపోలేనిదని ఆనందం వ్యక్తం చేసారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలి.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి:( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** గొల్లపల్లి మండలం మల్లనపేటలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లికార్జున స్వామి (మల్లన్న పేట జాతర) సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. నవంబర్ 26 తేదీ నుండి డిసెంబర్ 17 వ తేదీ వరకు జరుగు జాతర సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉండని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాల్లో క్యూలైన్లలో వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులకు స్పందించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు.ఆయన వెంట డిఎస్పి రఘు చందర్, ఎస్పి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్,సి.ఐ రవి, ఎస్.ఐ కృష్ణ సాగర్ రెడ్డి ఉన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో -తిప్పారపు శ్రీనివాస్



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండలం గుగ్గిళ్ళ, పోతారం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల పరిసర గ్రామాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ అన్నారు.సోమవారం ముత్తన్నపేట గ్రామంలో పార్టీ బృందం పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఫ్యాక్టరీ నుంచి నిరంతరం వ్యాపిస్తున్న దుర్వాసన, వ్యర్థాల వల్ల స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని గ్రామస్థులు తనకు వివరించారని చెప్పారు. జన నివాసాలకు దూరంగా నిర్మించాల్సిన ఇలాంటి ఫ్యాక్టరీలను గ్రామాల మధ్యలో అనుమతించడం ప్రజల జీవన ప్రమాణాలను ప్రమాదంలోకి నెడుతోందని ఆరోపించారు. వెంటనే ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుందని శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్పందించని పక్షంలో సమీప గ్రామాల ప్రజలను కలిసి రాజీవ్ రహదారి దిగ్బంధం చేపడతామని హెచ్చరించారు."ప్రజల ప్రాణాలు కావాలా? లేక ఇథనాల్ కంపెనీ ప్రయోజనాలా?" అని ప్రశ్నించిన ఆయన, స్థానిక ఎమ్మెల్యే, జిల్లామంత్రి వెంటనే నిర్ణయం వెల్లడించాలని కోరారు. ఫ్యాక్టరీలను రద్దు చేయడం ద్వారానే ప్రజా సమస్యలపై ప్రభుత్వ చిత్తశుద్ధి బయటపడుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సంఘ ఎల్లయ్య, బొమ్మిడి సాయికృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఆదివారం భగవద్గీత ప్రవచన కార్యక్రమం


గురువులు హెచ్.కె. అంజనాద్రి దాస్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని తొమ్మిదవ వార్డు ప్రకాష్ నగర్ ఆంజనేయ స్వామి గుడిలో ప్రతి ఆదివారం భగవద్గీత ప్రవచన కార్యక్రమం గురువులు హెచ్ కె.అంజనాద్రి దాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని భక్తులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవంతుడి యొక్క జీవిత సారాంశం, హిందూ సంప్రదాయం, జ్ఞానోదయం, భగవంతుడి పాత్యాంశం గురించి ఈ యొక్క భగవద్గీత ప్రవచనం యథాతథము తెలుపుతుందని గురువులు హెచ్.కె. అంజనాద్రి దాస్ అన్నారు. ఈ కార్యక్రమం మొదటి ఆదివారం ఆంజనేయ స్వామి దేవుడి సన్నిధిలో ప్రారంభం అయ్యిందని, వార్డు చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రవచన కార్యక్రమం విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు, స్వాములకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రతన్ సింగ్, చామర్తి అయ్యప్ప శర్మ, అంజిబాబు, చిలువేరు నర్సింహా, పందిరి వెంకన్న బ్రదర్స్, కడారి వెంకన్న, శ్రీనివాస్ రెడ్డి, పొనుగోటి నాగేశ్వర్, చిన్నారులు, భక్తులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గారం మండలంలో గంజాయి పట్టివేత..

**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి: ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామం లోని పల్లె ప్రక్రుతివనం నందు సురజ్ కుమార్ రాహుల్ కుమార్,అనే ఇద్దరు యువకులు గంజాయి తాగుతూ పట్టుబడడం జరిగింది. ఈ ఇద్దరు వ్యక్తుల నుంచి 60 గ్రాముల గంజాయి పట్టుకొని, NDPS చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం. అని ఎస్ ఐ తెలిపారు బుగ్గారం మండలంలో గంజాయి తాగిన అమ్మిన కలిగి ఉన్న చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. గంజాయి గురించి సమాచారాన్ని పోలీసులకు అందించాలని ఎస్ ఐ జి సతీష్ తెలిపారు




# ప్రపంచమే మన పాఠశాల అని సత్యసాయి బాబా విశ్వసించారు



- మానవ సేవే మాధవ సేవ":-బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్

**నేటి సాక్షి నవంబర్ 24 పాములపాడు :** సత్య సాయి బాబా తన జీవిత సందేశంగా "మానవ సేవే మాధవ సేవ" (మానవునికి సేవ చేయడం దేవునికి సేవ చేయడమే) అనే సూత్రాన్ని అనుసరించి, ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉచిత సేవా కార్యక్రమాలను ప్రారంభించారనీ, ఆయన స్థాపించిన శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ద్వారా ఈ సేవలు కొనసాగుతున్నాయనీ బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ తెలిపారు. మండల కేంద్రమైన పాములపాడులోనీ, శివాలయంలో మండల భజన మండలి సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తి సత్య సాయిబాబా శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాలలువేసి, ఆయన చేసిన సేవా కార్యక్రమాల గురించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా భజన మండలి సంఘం అధ్యక్షులు భోజనం నాగేశ్వరరావు, గురూజీ వానాల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ ప్రేమే మార్గం సత్యమే జీవం మానవజాతికి ఒక మంచి ఉత్తమమైన మార్గాలు తెలిపిన వ్యక్తి,అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు స్థాపించబడ్డాయి. వీటిలో గుండె, మూత్రపిండాలు మరియు ఇతర క్లిష్టమైన వ్యాధులకు సంబంధించిన చికిత్సలు మరియు శస్త్రచికిత్సలు కుల, మత, వర్ణ బేధం లేకుండా అందరికీ పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల భజన మండలి గురూజీలు ఆవులయ్య, గోపాలకృష్ణయ్య, శ్రీనివాసులు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సామూహిక 'వందేమాతరం' గీతాలాపన

- సరస్వతి శిశు మందిర్‌లో సామూహిక 'వందేమాతరం' గీతాలాపన
- వందేమాతరం గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కోరుట్లలో ప్రత్యేక కార్యక్రమం



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కోరుట్ల పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ హైస్కూల్‌లో సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బీజేపీ కోరుట్ల పట్టణ శాఖ మరియు అభియాన్ జిల్లా కో-కన్వీనర్ సుధవేణి మహేష్ ఆధ్వర్యంలో జరిగింది.

**దేశభక్తి కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలి: చెన్నమనేని వికాస్ రావు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు మాట్లాడుతూ.. 'బంకిం చంద్ర చటర్జీ' రచించిన ఈ గేయం స్వాతంత్ర పోరాటంలో ఉత్తర నుంచి దక్షిణం వరకు దేశాన్ని ఒకే జెండా కింద నడిపించింది. బ్రిటిష్ రాజును కూలదోసేందుకు చిరస్మరణీయ ధైర్యం, జోష్ నింపిన గేయం ఇది. ఈ గేయం ప్రతి పల్లె, ప్రతి పాఠశాలకు చేరాలనే పిలుపునిచ్చారు ప్రధాని నరేంద్ర మోదీ. అందుకే దేశం కోసం ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనే సిద్ధత ప్రతి పౌరుడిలో ఉండాలని ఆయన పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు,అభియాన్ కన్వీనర్ సూదవేణి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ్, మాజీ కౌన్సిలర్లు మాడవేని నరేష్, పెండం గణేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్, సాడిగే మహేష్, సీనియర్ నాయకులు మాసం ప్రసాద్, తిరుమల వాసు, గందె నవీన్, గిన్నెల శ్రీకాంత్, తోట రాజేశం, గుద్దేటి రాజేందర్, రాధారపు సత్యనారాయణ, ఓం ప్రకాష్, కచ మల్లేష్, మ్యాకల గణేష్, కంఠం శ్రీనివాస్, రాగంశెట్టి సాయి కృష్ణ, కథలాపూర్ మండల నాయకులు, బూత్ ప్రెసిడెంట్లు మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయి



నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.....

**నేటి సాక్షి నారాయణపేట నవంబర్ 24 :** నారాయణపేట: యువతలో క్రీడాస్ఫూర్తిని పెంచుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడలు ప్రముఖ పాత్ర వహిస్తాయనీ నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకొని, టాస్ వేసి మొదటి మ్యాచ్‌ను ప్రారంభించి, స్వయంగా క్రికెట్ ఆడి ఆటగాళ్లతో కలిసి క్రీడా వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు. ఎస్పీ బ్యాటింగ్ చేయడంతో స్టేడియంలో హర్షధ్వానాలు మార్మోగాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "క్రీడలు క్రమశిక్షణ, టీమ్‌వర్క్, సహనాన్ని పెంపొందిస్తాయి. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇచ్చే క్రీడలు యువతనీ సరైన దిశగా నడిపిస్తాయి. యువతలో ప్రతిభను వెలికితీయడం, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించడం కోసం ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ముఖ్యమని" అన్నారు. ఈ ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమె ంట్‌లో జిల్లా వ్యాప్తంగా 30 టీమ్స్ పాల్గొంటుండటంతో పాటు మీడియా రెవెన్యూ, పోలీసు, మీడియా, డాక్టర్లు, లాయర్ కూడా పాల్గొనడం విశేషం. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని యువత టీమ్‌లు పోటీపడుతున్న ఈ వేదిక ద్వారా ప్రతిభావంతులైన క్రీడాకారులు, ఫ్రెండ్లీ వాతావరం అలవడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడాకారులు ఎల్లప్పుడూ క్రీడాస్ఫూర్తిని, నైతిక విలువలను, శాంతి-పరస్పర గౌరవ భావనను పాటించాలని సూచించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, క్రీడల వైపు దారి చూపడం ఇప్పుడు అత్యవసరం. ఇలాంటి కార్యక్రమాలు వారికి సరైన దృక్పథం, ఆరోగ్యకరమైన జీవనశైలి అందించడానికి గొప్ప సాధనం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు మరియు యు-వత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుచానూరులో వైభవంగా రథోత్సవం

భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగిన భక్తులు



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం ఉదయం రథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఉదయం 09.15 గంటలకు ధనుర్ లగ్నంలో రథోత్సవం మొదలై ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలు మంగ సకలదేవతా పరివారంతో వైభవోపే తంగా తిరువీధులలో విహరించే వేళలో ఆ తల్లిని సేవించిన భక్తుల కోరికలు సిద్ధిస్తాయని విశ్వాసం. రథోత్సవం ఉత్సవం మాత్రమే కాదు. భక్తుల హృదయక్షేత్రాలలో తాత్త్వికబీజాలు విత్తే ఒక యజ్ఞం. సింగారించిన పాలకడలి గారాలపట్టిని దర్శించిన వారికి జన్మాది దుఃఖాలు నశించి, మోక్షం లభిస్తుంది. రథోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి అమ్మవారికి రథమండపంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పసుపు, చందనం, పాలు, పెరుగు, తేనె, పన్నీరు, వివిధ రకాల ఫలాలతో అభిషేకం చేస్తారు. అనంతరం అమ్మవారికి విశేషంగా అలంకారం చేస్తారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు అశ్వవాహనంపై అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. రథోత్సవంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, ఈవో శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో శ్రీ వి. వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీ కే.వి. మురళీకృష్ణ, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరింద్రనాథ్, ఆలయ అర్చకులు శ్రీ బాబు స్వామి, శ్రీ శ్రీనివాసా చార్యులు, అర్చకులు, ఇతర అధికారులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం
25 నవంబర్ 2025


# ప్రైవేటీకరణ మత్తులో చంద్రబాబు



సీపీఎం నేత పెనుమల్లి మధు ధ్వజం

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** చంద్రబాబు ప్రైవేటీకరణ మత్తులో జోగుతున్నారని, తమలాంటి వాళ్ళ విమర్శలు వినపడనట్టు నటిస్తూ రాష్ట్రాన్ని అదాని ప్రదేశ్ గా మార్చేస్తున్నారని సిపిఎం మాజీ పార్లమెంట్ సభ్యులు పెనుమల్లి మధు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తిరుపతి యశోదా నగర్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నాటి ఉదయం పెనుమల్లి మధు మీడియా సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలోనూ, దేశంలోనూ జరుగుతున్న అనేక పరిణామాల గురించి వ్యాఖ్యానాలు చేశారు. 66,350 కోట్ల ఖర్చుతో అమరావతి నగరాన్ని ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. పట్టణ ప్రాంతాలలో రోడ్లు, మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్తు తదితర ప్రజా సౌకర్యాలు అన్నింటిని ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పుతూ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నారని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 6400 కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ ను ఆపివేసి 60 డిగ్రీ కాలేజీలు మూతపడ్డానికి చంద్రబాబు ప్రభుత్వం కారణమైందని మరిన్ని కాలేజీలు మూసివేతకు సిద్ధమైన పరిస్థితి నెలకొందని, ఈ కారణంగా 14 లక్షల మంది బీసీ, ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థులు నష్టపోతున్నారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో 100 రోజుల్లో ఫీజు రియంబర్స్మెంట్ అమలు చేస్తామని ప్రకటన చేసిన లోకేష్ హామీ ఏమైందని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించమని విద్యాసంస్థల యాజమాన్యాలు అడిగినందుకు వారిని బెదిరించడం ఎంతవరకు సమంజసం? అని అన్నారు. ఆరోగ్యశ్రీ పథకానికి 3 వేల కోట్లు బకాయిలు పెట్టారని ఈ కారణంగా ఆసుపత్రులు 1300 రకాల జబ్బులకు వైద్యం చేయలేమని తీర్మానించిన విషయాన్ని మధు గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మూసివేతను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్ధించటం ఎవరి ప్రయోజనాల కని ఆయన ప్రశ్నించారు. విశాఖ స్టీల్ కార్మికులను సోమరిపోతులని, అవినీతిపరులని అవమానించడం సమంజసం కాదని అర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమను ఎవరు కోరారని చంద్రబాబు ఉరుకులు పరుగులు తీస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగంలోని స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నడుం కట్టాల్సిన ముఖ్యమంత్రి పక్కనే మరో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నించడమే కాకుండా తన మంత్రులను ఎంపీలను ప్రారంభం కానీ పరిశ్రమకు గనులు కేటాయించమని వినతి పత్రాలు ఇస్తూ కేంద్ర మంత్రుల వెంట తిరుగుతున్న వైనాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు బిజెపితో అంట కాగుతూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని ప్రజలు తిప్పికొట్టకపోతే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని పెనుమల్లి మధు అన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ వామపక్షాలు మాత్రమే ప్రత్యామ్నాయమని మిగిలిన బూర్జువా పార్టీలు బిజెపికి ప్రత్యామ్నాయం కాదని వారి తోకలుగా మారిపోయాయని ఓ ప్రశ్నకు సమాధానంగా వివరించారు.

### తిరుపతి రైల్వే స్టేషన్ లో భక్తులకు రక్షణ కల్పించాలి

తిరుపతి రైల్వే స్టేషన్ లో అభివృద్ధి పనులు ఏళ్ల తరబడి సాగుతున్నాయని ఉదయం పూట ఒక్కసారిగా రైళ్లు వస్తున్న సందర్భాల్లో వేలాదిమంది భక్తులు బయటికి వెళ్లడానికి ప్రయత్నించినప్పుడు తొక్కిసలాట జరుగుతున్నదని ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ వేడుక చూస్తున్నారని దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని. .. ఈ విషయం పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తాను లేఖలు పంపుతానని తక్షణం తొక్కిసలాట నివారణకు తగిన జాగ్రత్తలను రైల్వే యాజమాన్యాలు తీసుకోవాలని పెనుమల్లి మధు సూచించారు. ఈ మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా నేతలు వందవాసి నాగరాజు కందారపు మురళి టి సుబ్రహ్మణ్యం ఎస్ జయచంద్రలు పాల్గొన్నారు.

# మద్యాన్ని, గంజాయిని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలి

- తిరుపతి నగరంలో మద్యాన్ని, గంజాయిని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలి.
- ప్రసూతి హాస్పిటల్ కి వస్తున్న మహిళలకు మెరుగైన వైద్యం అందించాలి.
- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి నదియా డిమాండ్.



**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) :** తిరుపతి నగరంలో మద్యాన్ని, గంజాయిని అరికట్టి మహిళలకు రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి నదియా డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఎన్ఎఫ్ఐడబ్ల్యు తిరపతి నగర ముఖ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బి నదియా మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వం విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో, మద్యం దుకాణాల ముందే మద్యం గంజాయి తాగి విచ్చలవిడిగా మహిళలపై దాడులు చేస్తున్నారని, రోజురోజుకు తిరుపతి నగరంలో రౌడీ మూకలు మహిళలపై, ప్రజలపై దౌర్జన్యాలు చేస్తున్నారని మహిళలు రోడ్లపై రావాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారని వాపోయారు. ఆ ంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు, హోంమంత్రి తిరుపతి నగరం పై ప్రత్యేక దృష్టి పెట్టి డీఎస్పీ స్థాయిలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి తిరపతి నగరాన్ని పరిరక్షిం చాలని డిమాండ్ చేశారు. రాయలసీమకే పేరు ప్రఖ్యాతలు కాంచిన ప్రసూతి ఆస్పటల్ మహిళలకు సరైన వైద్యం అందించక, ఒక్కొక్క బెడ్ పై ఇద్దరు ముగ్గురు మహిళలను పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారని దీనివలన గర్భిణీ స్త్రీలు అనేక ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో పాత ప్రసూతి భవనాన్ని మున్సిపల్ కార్యాలయానికి కేటాయించాలని ప్రకటిస్తే పెద్ద ఎత్తున మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నెలరోజుల పాటు నిరసన తెలియజేసి భవనాన్ని కాపాడమని, ఇప్పుడు ఆ భవనంలో కొన్ని ఫ్లోర్స్ ఖాళీగా ఉన్న కొత్త భవనంలోనే వైద్యం అందిస్తూ బెడ్స్ లేకపోయినా ఒక్కొక్క బెడ్ పై ఇద్దరిని పండబెట్టడం వల్ల మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని దుయ్యబట్టారు. ప్రసూతి హాస్పిటల్ లో మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందించకపోతే పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. తిరుపతి నగరంలో మహిళలకు ఏ సమస్య వచ్చినా ఎన్ఎఫ్ఐడబ్ల్యు ముందుండి పోరాటం సాగిస్తుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు సి రత్నమ్మ, ఎన్ మంజుల, విజయ, హరిత, అలివేలమ్మ, ప్రియా, వాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమం-మా ప్రభుత్వ ప్రాధాన్యత



- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వెల్లడి
- కోరుట్లలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్లలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే కె.సంజయ్, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ చేతుల మీదుగా పెద్ద సంఖ్యలో మహిళలకు చీరలు అందజేశారు. మహిళా సంఘాలు నిర్ణయించిన గ్రామ, మండల సమాఖ్యల ద్వారా పంపిణీ వ్యవస్థను నడుపుతూ ప్రతి మహిళకు చీరలు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసం పెంచే దిశగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోందని ఆయన చెప్పుకొచ్చారు.

### ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వ చర్యలు

మహిళలు ఆర్థికంగా ఎదగేలా వడ్డీ లేని రుణాలపై వడ్డీని ప్రభుత్వం భరిస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, బస్సుల కొనుగోలు, పెట్రోల్ బంకుల ఏర్పాటు వంటి వ్యాపార రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు విస్తరించాయని మంత్రి గుర్తుచేశారు. ఆడబిడ్డల ఆశీర్వాదం సమాజాన్ని ముందుకు నడిపించే శక్తి అని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమం కీలక ప్రాధాన్యత పొందుతోందని ఎమ్మెల్యే సంజయ్ కూడా హైలైట్ చేశారు. అర్హులైన మహిళలందరికీ చీరలు చేరేలా స్థానిక సమన్వయం బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రజాప్రతినిధులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

### పారదర్శక పంపిణీపై అధికారుల దృష్టి

చీరల పంపిణీ కార్యక్రమాన్ని వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాల్సిన అవసరాన్ని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. చీరలు అందుకున్న మహిళల వివరాలు, ఫోటోలను మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేసే ప్రక్రియను ఖచ్చితంగా అమలు చేయాలని ఆయన అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డి.ఆర్డీవో రఘువరన్, ఎమ్మార్వో కృష్ణచైతన్య, ఎంపిడివో రామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ%-%మండల సమాఖ్య ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చీరల పంపిణీకి వచ్చిన మహిళలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న నిశాంత్



**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి ( గుండ ప్రశాంత్ గౌడ్ ) :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘం లోని అక్క చెల్లెళ్ళకు రేవంతన్న కానుక ఇందిరమ్మ చీరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రసమయి బాలకిషన్



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి, దాచారం, వీరపూర్, లక్ష్మిపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను మానకొండూరు మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. వీరితో పాటు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బండి రమేష్, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ముక్కిస తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కిస తిరుపతిరెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, సుధీర్ రెడ్డి, బొల్లం పెద్దన్న, తాడిచెట్టు భూమయ్య, వంగల నరేష్ తదితరులు ఉన్నారు.

## కార్మికులు బీమా సదుపాయన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**నేటి సాక్షి (భూమయ్య)మెదక్ జిల్లా :** భవన , ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో కార్మిక శాఖ కార్యాలయంలో కార్మిక భీమా పెంపు పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్మికుల బీమా పెంపు సదస్సులు ఈనెల 24 నుంచి వచ్చేనెల 8వ తారీకు వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు కార్మికులకు సహజ మరణం సంభవిస్తే ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే 6 లక్షల నుండి పది లక్షల వరకు పెంచారని, ప్రమాదవశత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యంనకు 5 లక్షలు, పాక్షిక అంగవైకల్యం 4 లక్షలు, కార్మికుల పిల్లల వివాహ కానుకగా మొదటి ఇద్దరి కూతుళ్లకు 30,000, కార్మికుల మొదటి ఇద్దరి కూతుళ్లకు ప్రసూతి కానుకగా 30,000, రిజిస్ట్రేషన్ కాని కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే 50,000 తో పాటు ఇతర బీమా సదు-పాయాలు ఉన్నాయని తెలిపారు. కార్మికులు ఈ బీమా పెంపు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఇన్చార్జ్ సహాయ కార్మిక అధికారి సత్యేంద్ర ప్రసాద్, అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి

## కథలాపూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ

### వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ఘనంగా కార్యక్రమం



**నేటి సాక్షి - కథలాపూర్ ( రాధారపు నర్సయ్య ) :** కథలాపూర్ మండల కేంద్రంలో సోమవారం 'మహిళా ఉన్నతి.. తెలంగాణ ప్రగతి' పేరుతో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వయంగా మహిళలకు చీరలు అందజేశారు. పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మహిళల ఆర్థిక ఉన్నతితోనే రాష్ట్ర ప్రగతి

ఈ సందర్భంగా మాట్లాడిన ఆది శ్రీనివాస్, మహిళలు ఆర్థికంగా బలోపేతమైతేనే రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని, ప్రతి హామీలోని ప్రతి అంశాన్ని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలు, మహిళా సంఘాల భవనాల నిర్మాణం, ఆరోగ్య–విద్యా సౌకర్యాలు అన్నీ మహిళల స్వయం సమృద్ధి కోసమేనని ఆయన గుర్తు చేశారు.

### మండల సమాఖ్య భవనం మరమ్మతులకు హామీ

చీరల పంపిణీ అనంతరం ఆది శ్రీనివాస్ కథలాపూర్ మండల శ్రీ శక్తి (మండల మహిళా సమాఖ్య) భవనాన్ని సందర్శించారు. భవనం పరిస్థితిని పరిశీలించిన ఆయన, తక్షణమే మరమ్మతులు చేపట్టి, అవసరమైన అదనపు నిధులు మంజూరు చేస్తానని మహిళా సమాఖ్య సభ్యులకు హామీ ఇచ్చారు. మహిళా సంఘాలు కలిసి పనిచేసే ఈ భవనాలు శక్తి కేంద్రాలుగా మారాలని ఆయన అన్నారు.

### మహిళల నుంచి ఆప్యాయ స్పందన

చీరలు అందుకున్న మహిళలు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను, ప్రభుత్వాన్ని ఆప్యాయంగా అభినందించారు. చీరల నాణ్యత, రంగులు, డిజైన్‌లు అద్భుతంగా ఉన్నాయని, ప్రభుత్వం మహిళల గౌరవాన్ని కాపాడుతోందని వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మహిళా సంఘ నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ మండలంలో ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు వడ్డీ లేని రుణాలు, ఆరోగ్య శిబిరాలు కూడా త్వరలోనే నిర్వహించనున్నట్టు స్థానిక అధికారులు తెలిపారు.


# మేడపెల్లి పాఠశాలల్లో కిశోర రక్ష కార్యక్రమం

## డాక్టర్.జ్యోతి



**నేటి సాక్షి,నల్లబెల్లి నవంబర్ 24** :నల్లబెల్లి మండలంలోని మేడపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్, ఎంపిపిఎస్ గొల్లపల్లి పాఠశాలల్లో ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా. జ్యోతి పర్యవేక్షణలో కిశోర రక్ష కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ ఆరోగ్య పరీక్షలు చేపట్టారు.మొత్తం 120 మంది విద్యార్థులు ఉండగా, అందులో 85 మంది పిల్లలకు జనరల్ హెల్త్ స్క్రీనింగ్, బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్ స్థాయుల పరీక్ష, విజన్ టెస్టింగ్ వంటి సేవలు అందించారు. 35 మంది విద్యార్థులు పరీక్షల నాడు గైర్హాజరయ్యారు. డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ కిశోర వయసు పిల్లల్లో రక్తహీనత నివారణ దృష్టిలోపాల తొందరపాటి గుర్తింపు వంటి లక్ష్యాలతో నిరంతరంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేషన్ వర్కర్లు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొని ఆరోగ్య సేవలను అందించారు.

# మిట్టపల్లి లో యువతి ఆత్మహత్య



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 24:** మండలంలోని దిగువపల్లి పంచాయతీ మిట్టపల్లిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుని మ-రణించిన సంఘటన చోటుచేసుకుంది ఎస్ఐ నాగేశ్వరరావు కథనమేరకు... దిగువపల్లి పంచాయతీ మిత్రులకు చెందిన గౌతమి 23 బెంగళూరులో సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం చేస్తుంది ఈ క్రమంలో బెంగళూరులోనే కార్తీక్ అనే యువకుడితో గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమలో ఉంది పెళ్లి చేసుకోవాలని పెద్దలను అడుగగా ఇరువురి కుటుంబంలోనూ నిరాకరించారు దీంతో మనస్తాపం చెందిన గౌతమి సొంత ఇంటికి వచ్చి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు

# వరి ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

- రైతులు ముందుగానే ఆర్.ఎస్.కె.లలో తమ పేర్లు నమోదు చేసుకోవాలి
- 73373 59375 వాట్సాప్ నెంబర్ కు హాయ్ అని పంపితే మీకు స్లాట్ బుక్ చేస్తారు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**నేటి సాక్షి,బాపట్ల జిల్లా (అమృతలూరు) :** జిల్లాలో వరి ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అమృతలూరు మండల కేంద్రం నందు రైతు సేవ కేంద్రం లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూన్న జిల్లాలో వరి ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని, ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బంది లేకుండా అత్యంత పారదర్శకతతో కొనుగోలు ప్రక్రియ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రేడ్-ఏ క్వింటా రకం ధాన్యం ధర రూ.2,389లు కాగా, సాధారణ రకం ధాన్యానికి క్వింటా రూ.2,369లుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే క్వింటాకు రూ.69లు ధర పెరిగిందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఆన్ లైన్ ద్వారా మిల్లులు, రైతులను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 117 రైతు సేవా కేంద్రాల ద్వారా వరి కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ముందస్తుగా ఆర్.ఎస్.కె.లలో తమ పేర్లు నమోదు చేసుకోవలని, 73373 59375 వాట్సాప్ నెంబర్ కు హాయ్ అని పంపితే మీకు స్లాట్ బుక్ చేసుకుంటే వారి మొబైల్ ఫోన్ కు తెలుగులోనే సమాచారం వస్తుందన్నారు, రైతులు తమకు కేటాయించిన సమయంలోనే ధాన్యం తెచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వరి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు తలెత్తకుండా రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని సేకరణ సిబ్బందికి మూడు పర్యాయలు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. బంగాళాఖాతంలో సాండియో అల్పపీడనం ఏర్పడుతుందని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్య తడవకుండా తార్పాలిన్ పట్టాలను అందుబాటులో వుంచ్చుకోవలని రైతులకు చూచించారు. ధాన్యం తెచ్చే రైతులు 17 శాతం కంటే తక్కువ తేమ ఉండేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంకా ఏమైనా మీ ఊరిలో సమస్యలు ఉన్నాయాని కలెక్టర్ గ్రస్థులను అడగా వీధి దీపాలు లేవని కలెక్టర్ గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పంచాయతీ కార్యదర్శి ని వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ యన్.రామలక్ష్మి, పౌర సరాఫరాల శాఖ డి యం శివ పార్వతి, తహశీల్దార్, యంపిడిఓ,పంచాయతీ సెక్రటరీ సచివాలయ మరియు వ్యవసాయ పౌరసరఫరాల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# చట్టపరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తాం



- సమస్యలు విన్నవించుకున్న 62 మంది అర్జీదారులు
- జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి :** చట్ట పరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీలు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ అర్జీదారులకు భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన 62 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలను జిల్లా ఎస్పీ గారికి విన్నవించుకున్నారు. ఎస్పీ ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో వేగవంతంగా విచారించి, నిర్ణిత గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చెయ్యాలని ఆదేశించారు. అర్జీ దారుల సమస్యను పరిష్కరించడానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ , పి.జి.ఆర్.ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ యు.శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు ఆర్థిక భరోసా

- మృతిచెందిన జనసేన సభ్యుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెక్కు అందజేత
- అందజేస్తున్నజనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు



**నేటి సాక్షి, బాపట్ల జిల్లా (కర్లపాలెం) :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులుగా ఉన్న హుకుమతిరావు నాగంజనేయులు జనసేన పార్టీ కార్యకర్త అలాగే జనసేన సభ్యత్వం తీసుకున్న వ్యక్తి కి ఆదివారం జనసేన అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రమాదవశాత్తు మరణించిన జనసైనికులు కుటుంబాలకి జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు చేతుల మీదుగా బాపట్ల నియోజకవర్గానికి చెందిన హుకుమతిరావు నాగంజనేయులు కుటుంబానికి ప్రమాద బీమా 5లక్షలు రూపాయల చెక్కును అందించారు.అలాగే వివిధ ప్రమాదాలలో మృతి చెందిన వారి కుటుంబాలకు పార్టీ తరుపున ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జనసేన పార్టీలో పనిచేసే కార్యకర్తల కుటుంబాల భరోసా కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యజ్ఞంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం ఉండటంతో వారి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ రూ.5 లక్షలు చెక్కును అందజేశారు.. బాపట్ల జనసేన పార్టీ నాయకులు విన్నకోట సురేష్, హుకుమతిరావు నాగంజనేయులు, వారి భార్యను అన్నపూర్ణ కన్వెన్షన్ హాలుకు తీసుకువెళ్లి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు చేతుల మీదగా చెక్కులు ఇప్పించారు. వారి కుటుంబ సభ్యులు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కి జనసేన నాయకులు విన్నకోట సురేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 220 మంది క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు రూ.11 కోట్లు ఈ విధంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, బాపట్ల నియోజకవర్గ జనసేన నాయకులు పసుపులేటి మహేష్, గరిగంటి శ్రీనివాసరావు, సాయిన రాంబాబు, గుర్రాల రామారావు,రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# పాఠశాల విద్యార్థులకు 34 సైకిళ్ల పంపిణీ



**నేటి సాక్షి, బెజ్జంకి :** బెజ్జంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు, విద్యార్థినులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మోదీ కానుకగా పంపిన 34 ఉచిత సైకిళ్లను సోమవారం ప్రధానోపాధ్యాయులు రేవతి, శ్రీరాములు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహతి లక్ష్మీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. బీజేపీ నాయకులు కరివేద మహిపాల్ రెడ్డి, కొలిపాక రాజు తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలో 20 వేల సైకిళ్లు పంపిణీ చేయడం గర్వకారణమన్నారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు రూ.10,000 మరియు రూ.5,000 బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు బుర్ర మల్లేశం గౌడ్ కొత్తపేట రామచంద్రం, దొమ్మాటి రాములు, యువ మోర్చా మండల అధ్యక్షులు తూముల రమేష్ యాదవ్, సంగా రవి, బండి పెల్లి సునీత గౌడ్, లింగాల లావణ్య, వద్లూరు సాయిలు, వద్లూరు శ్రీనివాస్, శీలం వెంకటేశం, గంప రవికుమార్, బండి పెల్లి శ్రీనివాస్ గౌడ్, గూడ అంజిరెడ్డి, బుర్ర కిషన్ గౌడ్, ఐలేని భాస్కర్ రెడ్డి, మండలంలోని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు రాజేశం గౌడ్, యువజన సంఘాల నాయకులు శానకొండ రజనీకాంత్ మరియు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
మంగళవారం
25 నవంబర్ 2025


# సీఎం'వా..? రియల్ ఎస్టేట్ బ్రోకర్'వా..!?

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సంచలన ఆరోపణలు
- జగిత్యాలలో బీఆర్ఎస్ మీడియా సమావేశం
- రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం కాకుండా స్కాముల కోసమే పరిపాలన సాగిస్తోందని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అవతారం ఎత్తి ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెడుతున్నారనే వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం రేపాయి.

### రూ.40 వేల కోట్ల కంచె-గచ్చిబౌలి భూ స్కాం ఆరోపణ

హైదరాబాద్ నగరంలోని కంచె-గచ్చిబౌలి ప్రాంతంలోని సుమారు 400 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని ఎకరాకు రూ.100 కోట్ల రేటుతో అమ్మేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని డాక్టర్ సంజయ్ ఆరోపించారు. ఈ ఒక్క డీల్‌తోనే రూ.40 వేల కోట్లకు పైగా భారీ స్కాం జరగనుందని ఆయన హెచ్చరించారు. ఈ భూములు గతంలో ప్రభుత్వ ఆస్తులుగా ఉండగా, ఇప్పుడు ప్రైవేటు రియల్టర్లకు బంపర్ లాభాలు అందేలా కాంగ్రెస్ నేతలు కుమ్మక్కయ పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఫార్మాసిటీ 14 వేల ఎకరాలు - ఫ్యూచర్ సిటీ పేరుతో భారీ కుట్ర

ఫార్మా సిటీ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన 14 వేల ఎకరాల భూమిని ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ' పేరుతో పూర్తిగా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టేందుకు రేవంత్ సర్కారు సిద్ధమైందని సంజయ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, అదంతా ప్రజల జేబులకు కాకుండా కాంగ్రెస్ నేతల సన్నిహితుల జేబుల్లోకి వెళ్తుందని ఆయన ఆరోపించారు.

### మెట్రో రైలు, మెట్రో భూములపైనా కన్ను

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.11 వేల కోట్ల అదనపు ఖర్చు చేసి ప్రజలపై భారం మోపుతున్నారని, అదే సమయంలో నగరంలోని 280 ఎకరాల మెట్రో భూములను కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని డాక్టర్ సంజయ్ విమర్శించారు. ఈ భూముల మార్కెట్ వాల్యూ ప్రస్తుతం రూ.30 వేల కోట్లకు పైగానే ఉంటుందని ఆయన అంచనా వేశారు.

### రెండేళ్లలోనే రూ.5 లక్షల కోట్ల దోపిడీ

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు కావొస్తున్న నేపథ్యంలో రెండు సంవత్సరాల రాష్ట్ర బడ్జెట్‌కు సమానమైన దాదాపు రూ.5 లక్షల కోట్ల దోపిడీకి పాల్పడ్డారని కల్వకుంట్ల సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వ భూముల అమ్మకాలు తప్ప ప్రజలకు ఏమీ జరగలేదని, ఈ డబ్బు అంతా కాంగ్రెస్ నేతల సొంత జేబుల్లోకి వెళ్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### యువతను ప్రశ్నించమని పిలుపు

ఈ అక్రమాలన్నీ బయటపెట్టి, ప్రజల ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని డాక్టర్ సంజయ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును రియల్ ఎస్టేట్ మాఫియాకు కట్టబెట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన కోరారు.

### రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతమవుతున్న భూ కుంభకోణ చర్చ

గత కొన్ని వారాలుగా హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్ పరిధి నుంచి ఫార్మాసిటీ వరకు ప్రభుత్వ భూముల అమ్మకాలపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు నిరసనలు చేపడుతున్నారు. రూ.లక్ష కోట్లకు పైగా స్కాములు జరిగే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్ నేతలు మాత్రం ఇవన్నీ అభివృద్ధి కోసమేనని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన దోపిడీ కంటే పారదర్శకంగా జరుగుతోందని స్పందిస్తున్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నిర్వహించనున్న నిరసన కార్యక్రమంతో ఈ వివాదం మరింత ఉద్ధృతమవుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి




### సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల సీపీఎం కార్యాలయంలో సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో గ్రామపంచాయతీ ఎన్నికలు జరగబోతున్నాయని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు చేయాలని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండే కార్యకర్తలు ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. అందుబాటులో ఉండే నాయకుడిని ఎన్నుకుంటే గ్రామాల అభివృద్ధితోపాటు ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకునే అవసరం ఉందన్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రజా నాయకులను ఎన్నుకోవాలని కోరారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పాలకులు విధానాలను తీసుకొస్తున్నారని, అందులో భాగంగానే కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకరావడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దాని ఫలితంగా కార్మికులకు పని లేకుండా పోతుందని, భవిష్యత్తులో ఉత్పత్తి రంగాలపై ప్రభావం చూపి ధరలు పెరిగే అవకాశం ఉందని, ఈ భారం ప్రజలందరిపై పడుతుందని చెప్పారు. పాలకులు అవలంభిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మాలోత్ వినోద్ నాయక్, కమిటీ సభ్యులు ఎర్ర నాయక్, కోటిరెడ్డి, దయానంద్, వెంకటయ్య, ఖాజా మొహిద్దిన్, మట్టారెడ్డి, దుర్గయ్య, శ్రీను, శాంతమ్మ, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సొంతింటి కలను సాకారం

**నేటి సాక్షి, జగిత్యాల ప్రతినిధి:( గుండ ప్రశాంత్ గౌడ్ )** :గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆవుల సాయవ్వకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తయి, సోమవారం నాడు గృహప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కూడా హాజరై కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంకల్పించిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం లక్ష్యంగా ఇందిరమ్మ పథకం వేగంగా అమలవుతోందని పేర్కొన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లను మంజూరు చేయడంలో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణంలో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి బిల్లులను పొందాలని సూచించారు.అలాగే, గ్రామాల్లో ప్రొసీడింగ్స్ పొందిన లబ్ధిదారులు నిర్మాణం ప్రారంభించని పక్షంలో ఇతర అర్హులైన వారిని ఎంపిక చేసుకునే పరిస్థితి వస్తుందని మంత్రి హెచ్చరించారు. ఆవుల సాయవ్వ కుటుంబం గృహప్రవేశం చేసుకోవడం ఆనందదాయకమని పేర్కొంటూ, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతా లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు.అనంతరం కలెక్టర్ కలిసి ఆవుల సాయవ్వ నూతన గృహంలో భోజనం చేసిన మంత్రి అడ్లూరి కార్యక్రమంలో ఎమ్మార్వోలు ఎంపిడివోలు, సంబంధిత శాఖ అధికారులు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు




# కొల్చారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ

### జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్




**నేటి సాక్షి (భూమయ్య) మెదక్ జిల్లా కొల్చారం :** సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరి.ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేయాలి. గ్రామాల్లో సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.మొదటగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ గారు ఆవరణ పరిశుభ్రతపై సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీ కెమెరాల పనితీరు గురించి కూడా ఎస్‌హెచ్‌ఓ నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకితభావంతో పని చేయాలని, ఎవరికైతే ఏ విధులు కేటాయించబడతాయో వాటిని సమయానికి పూర్తి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయి అని హెచ్చరించారు. సిబ్బంది యొక్క పిల్లల చదువులను అడిగి తెలుసుకున్నారు.విధుల పరంగా ఎలాంటి సమస్య ఉన్నా తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల సమయంలో పూర్తిస్థాయి సంసిద్ధతతో ఉండాలని, మండలాలు మరియు గ్రామాలను సందర్శిస్తూ విపిఓ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో జరిగే ఆసాంఘిక కార్యకలాపాలు, సామాజిక విఘాతం కలిగించే అంశాలపై సమగ్ర సమాచారం రాబట్టేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను నిర్మించుకోవాలని సిబ్బందికి సూచించారు.గ్రామాల్లో ప్రజలకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, వుమెన్ హరాస్మెంట్ వంటి సమస్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచాలని ఎస్పీ గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో రూరల్ సీఐ జర్జ్ గారు మరియు కూల్చారం ఎసై అహ్మద్ మోహినొద్దీన్ గారు సిబ్బంది పాల్గొన్నారు.

# రామసముద్రం యువతి బెంగళూరులో దారుణ హత్యకు గురి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి నవంబర్ 24 :** అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలానికి చెందిన యువతి దేవిశ్రీ (21) బెంగళూరులో దారుణ హత్యకు గురయిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం దేవిశ్రీ బిక్కంగారిపల్లికి చెందినది మరియు బెంగళూరులో BBA చదువుతూ ఉంది. ఆమెకు చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం పెద్ద కొండామర్రి వాసి ప్రేమ్ వర్ధన్ పరిచయం చేసుకున్నాడు. దేవిశ్రీతో వారి మధ్య ఏం జరిగింది అనేది తెలియనప్పటికీ, నిన్న రాత్రి ప్రేమ్ వర్ధన్ ఆమెను హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై బెంగళూరు పోలీసులు తక్షణమే దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ కొంతమందికేనా ?

### బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి, వీరారెడ్డి



**నేటి సాక్షి : జోగులాంబ గద్వాల జిల్లా కేడి దొడ్డి :** ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటి దొడ్డి మండల టిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణరెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు, మండలంలోని కొండాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన చీరల పంపిణీలు పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి ,వీరారెడ్డి , మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను, ప్రతి ఆడపడుచుకు ఇవ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు ఇచ్చే చీరలు ఇప్పుడు వాటికి ఇందిరమ్మ పేరు పెట్టి కేవలం కొంతమందికే ఇచ్చి ఆడపడుచులను అవమానించిందని ఆరోపించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆడపడుచుల ఓట్ల కోసమే ఈ డ్రామా అని ఆరోపించారు ఎంతో ఆశగా ఆధార్ కార్డు తీసుకొని వచ్చి చీరలు అందక నిరాశతో వెళ్తున్నారు ఎవడబ్బ సొమ్మని ఇష్టం వచ్చినట్టు చీరలను పంచుతున్నారు అని ప్రశచీరలనురు ప్రజా పాలన సమానత్వం మహిళలకు పెద్దపీట వేస్తామని. అవమానిస్తున్నారు అంటూ ప్రభుత్వం కొంతమందికే చీరలు ఇవ్వడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




## మోకాళ్లపై సోమేశ్వరుని కొండ ఎక్కిన భక్తురాలు

**మొక్కు తీర్చిన అనిత**



**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి ) :** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కనక సోమేశ్వర స్వామి కొండపైకి ఓ మహిళ మోకాళ్లపైనే ఎక్కి మొక్కు తీర్చుకున్న ఘటన భక్తులను ఆకట్టుకుంది. రాయికల్ మండలం తాట్లవాయి గ్రామానికి చెందిన నాగవత్ అనిత అనే భక్తురాలు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సోమేశ్వర కొండ కింది నుంచి పైకి మోకాళ్లపై నడుస్తూ కొండను చేరుకున్నారు. కొండపై ఉన్న శ్రీ కనక సోమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను మొక్కిన మొక్కును స్వామి తీర్చినందుకు కృతజ్ఞతగా ఈ కఠిన వ్రతాన్ని పూర్తి చేశానని అనిత తెలిపారు.'సోమన్న కోరిన కోరికలు తీరుస్తాడని నమ్మకం. ఆ నమ్మకం నిజమైందని' ఆమె భావోద్వేగంతో చెప్పారు.

**అభినందనీయం అనిత :** కనక సోమేశ్వర కొండ ప్రాంతంలోని గ్రామస్తులు, భక్తులు ఈ ఘటనను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'కొండ ఎక్కడానికే కష్టం. ఇంత ఎత్తు మోకాళ్లపై ఎక్కడం అసాధారణం. స్వామి భక్తి ఇలాగుంటుంద'ని స్థానికులు అన్నారు.కోరిన కోర్కెలు తీర్చే సోమేశ్వరుడిగా పేరొందిన ఈ ఆలయానికి జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు విరివిరిగా వస్తుంటారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీక మాసంలో ఇక్కడ జనసంద్రం ఉ ంటుంది.అనిత మొక్కు తీర్చుకున్న తీరు స్వామి కృపకు ఇదో నిదర్శనమని భక్తులు అభిప్రాయడుతున్నారు.

## వాల్గొండ ప్రైమరీ పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్

**బీజేవైఎం నాయకుడు పందిరి నాగరాజు సొంత ఖర్చుతో ఏర్పాటు**



**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి ) :** మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు ఉప్పు నీటిని తాగుతూ జలుబు, దగ్గు వంటి జబ్బులు పడుతున్న విషయం తెలుసుకున్న బీజేవైఎం మల్లాపూర్ మండల ఉ పాధ్యక్షుడు పందిరి నాగరాజు వెంటనే స్పందించారు. తన సొంత డబ్బులతో రూ.50 వేల విలువైన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చేశారు.

**ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉంటాను**

సోమవారం ఈ ప్లాంట్‌ను ప్రారంభించిన పందిరి నాగరాజు మాట్లాడుతూ..ఈ రోజు చదువుతున్న చిన్నారులే రేపటి భవిష్యత్తు. వారి ఆరోగ్యం కోసం ఎంత చేసినా తక్కువే. గ్రామ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు.పాఠశాలలో గతంలో బోర్ నీరు ఉప్పగా ఉండటంతో చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని, ఈ విషయం తెలుసుకుని నాగరాజు వెంటనే చర్య తీసుకున్నారని ప్రధానోపాధ్యాయులు రాజు కొనియాడారు.ఇకపై పిల్లలు స్వచ్ఛమైన నీరు తాగుతారు. ఇదో గొప్ప సేవని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉ పాధ్యాయురాలు పూజిత, బీజేపీ గ్రామ అధ్యక్షులు క్యాతం రాజేందర్ రెడ్డి, వీడీసీ సభ్యులు గంగాధర్, ప్రభాకర్, కొండ నర్సయ్య, లంబాడిపెల్లి రాజేందర్, పాట్కూరి సంతోష్ తదితరులు పాల్గొని, పందిరి నాగరాజును అభినందించారు.గ్రామస్తులు ఈ చొరవను హర్షిస్తూ..పిల్లల ఆరోగ్యం కోసం సొంత జేబు ఖర్చు పెట్టడం నిజంగా గొప్ప విషయమని పేర్కొన్నారు.

## 111 జీవోకు తూట్లు అక్రమ నిర్మాణాల జోరు

**నేటి సాక్షి నవంబర్24:** కాటేదాన్ ఐలాలో విచ్చల విడిగా వెలుస్తున్న భారీ షెడ్లు

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్దేవపల్లి డివిజన్ కాటేదాన్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విచ్చల విడిగా 111 జీవోకు విరుద్దంగా పదుల సంఖ్యలో భారీ షెడ్ల నిర్మాణాలు ఏదేచ్చగా సాగుతున్నాయి.ఈ ప్రాంతం 111 జీవో పరిధిలోకి వస్తుంది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టెందుకు ఆస్కారం లేదు. అయినను దర్జాగా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.అక్రమ నిర్మాణాల పై ఐలా అధికారులకు ఎన్ని ఫిర్యాధులు అందినా కాముష్ ఉంటున్నారే తప్పు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అసలు ఐలా అధికారులు ఉన్నట్టా లేనట్టా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని స్థానిక ప్రజలు అంటున్నారు.ఐలా కార్యాలయానికి కమిషనర్ రారు,అక్రమ నిర్మాణాల పై పర్యవేక్షణ ఉండదు, అంతా కింది స్థాయి సిబ్బందే చూసుకుంటూ అక్రమార్కులతో కుమ్మక్కై అందిన కాడికి దండుకుంటూ అక్రమ నిర్మాణాలకు కావాల్సిన అన్ని పనులను వారి దగ్గర నుండి చక్కబెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ ఈ అక్రమ నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించి కట్టడి చేయాలనీ అలాగే కిందిస్థాయి సిబ్బంది పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

# క్రీడలు విద్యార్థి జీవితంలో అంతర్భాగం

- అథ్లెటిక్ పోటీల ప్రారంభోత్సవంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్
- మెట్‌పల్లి అంబేద్కర్ స్టేడియంలో విద్యార్థులకు ప్రోత్సాహం




**నేటి సాక్షి - మెట్ పల్లి ( రాధారపు నర్సయ్య ) :** మెట్‌పల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కోరుట్ల శాసనసభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై ఆటలను అధికారికంగా ప్రారంభించి, పాల్గొన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

**క్రీడలు విద్యార్థి జీవితంలో అంతర్భాగం**

విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దృఢత్వం కోసం మాత్రమే కాదు, విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, సమయ నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం,ఓటమి-విజయాలను సమానంగా ఎదుర్కొనే మనస్తత్వం నేర్పే మహా గురువులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను బయటపెట్టడానికి ఇలాంటి జిల్లా స్థాయి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**గ్రామీణ ప్రతిభకు బంగారు అవకాశం**

అథ్లెటిక్స్‌లో దేశ-విదేశాల్లో తెలంగాణ పేరు మార్మోగిల్లేలా చేయగల సత్తా మన గ్రామీణ విద్యార్థుల్లో ఉందని డాక్టర్ సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి కృషి చేస్తే రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు మెట్టు ఎక్కవచ్చని, ఇందుకోసం ప్రతి విద్యార్థీ తనలోని ప్రతిభను గుర్తించి, అవకాశం వచ్చినప్పుడల్లా క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. 'మీలో ఒక్కొక్కరూ రేపటి పీటీ ఉషా, హిమా దాస్, నీరజ్ చోప్రా కావచ్చు'అంటూ యువతను ప్రోత్సహించారు.

**నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు**

పోటీలను అత్యంత విజయవంతంగా నిర్వహిస్తున్న జగిత్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వాహకులను, కోచ్‌లను, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను ఎమ్మెల్యే సంజయ్ ప్రత్యేకంగా అభినందించారు. వారి కృషి వల్లే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంత పెద్ద వేదిక లభిస్తోందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ఎలేటి ముత్యంరెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, బీఆర్ఎస్ స్థానిక నాయకులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన వందలాది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.

# మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ





- నవంబర్ 25న మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 25న ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా సంఘాలకు మూడో విడత వడ్డీ లేని రుణాలు పెద్ద ఎత్తున పంపిణీ చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు.304 కోట్లు విడుదల - మూడో విడతలో 3.57 లక్షల సంఘాలకు ప్రయోజనం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు రెండు విడతలుగా వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసిన నేపథ్యంలో, మూడో విడతగా రాష్ట్రవ్యాప్తంగా 3,57,098 మహిళా సంఘాలకు రూ.304.17 కోట్ల నిధులను ఈ రోజు (నవంబర్ 24) విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. రేపు (నవంబర్ 25) నుంచి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా మంత్రులు, శాసనసభ్యులను ఆహ్వానించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మండల మహిళా సమాఖ్యలు, గ్రామ స్థాయి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

**ఇందిరమ్మ చీరల పంపిణీపై మహిళల నుంచి అపూర్వ స్పందన**

ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం పట్ల మహిళల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతోషం వ్యక్తం చేశారు. చీరల రంగు, నాణ్యత పట్ల మహిళలు అత్యంత ఆనందం వ్యక్తం చేస్తున్నారని, తక్కువ సమయంలోనే ప్రతి గ్రామానికి చీరలు చేర్చి అర్హులైన మహిళలకు పంపిణీ చేసిన కలెక్టర్లు, అధికార యంత్రాంగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మహిళల నుంచి ఎనలేని మద్దతు లభిస్తోందని, మూడో విడత వడ్డీ లేని రుణాలకు రూ.304 కోట్లు మంజూరు చేసినందుకు మహిళల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**సీఎస్ ఆదేశాలు- పకడ్బందీగా అమలు కోసం ప్రత్యేక దృష్టి**

ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ, మూడో విడతలో రూ.304 కోట్లకు పైగా నిధులు విడుదలైనట్లు తెలిపారు. ఈ నిధులను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సమన్వయంతో పంపిణీ చేయాలని, కార్యక్రమం పకడ్బందీగా జరిగి మహిళలకు వడ్డీ లేని రుణాలు సక్రమంగా అందే సందేశం రాష్ట్రవ్యాప్తంగా వెళ్లేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తున్న విషయాన్ని మహిళా సంఘ సభ్యులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**ఇతర సంక్షేమ అంశాలపై కీలక ఆదేశాలు**

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రీ-మెట్రిక్ (9, 10వ తరగతి) మరియు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీపై కూడా చర్చించారు. అర్హులైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, పట్టణ ప్రాంతాల్లో నిర్మించిన 57 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను త్వరలోనే అర్హులకు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా నుంచి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ్ గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్, జిల్లా పౌర సంబంధాల అధికారి పల్లికొండ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో చెస్ అభివృద్ధికి మరో పెద్ద అడుగు

- ఎమ్మెల్యే సంజయ్ చే 250 ఉచిత చెస్ బోర్డుల పంపిణీ
- జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా కార్యక్రమం



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** కోరుట్ల నియోజకవర్గంలో చెస్ క్రీడను ప్రోత్సహించే దిశగా మరో ముందడుగు పడింది. కోరుట్ల శాసనసభ్యులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అభ్యర్థన మేరకు చెస్ నెట్‌వర్క్ ఫౌండేషన్ సహకారంతో కోరుట్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు 250 ఉచిత చెస్ బోర్డులను ఎమ్మెల్యే సంజయ్ స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక చెస్ బోర్డు అందేలా విస్తృత కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

**సెల్‌ఫోన్ బదులు చెస్ - మానసిక దృఢత్వం కోసం**

ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన డాక్టర్ సంజయ్, గ్రామీణ ప్రాంత విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా చెస్ ఆట ద్వారా ఏకాగ్రత, మానసిక అభివృద్ధి, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. చెస్ ఆట కేవలం గెలుపు-ఓటమి కాదు, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే ధైర్యాన్ని, ప్రణాళికా నైపుణ్యాన్ని నేర్పుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, గ్రామీణ యువత-యువకులు చెస్ ద్వారా మానసిక దృఢత్వం సాధించేలా ఇకపై మరిన్ని చెస్ బోర్డులు అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**చెస్ నెట్‌వర్క్ ఫౌండేషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు**

చెస్ నెట్‌వర్క్ ఫౌండేషన్ ఫౌండర్ సుధీర్ కోదాటి, రవి మయిరెడ్డి మరియు సంస్థ సభ్యులందరికీ ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చి సహకారం అందించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ కోరుట్ల నియోజకవర్గంలో చెస్ పోటీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిన ఈ సంస్థ ఇప్పుడు ఉచిత బోర్డుల పంపిణీతో మరింత బలం చేకూర్చిందని ఆయన అన్నారు.

**కోరుట్ల నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు**

కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఇలాంటి వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హామీ ఇచ్చారు. గత కొంతకాలంగా ఆయన ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, క్రికెట్, కబడ్డీ వంటి క్రీడలతో పాటు చెస్ క్రీడకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. కోరుట్లలో చెస్ క్రీడను గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఈ చొరవ మరింత ఊతమిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం



- ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు

**నేటి సాక్షి (భూమయ్య మెదక్ జిల్లా ఆందోల్ :** మహిళామణులు ఆర్థికంగా బలపడేందుకు స్వయం సమృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఇందిరా మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గ్ మండలంలో రేగోడు ,టేక్మాల్ అల్లాదుర్గం రేగోడు మండలాలకు సంబంధించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి మెదక్ ఆర్డీవో రమాదేవి జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు 500 కోట్లు రుణాలు బ్యాంకు లింకేజీ ద్వారా అందించామన్నారు ఉచిత విద్యుత్,500 రూపాయలకు గ్యాస్ సబ్సిడీ 13 కోట్ల రూపాయలను లక్ష 26 వేల కుటుంబాలకు అందించామన్నారు. జిల్లాలో 9,000 ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, మహాలక్ష్మి ద్వారా మహిళకు ఉచిత ప్రయాణం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాను మహిళల అందించి వారిని కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీతో పండుగ వాతావరణం.. నెలకొందని చెప్పారు.మహిళల ఉన్నతి – తెలంగాణ ప్రగతి అనే కార్యక్రమం కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఉత్సవంలా పండుగలా ఊరూరా నిర్వహిస్తు_న్నామన్నారు.మహిళలు గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వం. రాష్ట్రంలోని కోటి మంది మహిళా మణులను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే మహోన్నత లక్ష్యంతో ముందుకు పోతుందన్నారు.మహిళా ఉన్నతి %-% తెలంగాణ ప్రగతి పేరిట 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చీరల పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంత మహిళలకు తొలి విడతలో చీరలను పంపిణీ చేస్తున్నారని, పట్టణ ప్రాంతాలలో మార్చి 1వ తేదీ నుండి వారం రోజుల పాటు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. మహిళా సంఘాలలోని సభ్యులకు రుణాలు అందిస్తూ నిలదొక్కుకునేందుకు మార్గం సుగమం చేసింది. రుణాలు అందించి.. చేయూత ఇస్తుంది అని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఇప్పటికే లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని వెల్లడించారు. అనంతరం అల్లాదుర్గ్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ కార్యాలయాన్ని పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎన్నికలను పకడ్బందీగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

# యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం



- జగిత్యాలలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ
- ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్
- మిషన్ కాంపౌండ్‌లో ఘనంగా కార్యక్రమం

**నేటి సాక్షి - జగిత్యాల ( రాధారపు నర్సయ్య ) :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో జగిత్యాల జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ (2025-27) నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కోరుట్ల శాసనసభ్యులు, బీఆర్ఎస్ నేత డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని వివిధ చర్చిలకు చెందిన పాస్టర్లు, సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులకు బైబిల్ అందజేసి, దీవెనలు అందించారు.

### సేవా కార్యక్రమాలను కొనసాగించాలి - ఎమ్మెల్యే సంజయ్

ఈ కార్యక్రమంలో డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ..క్రైస్తవ సమాజం ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు. క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్యం, సేవా రంగాల్లో చేస్తున్న కృషి అపారమని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వారు నిర్వహిస్తున్న పాఠశాలలు, ఆసుపత్రులు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 'మతం పేరుతో కాదు, మానవత్వం పేరుతో సేవ చేయడం క్రైస్తవ సమాజం గొప్పతనం. జిల్లాలో ఎక్కడైనా కష్టం వచ్చినా ముందుగా పరుగులు పెట్టేది పాస్టర్లే. ఈ సేవా దృక్పథాన్ని మరింత విస్తరించాలని' ఆయన సూచించారు.

### నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి తదితర కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్ అభినందించారు. వారికి బైబిల్, శాలువాలు అందజేస్తూ, రాబోయే రెండేళ్లలో జిల్లాలోని అన్ని మండలాల్లో సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఆకాంక్షించారు. ప్రార్థనా సభలు, వైద్య శిబిరాలు, విద్యా సహాయ కార్యక్రమాలు మరింత ఉధృతంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన అధ్యక్షులు పాస్టర్ డేవిడ్, కార్యదర్శి పాస్టర్ సామ్యూల్, ఇతర కార్యవర్గ సభ్యులు, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ ప్రాంతాల నుంచి వచ్చిన పాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, స్థానిక క్రైస్తవ సంఘ నాయకులు కూడా హాజరయ్యారు.ఈ కార్యక్రమం జిల్లాలో మత సామరస్యం, సేవా కార్యక్రమాలకు మరోసారి బలాన్ని చేకూర్చిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



- వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంది
- అర్హులైన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలి
- అన్నదాత సుఖీభవ ద్వారా 46.85 లక్షల మందికి పెట్టుబడి సాయం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్

**నేటి సాక్షి, బాపట్ల జిల్లా ప్రతినిధి (అద్దంకి) :** వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులకు వ్యవసాయం లాభసాటిగా



మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతన్న సేవలో మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఇందులో భాగంగా అద్దంకి నియోజకవర్గంలోని రైతులతో మంత్రి గొట్టిపాటి సమావేశం అయ్యారు. ఇటీవల విడుదల చేసిన అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులతో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ రైతుకు అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏటా రైతుల అకౌంట్లలో విడతల వారీగా రూ.20 వేలు జమ చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 46.85 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పథకం అమలుకు ఏటా ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని అన్నారు. ఇనాం భూములు ఉన్న రైతులకు గత ప్రభుత్వం రూ.7 వేలు ఇచ్చిందని.. కానీ కూటమి ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.14 వేలు జమ చేస్తోందని పేర్కొన్నారు.

### విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ

అద్దంకి మండలం నాగులపాడు గ్రామంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న 37 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. NREDCAP, Assist అనే సంస్థల సహకారంతో ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యను ప్రోత్సహించే దిశగా దాతలు ముందుకొచ్చి సైకిళ్లను అందించడం అభినందించదగిన విషయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు దూరం కాకుండా, తరగతులకు గైర్హాజరు కాకుండా ఉండేందుకు, డ్రాపౌట్ల సంఖ్య తగ్గించేందుకు సీఎస్ఆర్ నిధుల సహాయంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందిస్తున్నామని ఆయన చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 5 వేలకు పైగా విద్యార్థులకు ఇప్పటి వరకు సైకిళ్లను ఉచితంగా అందించామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ఇందులో అద్దంకి జూనియర్ కళాశాల విద్యార్థుల కూడా ఉన్నారని గుర్తు చేశారు.

### కమ్యూనిటీ హాలు ప్రారంభం

అనంతరం నాగులపాడు గ్రామంలో రూ.30 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ప్రారంభించారు. స్థానికులకు అంకితం ఇచ్చారు. గ్రామ ప్రజల సామూహిక అవసరాలను తీర్చే వేదికగా ఈ కమ్యూనిటీ హాల్ నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించిన మంత్రి.. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మహిళల ఆత్మ గౌరవమే లక్ష్యం



**నేటి సాక్షి,, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్) :** మహిళల ఆత్మ గౌరవమే లక్ష్యం అని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు.సోమవారం మండల కేంద్రము లోని రైతవేదికలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో నాయకులు హాజరై పలువురి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఎమ్మార్వో కనుకయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పులి కృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, అనంతరెడ్డి, మాతంగి అనిల్, చింతల శ్రీధర్ రెడ్డి, రాపోలు నవీన్, స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

# మహిళా సాధికారతకు మరో అడుగు

### ముత్యంపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ



**నేటి సాక్షి - మల్లాపూర్ ( మహేష్ పెంబి ) :** మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలో సోమవారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాల సభ్యులకు చీరలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తూ వడ్డీ లేని రుణాలు, చీరల పంపిణీ, శక్తి భవనాలు వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

### ప్రభుత్వ హామీలు నెరవేరుతున్నాయి

చీరలు అందుకున్న మహిళలు నాణ్యత, రంగులపై సంతోషం వ్యక్తం చేశారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అంతడుపుల పుష్పలత నర్సయ్య, పుంద్రా శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం ద్వారా మండలంలో వేలాది మంది మహిళలకు చీరలు చేరాయి. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని జువ్వాడి నర్సింగ్ రావు హామీ ఇచ్చారు.

# కొమరం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆత్రం సుగుణక్క

### మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావును సన్మానించిన ఆత్రం సుగుణక్క



**నేటి సాక్షి కొమరం భీమాసిఫాబాద్ ప్రతినిధి నవంబర్ 24 :** ఆసిఫాబాద్ :కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన ఆత్రం సుగుణక్క సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.తరువాత ఇద్దరూ జిల్లా పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమీకరణ, రాబోయే కార్యక్రమాల ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మండలస్థాయి నుండి గ్రామస్థాయి వరకు పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకునే విషయంపై అభిప్రాయాలు పంచుకున్నారు.ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ.తనపై ఉంచిన విశ్వాసానికి పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జువ్వజీ అనిల్ గౌడ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు మాసడే చరణ్, యూత్ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యామ్,దుర్గం ప్రశాంత్, సిహెచ్. దీపక్, దుర్గం రవీందర్, మహేష్ గౌడ్, సిడాం తిరుపతి, డి. శ్రీనివాస్,సిడాం తిరుపతి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..




## 'అమ్మా.. నువ్వు ఇక ఒంటరివి కాదు.!!

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కళ్లలో నీళ్లు**

**రోడ్డుపై వృద్ధురాలికి ఆశ్రయం హామీ**



**నేటి సాక్షి - కోరుట్ల ( రాధారపు నర్సయ్య ) :** రోడ్డు మెట్లపై కనిపించిన తల్లి సోమవారం మధ్యాహ్నం.కోరుట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చెస్ బోర్డుల పంపిణీ ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కళ్లు ఒక్కసారిగా ఆగిపోయాయి. పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం బయటి మెట్లపై.. కొద్ది గుడ్డలతో, ఆకలి ఆవేదన కళ్లలో నిండి ఒంటరిగా కూర్చున్న ఓ వృద్ధురాలు. ఆ దృశ్యం ఆయన గుండెను పిండేసింది. వాహనం ఆపించి, నడుచుకుంటూ ఆమె దగ్గరకు వెళ్లారు. 'అమ్మా.. ఇక్కడేం చేస్తున్నావు.? అని అడిగిన ప్రశ్నకు ఆమె కన్నీటి సమాధానం.. ఎమ్మెల్యే సంజయ్ కళ్లను చెమర్చేలా చేసింది.! కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన ఆ అమ్మ.. భర్త చనిపోయాడు, పిల్లలు ఉన్నత స్థితిలో ఉన్నా తనను వదిలేశారు, గ్రామంలో ఇల్లు కిరాయికి దొరక్కపోవడంతో కోరుట్లకు వచ్చి రోడ్డుపైనే రాత్రింబవళ్లు గడుపుతున్నానని.. ఎవరైనా బుక్కెడన్నం పెడితే తింటానని, లేకపోతే పస్తులుంటానని ఏడుస్తూ చెప్పింది.!

### ఒక్కక్షణంలోనే మారిన జీవితం

ఆ అమ్మ మాటలు విన్న డాక్టర్ సంజయ్ కంట నీరు ఆగలేదు. వెంటనే ఫోన్ తీసి కోరుట్ల ఆర్డీవోను పిలిచి..'ఈ అమ్మ మనందరి తల్లి.! ఆమెను వెంటనే సురక్షితంగా షెల్టర్ హోమ్‌కు తరలించండి. ఆహారం, బట్టలు, వైద్యం.. అన్నీ కల్పించండి. ఆమెకు పింఛను, శాశ్వత ఆశ్రయం ఏర్పాటు చేయండ'ని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ వృద్ధురాలి చేతులు పట్టుకుని 'అమ్మా.. ఇక నువ్వు ఒంటరివి కాదు. నేనున్నాను.! అని భరోసా ఇచ్చారు. ఆ క్షణంలో రోడ్డుపై కూర్చున్న ఆ తల్లి ముఖంలో మళ్లీ కాంతి నిండింది. ఎమ్మెల్యే స్పందనను చూసిన స్థానికులు, అధికారులు, పాస్ ప్రజలు.. అందరూ కృతజ్ఞతలు తెలిపారు. నిజమైన నాయకుడు అంటే ఇదే.. మానవత్వం చాటుకున్నరని అభినందించారు.

## అంగరంగ వైభవంగా ఇందిరమ్మ చీరల పంపిణీ

**చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



**నేటి సాక్షి: కొడిమ్యాల నవంబర్ 24: సోమవారం :** జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి మంది తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళా సంఘాలలో ఉన్న సభ్యులకు మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల మహిళా సంఘ సభ్యులకు, చీరల పంపిణీ చేసి తధానంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంతకు ముందులాగా కాకుండా ఆడపడుచులంతా గర్వపడేలా నాణ్యమైన చీరలు పంచడమే కాకుండా మహిళ అభివృద్ధికి ప్రభుత్వ ఎప్పుడూ తోడ్పడుతుందని, మహిళలు అన్నీ రంగాలలో రాణించడానికి మహిళ లోన్స్ లాంటివి పెట్టి మహిళలను ఆదుకునే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తూ పథకాలు పెట్టుతుందని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను ప్రభుత్వము, ఒక్కటి కూడా తప్పకుండా, రాష్ట్రం అప్పుల లో ఉన్నప్పటికీని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని పథకాలతో అన్ని వసతులు రేవంత్ రెడ్డి సర్కార్ కల్పిస్తుందని తెలుపుతూ, అలాగే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 84 చెక్కులలో 8409744 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి 30 చెక్కులను. సగర్వంగా అర్హులకు అందజేయడంతో మండలం అంతా పండగ సందడి నెలకొల్పింది, అలాగే మండలంలోని కోనాపూర్ గ్రామంలో నూతనంగా అంబేద్కర్ విగ్రహాన్నికి పూలమాలలు వేసి తధానంతరం, విద్యుత్వ (వి ) 33 /11/ కె.వి.సబ్‌స్టేషన్ శంకుస్థాపన చేశారు, ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో ప్రత్యేక అధికారి నక్క శ్రీనివాస్. ఎంపీడీవో స్వరూప ఎమ్మార్వో కిరణ్ కుమార్, కార్యదర్శి వంశి, ఏపీఎం మల్లేశం, ఫ్యాక్స్ ఛైర్మన్లు, మేన్నేని రాజనర్సింగరావు, కొత్తూరు మహేష్. మల్యాల మార్కెట్ వైస్ ఛైర్మన్ గడ్డం జీవన్ రెడ్డి,మాజీ సర్పంచులు ఎంపీటీసీలు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## విత్తన చట్టం అవగాహన కార్యక్రమం 2025

- **మెదక్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో విత్తన చట్టం అవగాహన కార్యక్రమం 2025**



**నేటి సాక్షి (భూమయ్య) మెదక్ జిల్లా :** ఈరోజు మెదక్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గల జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా కమిటీ అవగాహన కార్యక్రమంలో మరియు అభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా ప్రస్తుత వ్యవసాయ సాగు పరిస్థితులకు భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రతిపాదించిన చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు మరియు నర్సరీ మొక్కల యొక్క నాణ్యతను సరైన విధంగా నియంత్రించాలని ఉద్దేశంతో ముఖ్యంగా రైతులకు నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలని కారణాలతో మరియు నాణ్యతా లోపం, నకిలీ విత్తనాలను పూర్తి అరికట్టాలని విత్తనాలు దిగుమతిని కూడా సరళీకరించడానికి మరియు రైతు హక్కులను, పూర్తిగా పరిరక్షించాలని ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగింది. విత్తన చట్టం అమలు చేయాలనే భాగంలో వాణిజ్య సరళీకరణ మరియు ఇట్టి చట్టానికి ఎవరైనా ఉల్లంఘనల జరిపినప్పుడు వాటి కారణమైన వారిని పూర్తిగా శిక్ష అర్హులు చేయడానికి కూడా వెనకాడబోమనీ తెలియజేశారు. ఈ చట్టంలో వివిధ నిబంధనలు పొందుపరచడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి కే.దేవ్ కుమార్ తెలిపారు. పార్లమెంటులో ఆమోదించడానికి ముందుగా వివిధ లబ్ధిదారులతో మరియు ప్రయోజన కారులతో చర్చలు చేపట్టి వారి ద్వారానే వచ్చే సలహాలు మరియు సూచనలను తీసుకొని ఈ బిల్లులో మార్పులు చేసి తర్వాత ఆమోదించడం జరుగుతుందని చర్చించారు. ఈ ప్రతిపాదిత చట్టంలో మొత్తం పది అధ్యాయాలు మరియు 48 విభాగాలు ఉన్నాయని అని అన్నారు. ఈ చట్టంలో కేవలం ప్రభుత్వం ద్వారా నోటిఫై అయిన రకాల విత్తనాలు మాత్రమే నియంత్రించ గలిగే అధికారం ఉంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ కె.రాహుల్ విశ్వకర్మ, వ్యవసాయ పరిశోధనల స్థానం బసంత్ పూర్ ప్రధాన శాస్త్రవేత్త డా.ఎం. విజయ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకు విన్సెంట్ వినయ్ కుమార్, వ్యవసాయ అధికారులు డి . వందన, ఎం.యాదగిరి, ఏ.హర్షా, పి.నాగ మాధురి, seed సర్టిఫికేషన్ ఆఫీస్ పృదవి రాజ్, రిషి హైబ్రిడ్ సీడ్స్ కంపెనీ తరఫున డా.ఎ.కృపాకర్ రెడ్డి, ADAM క్రాప్ సైన్స్ తరఫున .ప్రకాష్ రావు, మంజీర కార్యనిర్వాహణ అధికారి ఎస్.కొమరయ్య, సెక్రెటరీ రాజిరెడ్డి, ఎన్.రమాకర్

## వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు



- **గత వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు**
- **కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి,**
- **సంక్షేమం పరుగులు పెడుతుంది**
- **ఎమ్మెల్యే పులివర్తి నాని**

**నేటి సాక్షి తిరుపతి (బాదూరు బాల) తిరుపతి రూరల్ నవంబర్ 24 :** గత వైసిపి పాలనలో ఆంధ్రప్రదేశ్ ను అప్పుల ఊబిలోకి నెట్టివేస్తుందని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నదని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు సోమవారం మండలంలోని మల్లంగుంట లో అన్నదాత సుఖీభవ కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు రాష్ట్ర ప్రజలకు అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచార కార్యక్రమానికి శ్రీకారం కూటమి ప్రభుత్వం చుట్టిందని అన్నారు ముందుగా మల్లంగుంట గ్రామానికి విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి టిడిపి సీనియర్ నాయకులు పార్లపల్లి ముని కృష్ణారెడ్డి గజమాల వేసి స్వాగతం పలికారు మహిళలు కర్పూర హారతులు పట్టి,తిలకం దిద్దారు అనంతరం మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, రైతులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు కూటమి ప్రభుత్వంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు సంవత్సరానికి 20 వేలరూపాయలు విడతల వారీగా ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వమన్నారు 14 వేల రూపాయలను ఆగస్టు, నవంబర్ లో రెండు విడతలుగా రైతుల ఖాతాలో జమ చేసిన కూటమి ప్రభుత్వంపై ప్రతిఒక్కరూ అండగా నిలివాలని కోరారు

అనంతరం ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులైన రైతుల ఇంటి వద్దకు వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరించారు పార్టీ మూల సిద్దాంతంలో రైతు సంక్షేమం ఉంది... పార్టీ జెండాలో నాగలి గుర్తు ఉంది కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుంది. అన్నదాత సుఖీభవ పథకం రానివారు సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకొని నిబంధనలు పాటిస్తే తప్పక వస్తుందని తెలిపారు.పాస్ బుక్కు ,ఆధార్ కార్డు మరియు ఆధార్, బ్యాంకు ఖాతాకు కచ్చితంగా అనుసంధానం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.సంక్షేమ పథకాన్ని రైతులకు వివరించడంతోపాటుగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకన్నారు అనంతరం రైతులతో మాట్లాడారు ఎన్నికల సమయంలో రైతులకు సంవత్సరానికి 20 వేలు విడతల వారీగా ఇస్తామని చెప్పిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం. 14 వేల రూపాయలను ఆగస్టు, నవంబర్ లో రెండు విడతలవారీగా రైతుల ఖాతాలో జమ చేసిందని తెలిపారు. ఇంటి ఇంటి వెళ్లి అన్నదాత సుఖీభవ పథకం గురించి రైతులకు వివరించిన ఎమ్మెల్యే గారు.... పార్టీ మూల సిద్దాంతంలో రైతు సంక్షేమం ఉంది... పార్టీ జెండాలో నాగలి గుర్తు ఉంది........ కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులైన 26062 మంది రైతులకు 17.61 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గారు తెలిపారు. సాదారణ రైతు కుటుంబం నుంచి బయటకు వచ్చి రాజకీయంలో తనదైన శైలిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రైతుల కష్టాలు తెలుసునని కష్టకాలంలో రైతులను ఆదుకునే దిశగా ముందుచూపుతో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అందులోభాగంగా పలు దఫాలు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి వారిని ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతు కష్టాలను చూసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూమామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కేజీకి 8 రూపాయలు చొప్పున రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది. రైతులకు సబ్సిడీ వ్యవసాయ యాంత్రికరణ పరికరాలు, గోకులం షెడ్లు,యూరియా, విత్తనాలు, సెనగకాయలు, డ్రిప్పు పైపులు, ఇతర వస్తువులను సబ్సిడీ ద్వారా రైతులకు కూటమి ప్రభుత్వం అందించిందని ఆయన గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవ పథకం అందని రైతులు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ ఆధార్, బ్యాంకు ఖాతాకు మరియు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డుకు అనుసంధానం చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాన్ని రైతులకు వివరించడమే కాకుండా గ్రామంలోని పలు సమస్యలపై ఆరా తీసి రోడ్డు సమస్య ఉందని తెలుసుకొని ఒక కోటి 50 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఊరిబిండి మౌనిక మునిశేఖర్, మల్లంగుంట సింగిల్ విండో అధ్యక్షుడు మధుశేఖర్ నాయుడు, నాయకులు బడి సుధా యాదవ్ , పొట్టేలు మునస్వామి యాదవ్,వార్తాల శివాయాదవ్ ,దిలీప్, వార్తాల శ్రీనివాసులు, పిపాసి, ఎ మధునాయుడు, సూర్యకిరణ్,మస్తాన్ సాహెబ్ , వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఎ లతమ్మ, ఇన్చార్జి ఎంపిడిఓ దయాసాగర్ సెక్రటరీ లక్ష్మి దేవి,ఎ ఒ సుబ్బారావు,ఎపిఎం నాగేశ్వరరావు, ఎపిఓ ,మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్థిరత్వమే ప్రభుత్వ లక్ష్యం

- **ధర్మారంలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ ప్రారంభించిన మంత్రి అడ్లూరి**



**నేటి సాక్షి, ధర్మారం (నవంబర్ 24):** మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర , ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలి, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని మండల మహిళా సమైక్య సంఘాల ఆధ్వర్యంలో 36 లక్షల తో బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారా నడిపిస్తుందన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలచే కుట్టు మిషన్ కేంద్రాలు, మొబైల్ క్యాంటీన్, ఆర్టిసి అద్దె బస్సుల ఏర్పాటు, సోలార్ విద్యుత్ ప్లాంట్, పెట్రోల్ బంక్ ఏర్పాటు వంటి వివిధ వ్యాపార యూనిట్ల స్థాపనకు కృషి చేస్తామన్నారు. పాఠశాలల్లోనే విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ మహిళా సంఘాలకు ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు.మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళ సోదరీమణులు వ్యాపార విస్తరణలో ఎటువంటి కార్యాచరణ తీసుకున్న ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించామని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా అనేక మంది మహిళలు లబ్ధి పొందుతున్నారని, ప్రయాణాలు చేస్తూ వాణిజ్య వ్యాపార రంగాలలో ఎదిగేందుకు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళా సంఘాలలో లేని మహిళలకు కూడా చీరల పంపిణీ ఉంటుందన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రూప్లా నాయక్, వైస్ ఛైర్మన్ అరిగే లింగయ్య, ఎంపీడీవో ప్రవీణ్, డిప్యూటీ తాసిల్దార్ ఉదయ్ కుమార్, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.